మెయిల్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-4-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 75 పేజీలు: 12 వెల: 6.50

4 నెలల్లోనే 85 వేల వీసాలు జారీచేసిన చైనా!

వక్ఫ్‌చట్టంపై దాఖలయిన పిటిషన్ల విచారణ షురూ! 9లో

## 'సుప్రీం' చీఫ్‌జస్టిస్‌గా బిఆర్ గవాయి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులవుతున్నారు. ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా పదవీకాలం వచ్చేనెల 13వ తేదీతో పూర్తి కావస్తుండటంతో బిఆర్‌గవాయిపేరును ఖన్నా ప్రభుత్వానికి సిఫారసుచేసారు. దీనితో దేశ అత్యున్నత న్యాయస్థానానికి రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తిగా గవాయి నియమితులవుతున్నారు. 1960 నవంబరు 24వ తేదీ జన్మించిన జస్టిస్ గవాయి కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి రామకృష్ణ సూర్యభాన్ గవాయి అంబేద్కర్ భావజాలం ఉన్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు. మహారాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేసారు. 1964 నుంచి 1998వరకూ కూడా ఆయన ఆర్‌పిఐనుంచి లోక్‌సభకు అమ్రావతి నియోజకవర్గంనుంచి ఎన్నికయ్యారు.

బీహార్, సిక్కిం, కేరళ రాష్ట్రాల గవర్నర్‌గా కూడా పనిచేసారు. 2011లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ అధికారంలోకి వచ్చింది. ఆయన సోదరుడు డాక్టర్ రాజేంద్ర గవాయి కూడా 2009లో రామ్‌దాస్ అథవాలేతో కలిసి పనిచేసారు. అయితే ఇద్దరిమధ్య తేడాలు రావడంతో గవాయి కూటమి ఒకటి తెరపైకి వచ్చింది. కాంగ్రెస్‌తో పొత్తులు కుదుర్చుకుంది. ఇక జస్టిస్ గవాయి పరంగాచూస్తే 1985లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ ప్లీడర్‌గా కూడా పనిచేసారు. 2003 నవంబరు 14వ తేదీ బాంబే హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 16 ఏళ్లపాటు జడ్జిగా పనిచేసిన తర్వాత సుప్రీం కోర్టుకు పదోన్నతి పొందారు. ఆయన పేరును ఆనాటి సిజెఐ రంజన్ గగోయ్ ఆధ్వర్యంలోని కొల్లిజియం 2019లో ప్రతిపాదించారు. ఇపుడు కొత్తగా సిజెఐగా బాధ్యతలు స్వీకరించే గవాయి మే 14నుంచి 2025 నవంబరు 24వరకూ మాత్రమే పని >>2


# 15% ఆర్థిక వృద్ధి లక్ష్యం

### • 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌తో సిఎం చంద్రబాబు భేటీ • రాష్ట్రాభివృద్ధి కోసం కొత్తగా 19 పాలసీలు • రాష్ట్ర స్థితిగతులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

**విజయవాడ, ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం 15శాతం గ్రోత్‌రేట్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం 10 నెలలుగా తీసుకున్న చర్యలు, అమలు చేసిన విధానాల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించామని సిఎం అన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని... దృఢమైన నిర్ణయాలతో, ఉత్తమ పాలసీలతో పాలన సాగిస్తూ సమస్యలను అధిగమిస్తున్నామని సిఎం అన్నారు. రాజధాని లేకపోవడం వల్ల రెవెన్యూ జనరేషన్‌కు అనేక సమస్యలు ఉన్నాయని సిఎం వివరించారు. ఈ కారణంగానే ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టామని రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

2019 తరువాత నాటి ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా రాష్ట్ర ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టాన్ని సీఎం వివరించారు. గత 10 నెలల కాలంలో చేపట్టిన కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు ప్రజెంటేషన్ ద్వారా సిఎం వివరించారు. గత 5 ఏళ్ల కాలంలో ఆర్థికంగా జరిగిన విధ్వంసం కారణంగా నేడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో కేంద్రం అదనపు సాయం అందించాలని కోరిన సిఎం..రాష్ట్రంలో నెలకొన్ని ప్రత్యేక పరిస్థితులు దృష్ట్యా కేంద్రం కేటాయింపులు జరిపేలా సిఫారసులు చేయాలని విన్నవించారు. నేను ప్రస్తుతం నాలుగవ సారి సిఎంగా ఉన్నాను. కానీ ఇన్ని సవాళ్లు, ఇన్ని ఆర్థిక కష్టాలు ఎప్పుడూ చూడలేదు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకత్వానికి రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. అప్పుల కోసం గత ప్రభుత్వం తహసీల్దార్ ఆఫీస్‌లు కూడా తాకట్టు పెట్టింది. 25 ఏళ్లకు మద్యంపై వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టింది. ఇలాంటి సమస్యల నుంచి బయటకు వచ్చి రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు గట్టి సంకల్పంతో పనిచేస్తున్నాం.

సంక్షేమ, అభివృద్ధి బ్యాలెన్స్ చేసుకుంటూ, సుపరిపాలన అందిస్తున్నాం. ఇలాంటి సమయంలో...ఈ రోజు మేం నిలబడేందుకు, ముందుకు వెళ్లేందుకు మీరు సాయం చేస్తే...రేపు పుంజుకుని మాకున్న బలంద్వారా అనూహ్య విజయాలు సాధిస్తాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో మా వంతు పాత్ర పోషిస్తాం. తద్వారా దేశ నిర్మాణంలో



ముఖ్యమైన రాష్ట్రంగా నిలుస్తాం. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు, ఉద్యోగ కల్పనకు అవసరమైన పెట్టుబడులు సాధించేందుకు మేం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదంతో స్పీడ్ ఆఫ్ >>2

# మెగా సిటీగా అమరావతి



### గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ విలీనం

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తులో అమరావతి, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ అన్నీ కలిపి మెగాసిటీగా సిఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ రూపొందించారని పురపాలక శాఖమంత్రి పి. నారాయణ వెల్లడించారు. మెగాసిటీకి ఒక అంతర్జాతీయ విమానాశ్రయం అవసరమన్నారు. దాని నిర్మాణానికి 5 వేల ఎకరాలు కావాలని, ఆ మేరకు భూమి పరిశీలించాలని చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. రాజధాని అమరావతిపై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రైతుల భూముల ధర నిలవాలన్నా, పెరగాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని చెప్పారు. విదేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టాలంటే ఫ్లైట్ కనెక్టివిటి ఉండాలని, అందుకే అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కట్టాలనేది సిఎం చంద్రబాబు ఆలోచన అని తెలిపారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయి, >>2

## దోచుకున్న సొమ్ముతో సినిమా

### లిక్కర్ స్కాంలో సిట్ దర్యాప్తు

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వంలో మద్యం కుంభకోణంలో భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. కీలక నిందితునిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖరరెడ్డిపై సిట్ విచారణలోను, ఆయన ఇళ్లపై జరిగిన దాడుల్లో పలు సంచలన విషయాలు వెల్లడవుతు >>2

## యేటా పెరుగుతున్న రెవెన్యూ లోటు

### పనగారియాతో సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.77, 249 కోట్లు అవసరం కాగా... వరల్డ్ బ్యాంక్, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా ఫండింగ్ రూ.31,000 కోట్లు సమకూరాయి. ఇంకా కావాల్సిన నిధులు రూ.47,000 కోట్లు అవసరమని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.బుధవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఫైనాన్స్ కమిషన్‌కు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో కలిసి స్వాగతంపలికారు. అనంతరం సచివాలయం మొదటి బ్లాక్‌లో ప్రభుత్వం >>2



# 15% ఆర్థిక వృద్ధి లక్ష్యం



16వ ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియాను సత్కరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో డి.సిఎం పవన్

>> డూయింగ్ బిజినెస్ అనే విధానంతో మేం పని చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దేశానికి చేస్తున్న సేవలు ఎంతో విలువైనవి. పనగారియా నీతి ఆయోగ్‌లో పని చేసిన సమయంలోనే పోలవరం ప్రాజెక్టును రాష్ట్రానికి అప్పగించారు. దేశంలో ఉన్న ఇతర జాతీయ ప్రాజెక్టుల పురోగతి మందగించడంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని సిఫారసు చేశారు. వచ్చే పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మీరు కూడా రావాలని కోరుతున్నాను" అని సిఎం అన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ వైపు ప్రయాణిస్తోంది. ఒకప్పుడు దేశ వృద్ధి రేటు చూసి ప్రపంచం హేళన చేసేది. కానీ నేడు ప్రపంచం గర్వించే స్థాయిలో భారత్ వృద్ధి సాధిస్తోంది. నేడు మనం ప్రపంచంలో 5వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం... 2028 నాటికి మూడవ స్థానానికి చేరుకుంటాం. 2047 నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అభివృద్ధి చెందుతాం. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తివంతంగా ఉంటున్నాయి. సంస్కరణలు దేశ ముఖచిత్రాన్ని మార్చే ఫలితాలను ఇస్తున్నాయి. ఉమ్మడి ఎపిలో తెచ్చిన అనేక సంస్కరణలు అనేక మార్పులు తెచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఐటీని ప్రోత్సహించాం. మంచి ఫలితాలు వచ్చాయి. నేడు ఏఐ గురించి మాట్లాడుతున్నాం. జనాభా విషయంలో కూడా మేం ఒక పాలసీ తీసుకున్నాం. జనాభా నియంత్రణ నుంచి జనాభా నిర్వహణ వైపు ఆలోచిస్తున్నాం. ఇది భారత దేశానికి కీలకమైన దశ. అమృత్ కాల్ అని చెప్పాలి. దేశం అతి గొప్ప విజయాలు సాధించేలా ఫైనాన్స్ కమిషన్ కీలక భూమిక పోషించాలి అని కోరుకుంటున్నా" అని సిఎం అన్నారు. వివిధ అంశాలపై ఆర్థిక సంఘం తమ అభిప్రాయాలు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ పై చైర్మన్ తో పాటు కమిషన్ సభ్యులు ప్రశంసలు తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకువెళ్లారా అని సీఎంను పనగరియా అడిగారు... ఇంకా లేదని, వచ్చే నెలలో ప్రధానితో భేటీ సందర్భంగా ఆయనకు ఈ ప్రాజెక్ట్‌పై వివరిస్తామని సిఎం తెలిపారు. ప్రభుత్వ సేవలకు కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా ప్రతి ఒక్కరూ వాట్సాప్ ద్వారా సేవలు పొందే పరిస్థితి తీసుకువస్తున్నామని రానున్న రోజుల్లో 1000 సేవలు అందిస్తామని సిఎం ఈ సందర్భంగా చెప్పారు. ఒక ముఖ్యమంత్రి స్వయంగా ఆర్థిక అంశాలపై ప్రజెంటేషన్ ఇవ్వడం తమను ఎంతో ఆశ్చర్య పరిచిందని, వృద్ధి గణాంకాలపై ఇంత లోతుగా విశ్లేషించడం, కేంద్ర సాయం పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను పనగారియా ప్రశంసించారు. మరోవైపు 30 ఏళ్ల క్రితం తాను హైదరాబాద్ వెళ్లిన నాటికి... నేటికీ ఎంతో అభివృద్ధి చెందిందని.. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వల్లే సాధ్యమైందని ఆర్థిక సంఘం సభ్యురాలు అన్నెజార్జ్ మాథ్యూ అన్నారు. అమరావతి కూడా అదే స్థాయిలో చంద్రబాబు అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్ సమావేశంలో వివరించారు. ఎపి వృద్ధికి అనుకూలతలు గురించి వివరించారు. అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ తూర్పు దేశాలకు గేట్‌వేగా ఉంది. 3 పారిశ్రామిక కారిడార్లు, విశాఖచెన్నయ్, చెన్నయ్-బెంగళూరు, బెంగళూరు-హైదరాబాద్ కారిడార్లు ఉన్నాయి. 6పోర్టులు, 7ఎయిర్ పోర్టులు ఉన్నాయి. దేశ ఎగుమతుల్లో 5.8 శాతం రాష్ట్రం నుంచేఅవుతున్నాయి. బ్లూ ఎకానమి, ఐటీ, నాలెడ్జ్ ఎకానమి, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్, ఐవోటీ, బ్లాక్ చెయిన్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందుంది. గ్రీన్ హైడ్రోజన్, సోలార్, అమోనియా... ఇలా గ్రీన్ ఎనర్జీకి ఏపీ హబ్‌గా ఉంది. అటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ వంటి నగరాలు అమరావతికి చేరువలో ఉన్నాయి. ఈ నాలుగు నగరాలను కలుపుతూ దక్షిణ భారత దేశం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే వికసిత్ భారత్ లక్ష్యంలో భాగం అవుతుంది. భారతదేశాన్ని 2047 కల్లా వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు విజన్ రూపొందించుకున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్వర్ణాంధ్ర2047 విజన్‌తో పది సూత్రాల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి కనీస అవసరాలు తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఒక్క కుటుంబానికి సొంతిళ్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, కుళాయి కనెక్షన్, వంటగ్యాస్, సమృద్ధిగా విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, విద్యుత్ ఆదా చేసే వీధి లైట్లు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాం.జీరో పావర్టీ లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకునే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సమాజంలో అసమానతలు తొలిగేలా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.

**స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు**

ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ అవతరించేలా కృషి చేస్తున్నాం. తలసరి ఆదాయం 42,000 వేల డాలర్లకు చేరడంతో పాటు ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, సగటు జీవిత కాలం 85 ఏళ్లు, అక్షరాస్యత 100 శాతం సాధించడం, నిరుద్యోగ రేటు 2 శాతానికి మించకుండా అభివృద్ధి చెందేలా చూస్తున్నాం. రాష్ట్రానికి రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమన్నారు.ప్రస్తుతం జీఎస్డీపీ రూ.18.25 లక్షల కోట్లు ఉండగా, 202829 నాటికి రూ.29.29 లక్షల కోట్లకు చేరుకోవాలనేది లక్ష్యమన్నారు. 2014లో రాష్ట్ర విభజనతో ఆదాయ వనరులు అన్నీ తెలంగాణకు వెళ్లాయి. కేవలం ప్రాథమికరంగంపైన మాత్రమే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ ఆధారపడాల్సి వచ్చింది. 2014లో ఏపీకి 31శాతం ఆదాయం ప్రధానంగా వ్యవసాయ రంగం నుంచి వస్తే, తెలంగాణ రాష్ట్రానికి 16 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది. అలాగే పరిశ్రమల రంగం నుంచి ఏపీకి 25 శాతం, తెలంగాణకు 22 శాతం, సేవల రంగం నుంచి ఏపీకి 44 శాతం, తెలంగాణ 61 శాతం వాటా ఉంది.2023- 24 నాటికి ఏపీ ఆదాయంలో వ్యవసాయరంగం వాటా 34 శాతం ఉంటే, భారతదేశానికి 20 శాతం, తెలంగాణకు 15 శాతం ఉంది. ఏపీలో పరిశ్రమల రంగం వాటా 24 శాతం ఉంటే, భారతదేశంలో 26శాతం, తెలంగాణలో 18 శాతం ఉంది. ఏపీలో సేవలరంగం వాటా 42 శాతంఉంటే, భారత దేశంలో 54శాతం, తెలంగాణలో 67శాతం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాద్ ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయం ఏపీ కోల్పోయింది. దీంతో తెలంగాణకు ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇది తెలంగాణ వృద్ధికి, తలసరి ఆదాయం పెరుగుదలకు, ఏపీ వెనకబాటు తనానికి కారణమైంది. 2014 - 2019 మధ్య 13.49 శాతం సరాసరి వృద్ధి వుంటే.2019-2024 మధ్య సరాసరి వృద్ధి బాగా తగ్గిందన్నారు.

## మెగా సిటీగా అమరావతి

>> జనాభా పెరుగుతుందని వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ కోసం భూసేకరణ లేదా భూ సమీకరణ అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే అమరావతిలో పనులు ప్రారంభం అయ్యాయని చెప్పారు. టెండర్లు అన్నీ దాదాపు పూర్తి అయిపోయాయి. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రాంతంలో దాదాపు 15వేల మంది పనులు చేస్తూ ఉంటారు. ఒక సంవత్సరంలోపు అధికారుల భవనాలు పూర్తి చేస్తాం. ఏడాదిన్నర లోపు ట్రంక్ రోడ్లు పూర్తి చేస్తాం. లే ఔట్లలోపు రోడ్లు రెండు సంవత్సరాలలో, ఐకానిక్ టవర్లు మూడు సంవత్సరాలలో కంప్లీట్ చేస్తాము. అన్నీకూడాకచ్చితమైన ప్రణాళికతో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో వందసంవత్సరాలు ముందుకి వెళ్లి ఆలోచిస్తారు. ఇప్పుడు సిటీ అభివృద్ధి చెందాలంటే మంచి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కావాలి, ఒక స్పోర్ట్స్ సిటీ కట్టాలి అనే ఆలోచన ఉంది. అయితే భూ సేకరణ అయితే 5 వేల ఎకరాలు చేయొచ్చు. అయితే భూ సేకరణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ విలువ కంటే రెండున్నర రెట్లువస్తుంది. దీని వలన రైతులు నష్టపోతారు. దానికంటే భూ సమీకరణకే ఇష్టపడుతున్నారని ఎమ్మెల్యేలు చెప్పడం జరిగింది. అయితే ఎయిర్ పోర్టుకు అయిదు వేల ఎకరాలు మిగలాలి అంటే కనీసం 30 నుంచి 40వేల ఎకరాలు తీసుకోవాలి. భూ సేకరణ, భూ సమీకరణ అనేది చర్చిస్తాము. త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటాము. భూములిచ్చిన రైతు సోదరులకు ఎలాంటి అపోహ వద్దని, ఇచ్చిన మాట ప్రకారం అన్నీ చేస్తామని హామీ ఇచ్చారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు అపోహపడాల్సి న పనేం లేదు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లాన్‌తో మూడేళ్లలో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. అధికారుల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఏడాదిలోపు పూర్తి చేస్తాం. ఏడాదిన్నరలో అమరావతిలో సుమారు 360 కి.మీ. ట్రంక్ రోడ్లు నిర్మిస్తాం. రెండున్నరేళ్లలో రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్లలోని రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ టవర్లు నిర్మిస్తాం. ఇప్పటికే అమరావతి పునర్నిర్మాణానికి అవసరమైన 68 పనులకు సంబంధించి రూ.42,360 కోట్ల విలువైన టెండర్లు పూర్తి చేశాం. రాజధానిలో రూ.64,912 కోట్లతో మొత్తం 92 పనులు చేపడతాం అని మంత్రి నారాయణ వివరించారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వం రాజధానిని కట్టనప్పుడు 2014-19 వరకు ఇచ్చిన టెండర్లను రద్దు చేసినా బాగుండేది. వాటికి డబ్బులు చెల్లించకుండా అలాగే ఉంచడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయి. వాటిని పరిష్కరించడానికి 7,8 నెలలు పట్టింది. మళ్లీ టెండర్లు పిలిచాం అని చెప్పారు. విమానాశ్రయంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్రీడానగరాన్ని నిర్మించాలనే ఆలోచనా ఉంది. దీనిని నిర్మిస్తే.. దేశవిదేశాల నుంచి క్రీడాకారులు, అభిమానులు వస్తారు. వారి వసతి కోసం హోటళ్లు ఏర్పాటవుతాయి. ఇలా ఆర్థిక కార్యాకలాపాలు అభివృద్ధి చెందుతాయి.

నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. దానిని దృష్టిలో పెట్టుకుని పని చేస్తున్నాం అని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్, కంకర సరఫరా చేయటానికి గనులశాఖ 5 జిల్లాల్లో 851 ఎకరాలను సీఆర్‌డీఏకు కేటాయించింది. వీటిలో ఏలూరు జిల్లాలో 355, కృష్ణాలో 428, పల్నాడులో 28, గుంటూరులో 21, ఎన్టీఆర్ జిల్లాలో 18 ఎకరాలు ఉన్నాయి. రాజధాని గ్రామం అనంతవరంలోని కొండ ప్రాంతాన్ని 2014-19లోనే సిఆర్‌డిఎకు ఇచ్చారు. వాటిలో గ్రౌండ్ లెవల్ కంటే 6 నుంచి 8 మీటర్ల లోతు వరకు భూమిని తవ్వారు. ఆ ప్రాంతాన్ని మొత్తం డ్రోన్లతో సర్వే చేయిస్తాం. అధికారులతో చర్చించిన అనంతరం గోతులు పూడ్చుతాం. ఆ భూమిని కూడా ఏదో ఒక అవసరాలకు వినియోగించాలనే ఉద్దేశంతోనే అనంతవరం వచ్చా అని తెలిపారు.

## యేటా పెరుగుతున్న రెవెన్యూ లోటు

>> ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు అంశాలు వివరించారు. ఆంధ్రప్రదేశ్ అవసరాలును గమనిసే పోలవరం -బనకచర్ల అనుసంధానం,సాగనీటి ప్రాజెక్టులు అమరావతి, విశాఖపట్నం, అరకు, తిరుపతి, రాజమహేంద్రవరం, ఐఐటీ తిరుపతిలో ఇంక్యుబేషన్ సెంటర్, బుద్ధిస్ట్ సర్క్యూట్, అమరావతిలో జాతీయ మ్యూజియం, విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు.నాలెడ్జ్ ఎకానమీలో భాగమైన క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు, స్కిల్ డెవలప్మెంట్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, 100 శాతం అక్షరాస్యత, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మల్టీ మోడల్ లాజిస్టిక్‌పార్కులు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేలు, రహదారులు అవసరమన్నారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజనల్ గ్రోత్ సెంటర్లు..ఈ ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్లు ఇచ్చేలా సిఫారసులు చేయాలని ఆర్థిక సంఘాన్ని ముఖ్యమంత్రి కోరారు. ప్రతీ ఏటా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు పెరిగిపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,28,146 కోట్లుఉంటే, 2030-31 నాటికి రూ.1,43,640 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నాం. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించారు. రాష్ట్ర విభజన ప్రభావం, ఆర్థిక సవాళ్లు, 2014 తరువాత వృద్ధిరేటులో రాష్ట్రం సాధించిన ప్రగతి, ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆర్థిక సంఘానికి సీఎం వివరించారు.

వికసిత్ భారత్ సాధనలో రాష్ట్రాలు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. దీనికి ఆర్థిక సంఘం వర్టికల్ డెవల్యూషన్ వాటా ప్రస్తుతం ఉన్న 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. అటు, హారిజెంటల్ డెవల్యూషన్‌లోనూ దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గిపోతోంది. 10వ ఆర్థిక సంఘం సమయంలో దక్షిణాది రాష్ట్రాలకు హారిజెంటల్ డెవల్యూషన్ 24.30 శాతం ఉంటే, 15వ ఆర్థిక సంఘానికి వచ్చే సరికి 15.80 శాతానికి తగ్గింది. హారిజెంటల్ డెవల్యూషన్‌లో ఎపి వాటా పరిశీలిస్తే... దేశ జిడిపి, జాతీయ జనాభా వాటా కన్నా తక్కువుగా ఉంది. ఇది ఆర్థికంగా ఎపికి నష్టంకలిగిస్తోంది. రాష్ట్రాల్లో గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు కేటాయించేటప్పుడు 70 శాతం వెయిటేజీ జనాభాకు, 20 శాతం వెయిటేజీ వ్యవసాయం, అనుబంధ రంగాలకు 10 శాతం వెయిటేజీ ప్రాంతానికి ఇవ్వాలని ప్రతిపాదన. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రూ.69,897 కోట్లు నిధులు అవసరం కాగా, రూ.7,381 కోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో రూ.62,516 కోట్ల నిధులు కావాల్సి ఉంది.పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు అవసరం ఎక్కువగా ఉందన్నారు. పట్టణ, స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల కోసం రూ.19,871 కోట్ల గ్రాంట్లు అవసరం అవుతుంది. అలాగే 2026-2031 మధ్య కాలానికి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రూ.16,181 కోట్లు కావాల్సి ఉంది. క్లీన్ ఎనర్జీకి రాష్ట్రంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలని అనుకుంటున్నాం. 2030 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం. దీనికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం ఉంది. 7.5 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ,మంత్రులు అచ్చెన్నాయుడు, పి.నారాయణ, నిమ్మల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చీఫ్‌జస్టిస్‌గా బిఆర్ గవాయి

>> చేస్తారు. తన పదవీకాలంలో జస్టిస్ గవాయి కీలకమైన తీర్పులు వెలువరించారు. రాజ్యాంగ ధర్మాసనంలో కూడా ప్రాతినిధ్యం వహించారు. 370వ అధికరణం రద్దు, జమ్ము కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు వంటి వాటి తీర్పుల్లో భాగస్వామి అయ్యారు. 2023లో ఇడి డైరెక్టర్ సంజయ్‌కుమార్ మిశ్రాకు మూడో సారి పొడిగింపుపై ఇచ్చిన తీర్పు సలచలనం అయింది. 2023 జులై 31వ తేదీనాటికి దిగిపోవాలని ఖచ్చితమైన ఉత్తర్వులు జారీ చేసారు. అలాగే పెద్దనోట్ల రద్దుపైనా దాఖలయిన తీర్పు అప్పట్లో సంచలనం కలిగించింది. తమిళనాడులో రాజీవ్‌గాంధీ హత్యకేసు నిందితుల విడుదలపైనా, ఆ తర్వాత వన్నియార్ల విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను రాజ్యాంగ వ్యతిరేకమని, ఎంతమాత్రం చెల్లదని ఈ కులాన్ని అత్యంత వెనుకబడిన తరగతుల కేటగిరీలో చేర్చడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పిన తీర్పులో సభ్య న్యాయమూర్తుల్లో గవాయి కూడా ఒకరు.

## 30 ఎంఎంసిలకు చైర్మన్ల నియామకం

### టిడిపికి 25, జెఎస్పీకి 4, బిజెపికి1

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో 30 మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది.కూటమిలోని టిడిపి, జనసేన, బిజెపిలకు చెందిన వారిని ఈ పదవులకు నామినేట్ చేసారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత టిడిపి 25, జనసేన4, బిజెపి 1 నామినేటెడ్ ఎఎంసి చైర్మన్ పదవులు కేటాయించారు.త్వరలో మిగతా మార్కెట్ కమిటీల చైర్మన్లను ప్రకటిస్తారు. సింహాద్రిపురం ఎఎంసి చైర్మన్‌గా బండి రామాసురరెడ్డి. కాకినాడకు బచ్చు శేఖర్,ఆకివీడుకు బొల్లా వెంకటరావు, పత్తిపాడు బొందలపాటి అమరేశ్వరి(జెఎస్పీ), ఇచ్ఛాపురానికి బుదా మణిచంద్ర ప్రకాశ్, ఎర్రగొండపాలానికి చెకూరి సుబ్బారావు, అంబాజీపేటకు చిట్లూరి శ్రీనివాస్,అత్తిలి దాసం ప్రసాద్ (జెఎస్పీ),పాకాల కె,సుధాకరయ్య, సామాల కరణం శ్రీనివాసుల నాయుడు, బంగారు పాలెంకు కర్రావుల భాస్కరనాయుడడు,బనగాలపల్లికి కట్టారెడ్డి మల్లిఖార్జునరెడ్డి, కంచికచర్లకు కొగంటి వెంకట నారాయణ(బాబు), అవనిగడ్డకు కొల్లూరు వెంకటేశ్వరరావు,ఉయ్యూరుకు కొండా ప్రవీణ్‌కుమార్,పాడేరుకు మాచాల మంగతల్లి(బిజెపి),రాజమండ్రికి మర్ని వాసుదేవ్, కొవ్వూరుకు నాదెళ్ళ శ్రీరామ చౌదరి, విజయవాడకు నర్రా వాసు, బంటుమిల్లికి ఒడుగు తులసీరావు.కోడూరు(రైల్వే) పగడాల వరలక్ష్మి(జెఎస్పీ),అనకాపల్లికి పి రాము,మైలవరానికి పోనకళ్ళనవ్యశ్రీ, మాడుగులకు పుప్పాలఅప్పలరాజు, మచిలీపట్టణంకు ఎస్జీఎస్వీ వెంకట దుర్గా ప్రసాద్, చంద్రగిరికి ఎస్.గౌస్‌భాషా,భీమడోలుకు శేషపు శేషగిరిరావు, జమ్మలమడుగు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి,మార్కాపురానికి ఇమాం సాహెబ్, పిడుగురాళ్ళకు తురకా వీరాస్వామి నియమితులయ్యారు.

## వారం - వర్జ్యం

తేది : 17-04-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.చవితి మ.3.21
అనూరాధ తె.5.55
వర్జ్యం మ.12.05-మ.1.50
దు.ఉ.10.03-10.53, 2) మ.3.04-3.54
శుభసమయం : ఉ.7.48-8.40
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప మార్పులు వుంటాయి. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**వృషభం :** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. పనులు నిదానంగా సాగుతాయి.

**మిథునం:** కుటుంబ సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. వివాదాలకు దూరంగా వుండండి.

**కర్కాటకం:** ఆర్థిక ఇబ్బంది ఎదురై చికాకులు పెడతాయి. ప్రయోగాలలో తొందరపాటువద్దు.

**సింహం:** అనుకోని అతిథుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. రుణాలు తీరతాయి.

**కన్య :** దీర్ఘకాలిక సమస్యల నుండి గట్టెక్కుతారు. భూవివాదాలు తీరి లబ్ధిపొందుతారు. ధనలాభం.

**తుల :** పాత మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఖర్చులు పెరుగుతాయి. వాహనయోగం.

**ధనుస్సు:** అనుకోని అవకాశాలు లభిస్తాయి.వీటిని సద్వినియోగం చేసుకోండి. సన్నిహితుల నుండి శుభవార్తలు.

**మకరం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. విలువైన పత్రాలు జాగ్రత్త.

**కుంభం :** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు.

**మీనం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను చేర్చడంపై బుధవారం న్యూఢిల్లీలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ కేడర్

## రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్లు

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైన సచివాలయ టవర్ల నిర్మాణానికి సిఆర్‌డిఎ టెండర్లను పిలిచింది. సచివాలయానికి 4 టవర్లు, హెచ్‌వోడీ కార్యాలయానికి ఒక టవర్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది సిఆర్‌డిఎ. హెచ్‌వోడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లకు టెండర్‌లను ఆహ్వానించింది. అలాగే సచివాలయం 1,2 టవర్ల కోసం రూ.1,897 కోట్లకు, సచివాలయం 3, 4 టవర్ల కోసం రూ.1,664 కోట్లతో టెండర్లు జారీ చేసింది. మొత్తం 5 టవర్లను రూ.4,668 కోట్ల వ్యయంతో చేపట్టాలనో ప్రభుత్వం నిర్ణయించింది. మే 1న సచివాలయ, హెచ్‌వోడీ టవర్లకు టెక్నికల్ బిడ్లను సిఆర్‌డిఎ తెరువనుంది. సచివాలయంలో ఉండే హెచ్‌వోడీలకు సంబంధించి 45 అంతస్థులతో ఒక టవర్ నిర్మాణం, మిగతా టవర్లు 40 అంతస్థులతో నిర్మాణం జరుగనుంది. ఈ సచివాలయం టవర్లన్నీ కూడా డయాగ్రిడ్ స్ట్రక్చర్‌తో నిర్మించాలని సిఆర్‌డిఎ టెండర్ షెడ్యూల్‌లో పేర్కొంది. ఈ టెండర్ రాజధాని నిర్మాణంలో సచివాలయ టవర్ల నిర్మాణమే అత్యంత కీలకమని చెప్పుకోవచ్చు. ఈ సచివాలయ టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రెండున్నర సంవత్సరాల గడువు విధించారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకుతో పాటు, ఎడిబి, హడ్కో, జర్మనీకి సంబంధించిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ రాజధాని అమరావతిలో పలు నిర్మాణాల కోసం రూ.31వేల కోట్లు రుణాలుగా సమకూర్చాయి. ప్రపంచ బ్యాంకుకు సంబంధించి ఇప్పటికే రూ.480 కోట్లు మొదటి విడత రుణం కూడా మంజూరు అయ్యింది. ఈ మొదటివిడత రుణంతోనే సచివాలయటవర్ల నిర్మాణానికి టెండర్లను పిలిచింది.

## సిట్ విచారణకు ఒకరోజు ముందుగానే విజయసాయి

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఈ నెల 17వ తేదిన గురువారం ఉదయం 10 గంటలకు సిట్ ముందు విచారణకు హాజరు కాబోతున్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఆయన సమాచారం అందించారు. విజయ సాయిని తొలుత ఈ నెల 18న విచారణకు రావాలని సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే అయితే తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ఉండటంతో 17వ తేదీన విచారణకు వస్తున్నానని సిట్‌కు మాజీ ఎంపీ సమాచారం పంపారు. దీంతో 17వ తేదీన విచారణకు రావాలని, తాము రెడీ అంటూ విజయసాయికి సిట్ అధికారులు సమాచారం పంపారు.ఈ కేసుకు సంబంధించి కసిరెడ్డి రాజశేఖర రెడ్డికి సిట్ మరోసారి నోటీసులు ఇచ్చింది. ఈనెల 19వ తేదీన విచారణకు రావాలని ఆదేశాలు ఇచ్చారు. విజయవాడ సిపి కార్యాలయంలోని సిట్ కార్యాలయాని నోటీసుల్లో పేర్కొంది. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే మూడు సార్లు రాజ్ కసిరెడ్డికి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన హజరు కాలేదు.

## అభివృద్ధికి సహకరిస్తాం

### రాజకీయ పార్టీలతో ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకరిస్తామని 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, డా. అరవింద్ పనగారియా స్పష్టం చేసారు.16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులతో కలిస చైర్మన్, డా. అరవింద్ పనగారియా రాష్ట్ర పర్యటనకు వచ్చారు ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం తరువాత ఆర్థిక సంఘం చైర్మన్ సభ్యులు డా. మనోజ్ పాండా, అన్నే జార్జ్ మాథ్యూలతో కలసి వివిధ రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలను ముఖాముఖి సమావేశంలో అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతినిధులుగా శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ వి. చిరంజీవిరావు, మాజీ శాసనమండలి సభ్యులు పి. అశోక్ బాబులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో రాష్ట్ర రెవెన్యూలోటును పరిగణలోకి తీసుకుందన్నారు. 16వ ఆర్థిక సంఘం కూడా రెవెన్యూ లోటును పరిగణలోకి తీసుకోవాలన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్న ఆర్థిక క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. సెక్టార్ల వారీగా గ్రాంట్స్‌ను విద్య, ఆరోగ్య రంగాలకు అందివ్వాలన్నారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అనే విషయం గుర్తించాలన్నారు. పాపులేషన్ లెక్కలను కూడా 1971 జనాభా లెక్కల ప్రకారంగా సిఫార్సులు ఉంటే రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. పాపులేషన్ గ్రోత్‌రేట్ ఆధారంగా నిధులు పంపకాలు ఉండాలన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ వాటా పెంచాలన్నారు. రాష్ట్రంలో వెనుకబడి ఉన్న ప్రాంతాలకు నిధులు పెంచాలన్నారు.

అదేవిధంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలకు ప్రత్యేక నిధులు అందించాలన్నారు. జనసేన పార్టీ ప్రతినిధులుగా శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస లు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రానికి వెనుకబడిన రాష్ట్రాలకు ఇచ్చే విధంగా ఆర్థిక సాయం అందించాలని కోరారు. వెనుకబడిన రాష్ట్రాల జాబితాలో రాష్ట్రాన్ని చేర్చి ఆర్థికంగా చేయూతను అందించాలన్నారు. స్థానిక సంస్థల బలోపేతానికి చేయూతను అందించాలన్నారు. రాష్ట్రంలో రోడ్లు చాలా వరకు ఇబ్బందికరంగా ఉన్నాయని వాటి అభివృద్ధికి నిధుల సాయం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 972 కిమీ కోస్టల్ లైన్ అభివృద్ధి చేయాలన్నారు.

రాష్ట్రానికి 90 శాతం గ్రాంటు గా నిధులు అందించాలన్నారు. త్రాగు నీరు, రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని నగర, గ్రామ పంచాయతీలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. వాటర్ వర్క్స్ నిధులు, జలజీవన్ మిషన్ ఫండ్స్ రాష్ట్రానికి ఇవ్వాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వర్క్స్ కు నిధులు పెంచాలన్నారు. వైఎస్సార్సీ ప్రతినిధులుగా మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన,కృష్ణలు మాట్లాడుతూ గతంలో జనాభా, ప్రాంతాల అభివృద్ధి ఆధారంగా నిధులు అందించారన్నారు. రాష్ట్రంలో కోవిడ్ ఉన్నా కూడా వివిధ సంక్షేమ పథకాలు, కులాలకు, మతాలు, పార్టీలకు అతీతంగా ఇచ్చామన్నారు. రాష్ట్రాలకు పన్నుల వాటాలో 50 శాతం నిధులు అందించాలన్నారు. పన్నుల వాటాలో ప్రత్యేక బోనస్ కూడా ఇవ్వాలన్నారు.

## దోచుకున్న సొమ్ముతో సినిమా

>> న్నాయి.కసిరెడ్డి మద్యం కుంభకోణంలో వెనకేసుకున్న డబ్బుతో 'స్పై' అనే చలనచిత్రాన్ని నిర్మించినట్లు సిట్ అధికారులు చెబుతున్నారు.మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా సిట్ బృందాలు ఇటీవల ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్ రిజిస్టర్ చిరునామా అయిన హైదరాబాద్ మణికొండ ప్రశాంతి హిల్స్‌లోని ప్లాట్ నంబర్ 26, 27లో డోర్ నంబర్ 766/2/26, 27కు వెళ్లి తనిఖీలు జరిపాయి. అక్కడ ప్రస్తుతం ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు సంబంధించి ఎలాంటి కార్యకలాపాలు కొనసాగట్లేదని గుర్తించాయి. ఇదే చిరునామాలో రీసోర్స్ వన్ ఐటీ సొల్యూషన్స్ అనే ఐటీ కంపెనీ కూడా ఉంది. దీనికి రాజ్ కసిరెడ్డి సతీమణి సోదరి పైరెడ్డి మేఘనా ప్రియదర్శినిరెడ్డి ఎండీగా, ఆమె తల్లి పైరెడ్డి సుజాతరెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ కంపెనీకి, ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు మధ్య లావాదేవీలు ఏమైనా సాగాయా అన్నదానిపై కూడా సిట్ బృందాలు ఆరా తీస్తున్నాయి. రాజశేఖరరెడ్డి దోచుకున్న నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకునేందుకు ఏకంగా సినిమాల నిర్మాణం చేపట్టారు. ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్ అనే సంస్థను నెలకొల్పి నిఖిల్ సిద్ధార్థ్ (కార్తికేయ2 ఫేమ్) హీరోగా 'స్పై' అనే పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించారు. దీన్ని తెలుగు, హిందీ, మలయాళం, తమిళం, కన్నడ భాషల్లో 2023 జూన్ 29న ఈ సినిమాను విడుదల చేశారు. ఈ సినిమాకి కథ కూడా రాజ్ కసిరెడ్డే సమకూర్చినట్లు టైటిల్స్‌లో వేసుకున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యం వెనకున్న రహస్యాన్ని స్పృశిస్తూ ఓ గూఢచారి ఇతివృత్తంతో రూపొందించిన ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించారు. అయితే ఈ సినిమా ఫ్లాప్ అయ్యింది. ఇడి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థకు ఉప్పలపాటి చరణ్‌తేజ్ అనే ఓ డైరెక్టర్, రచయితను సిఇఒగా పెట్టుకున్నారు. ఒకేసారి భారీగా సినిమాలు నిర్మించడం కోసం పలువురు యువ డైరెక్టర్లు, రచయితలకూ అడ్వాన్సులిచ్చారు. ఆ మధ్యకాలంలో మిడ్ రేంజ్, కొత్త హీరోలతో హిట్ సినిమాలు తీసిన నలుగురైదుగురు డైరెక్టర్లతో కథలపై చర్చించి సినిమాల నిర్మాణానికి ప్రయత్నించారు.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మద్యంకుంభకోణంపై దర్యాప్తు తీవ్రతరం కావడంతో ఆ కొత్త ప్రాజెక్టులన్నింటినీ నిలిపేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. స్పై సినిమాను ఎంత బడ్జెట్‌లో నిర్మించారు. దానికి వాస్తవంగా చేసిన వ్యయంఎంత? ఈసొత్తు ఎక్కడినుంచి సమకూరింది? ఏయే రూపాల్లో చెల్లించారు? ఈసినిమాకు జరిగిన వ్యాపారమెంత? తదితర విషయాలన్నీ ఇప్పటికే సిట్ సేకరించింది. కొంతమందికి నగదు రూపంలో చెల్లించినట్లు గుర్తించింది. ఇంకా ఏయే సినిమాలు లైన్‌లో పెట్టారు? వాటి కోసం ఎంత వెచ్చించినట్లు లెక్కలు కూడా చూపించారు. అలాగే ఇందుకు మనీ రూటింగ్ ఎలా చేశారు? అనే దానిపై సిట్ దర్యాప్తులో పలు కీలక అంశాలు వెలుగుచూశాయి. నగదు రూటింగ్ చేసే క్రమంలో భాగంగా ఏయే స్థాయిల్లో ఎవరెవరు ఏ పాత్ర పోషించారనేదానిపైనా సిట్ వివరాలు తీసుకుంది.

# తులాభారంలో భారీ స్కాం!



## - టిటిడిలో కోట్లాది రూపాయలు స్వాహా అంటూ బోర్డు సభ్యుడు భాను సంచలన వ్యాఖ్యలు

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు... ఆపదమొక్కులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు ప్రియంగా సమర్పించే మొక్కుల్లో తులాభారం ఒకటి. ఇక్కడ తులాభారం రూపంలో వచ్చిన కానుకలను రోజువారీగా టిటిడి ఖాతాలో జమచేయాల్సి ఉంటుంది. అయితే గత ఐదేళ్ళ వైసిపి పాలనలో, గత ట్రస్ట్‌బోర్డుల హయాంలో తులాభారం కానుకలు కోట్లాదిరూపాయలు స్వాహా చేశారని ,అక్రమాలు జరిగినట్లు టిటిడి విజిలెన్స్ నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోలేదని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం ఉదయం తిరుమల ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసిపి హయాంలో శ్రీవారి ఆలయంలో తులాభారంలో భారీస్కాం జరిగిందని వెల్లడించారు. అంతేగాక ఈ అక్రమాల్లో సూత్రధారులు ఎవరనేది తేల్చి ఉద్యోగం నుండి తొలగించాల్సి న పాలకమండలి, గత అధికారులు తాత్కాలిక ఉద్యోగులను తొలగించి మిన్నకుండిపోయారని ఆరోపించారు. వడ్డీకాసుల వేంకటేశ్వర స్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా నిలువుదోపిడీలు, తులాభారం కానుకలు సమర్పించుకుంటారు. భక్తులు తాము అనుకున్న కోరికలు నెరవేరితు తులాభారం వేస్తామని, లేదా దంపతులు పిల్లలు పుడితే తులాభారం వేయిస్తామని మొక్కుకుంటుంటారు. అలా వారి కోరికలు నెరవేరితే తిరుమలేశునికి తులాభారం కానుకలుగా చిల్లరనాణేలు,కరెన్సీ, బెల్లం, బియ్యం, పప్పులు ఇలా వారివారి స్థాయిలో సమర్పిస్తారు. రోజువారీగా 10లక్షలు రూపాయలు తులాభారం ద్వారా ఆదాయం చేకూరుతుంది. గత ఐదేళ్ళలో కోట్లాదిరూపాయల తులాభారం కానుకలను ఇంటి దొంగలు కాజేశారని బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. తులాభారం కానుకలను స్వాహాచేశారన్నారు. తులాభారంలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ నివేదిక అందిస్తే అప్పటి అధికారులు మిన్నకుండి పోయారని విమర్శించారు. తులాభారంలో అక్రమాలపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేస్తున్నా మన్నారు. శ్రీవారి ఆలయం పరిసరాల్లో డ్రోన్‌కెమెరా ఎగురవేసి పరిసరాలు ఛిత్రీకరించ ‌డంపై బోర్డు సభ్యుడుగా భానుప్రకాశ్‌రెడ్డి వివరణ ఇచ్చారు. డ్రోన్ ఎగరడం నిఘా వైఫల్యంగా భావిస్తున్నామన్నారు. భద్రత సిబ్బంది కొరత ఉందని, సిబ్బందిని కూడా పెంచుతామని ఆయన తెలిపారు. త్వరలోనే తిరుమలలో యాంటీడ్రోన్ టెక్నాలజీని తీసుకొస్తామని తెలిపారు. డ్రోన్ కెమెరా ఎగురవేసి యూట్యూబర్ నుండి మెమరీకార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి

## - బిసి సంక్షేమ మంత్రి సవిత

**సచివాలయం,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** కందుకూరి వీరేశలింగం పంతులు సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి అని,సమాజంలోని దురాచారాలు,మూఢ విశ్వాసాలపై పోరాడిన విప్లవ యోధుడని రాష్ట్ర బిసి,ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు.స్త్రీ అభ్యున్నతికి, మహిళా విద్యకు విశేష కృషి చేశారన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు వీరేశలింగం పంతులు అన్నారు.రాజమండ్రిలో 1848 ఏప్రిల్ 16న జన్మించిన కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త,బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్య మిచ్చారని,బాలికలకు పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతూ,వితంతు పునర్వివాహాలను జరిపించారన్నారు. తెలుగు సాహిత్యానికి కందుకూరి వీరేశలింగం పంతులు ఎనలేని సేవ చేశారని మంత్రి కొనియాడారు. యువజన సంఘాల స్థాపన కూడా వీరేశలింగంతోనే మొదలైందన్నారు.సమాజ సేవ కోసం హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్థిని ఆ సంస్థకు రాసిచ్చారన్నారు.కందుకూరి వీరేశలింగం పంతులు 130కిపైగా గ్రంథాలు రాశారన్నారు. వాటిలో రాజశేఖర చరిత్ర,సత్యరాజా పూర్వ దేశయాత్రలు ఎంతో ముఖ్యమైనవన్నారు. తెలుగు జాతి నవయుగ వైతాళికుడిగా కందుకూరి వీరేశలింగం పంతులు పేరుగాంచారన్నారు. క ందుకూరి ఆశయ సాధనే లక్ష్యంగా అందరమూ కృషిచేద్దామన్నారు.నేటి యువతకు కందుకూరి వీరేశలింగం పంతులు మార్గదర్శులని,ఆయన ఆశయాలే వారికి లక్ష్యం కావాలని మంత్రి సవిత తెలిపారు.

# తిరుమల సమాచారం

## తనిఖీల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దు!

### - ఆకస్మిక తనిఖీల్లో సివిఎస్ఒ హర్షవర్ధన్‌రాజు



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రికుల వాహనాలు రద్దీ సమయంలో, తనిఖీల కోసం బారీగా వాహనాలు ఆగిపోయినా నిశితంగా పరిశీలించిన తరువాతే అనుమ తించాలని, వాహనాల తనిఖీల్లో నిర్లక్ష్యం గా ఉండొద్దని తిరుపతి జిల్లాఎస్పీ, టిటిడి సివిఎస్ఒ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. స్కానర్ మానిటర్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి ఇమేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనుమానంగా ఉన్న వస్తువులను సిబ్బంది ఫిజికల్‌గా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల తిరుమలలో భద్రత లోపం, మద్యం,నిషేధిత పదార్థాలు చివరకు డ్రోన్‌కెమెరా ఎగరడం వంటి ఘటనలతో అలిపిరి తనిఖీ కేంద్రంలో భద్రతా సిబ్బంది పనితీరుపై బుధవారం సాయంత్రం సివిఎస్ఒ హర్షవర్ధన్‌రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో టిటిడి సెక్యూరిటీ సిబ్బంది, ఎస్ఎఫ్‌పిఎఫ్ సిబ్బంది. విజిలెన్స్ సిబ్బంది పనితీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. తనిఖీ కేంద్రంలో ద్విచక్రవాహనాలు, ఆర్టీసి బస్సుల లేన్లతోబాటు యాత్రికుల వాహనాలు ప్రవేశం, విఐపి గేట్‌లో వాహనాల అనుమతి వంటివాటి వివరాలు గమనించారు. వాహనాలను, లగేజీలను తనిఖీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తిరుమలకు వచ్చే యాత్రికుల వాహనాల తనిఖీల్లో ఎక్కడా ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. ఇక్కడ వాహనాలను అనుమతించే విషయంలో పలు సూచనలు చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే ఆ వాహనాలను నిలుపుదలచేయాలన్నారు. ఈ తనిఖీల్లో అలిపిరి ఏవిఎస్ఒ ప్రభు, రమేశ్, ఎస్‌పిఎఫ్ భాస్కర్, ఎస్‌పిఎఫ్ ఎస్ఐ మణిసిద్దార్థ్, విజిలెన్స్‌సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వారితో స్వయంగా సమావేశమై అభిప్రాయాలు తెలుసుకుని సూచనలు చేశారు.

# మైనింగ్ వ్యవస్థలో మార్పులు అవసరం: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ.ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** మైనింగ్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తే అద్భుతాలు సృష్టించే అవకాశం ఉంటుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నిన్న కేబినెట్ సమావేశం సందర్భంగా మైనింగ్ రంగంలో ఉండే అవకాశాలను మంత్రి వర్గం ముందుంచారు. మైనింగ్ అనేది వ్యాపార వర్గాలకే అనుకోవడం సరికాదని, రాష్ట్ర జీడీపీలో మైనింగ్ రంగం అత్యంత కీలకమైనదన్నారు. రాష్ట్ర జీడీపీలో ప్రస్తుతం 3 నుండి 4 శాతం మాత్రమే ఉన్నప్పటికీ.. 15 నుండి 20 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్వావలంబనకు అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ శాఖలో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల కారణంగా గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. మైనింగ్ వ్యవస్థ మొత్తం దోపిడీకి గురైంది. ఫలితంగా మైనింగ్ అంటేనే ప్రజల్లో, ప్రభుత్వ పెద్దల్లో చెడు అభిప్రాయం కలిగింది. ఇలాంటి సమయంలో మైనింగ్ ఇండస్ట్రీ మొత్తాన్ని పటిష్టం చేయాల్సి న అవసరం ఉంది. తద్వారా మెరుగైన మైనింగ్ పాలసీని ప్రజలకు అందించబోతున్నాం. మైనింగ్ లీజు అప్లికేషన్స్ ఫస్ట్ ఇన్ ఫస్ట్ సర్వ్ విధానం ప్రారంభించాం. ఈ విధానం ఏడాది వరకు అమలులో ఉంటుంది. లీజు గ్రాంట్స్, రెన్యువల్ మరియు లీజు ట్రాన్స్ ఫర్ కోసం 10 రెట్లుగా ఉన్న డెడ్ రెంట్‌ను 5 రెట్లకు తగ్గించాం. మైనింగ్ లీజుల కాల పరిమితిని 20 సంవత్సరాల నుండి 30 సంవత్సరాలకు పెంచడం ద్వారా అండగా నిలుస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా క్రిటికల్ మినరల్స్ పాలసీని రూపొందించబోతున్నాం. వినూత్న ఆలోచనలతో మైనింగ్ వ్యవస్థలో అద్భుతాలు సృష్టించవచ్చని, యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేయొచ్చు. మన రాష్ట్రంలో ఉండే మేజర్, మైనర్ మరియు క్రిటికల్ మినరల్స్‌తో విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చు. కనుక విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు చేసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. భారతదేశ పారిశ్రామికాబివృద్ధికి క్రిటికల్ మినరల్స్ సేకరణ, అభివృద్ధి ఉపయోగపడేలా మన రాష్ట్రంలో క్రిటికల్ మినరల్స్ పాలసీ రూపొందించడానికి మైనింగ్ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా కీలక ఖనిజాలపై దృష్టి సారించలేదు. అందుబాటులో ఉండే వనరుల్ని తవ్వకుని అమ్ముకునే ధోరణి మారాలి. విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించడంతో పాటుగా, మన వద్దనున్న వనరులను ఇక్కడే ప్రాసెస్ చేయడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌ను అందిపుచ్చుకునే అవకాశం లభిస్తుంది.

మైనింగ్ రంగంలో ఉ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, లీజు హోల్డర్లు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ పరిస్థితిని ఉపయోగించుకుని విలువ ఆధారిత పరిశరమల ఏర్పాటు చేసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# రాష్ట్ర ఫైబర్ నెట్ ఉద్యోగులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**సచివాలయం,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** ఫైబర్ నెట్ లో దాదాపు 500మంది ఉద్యోగులను సర్కార్ తొలగించింది.దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చర్చించిన అనంతరం ఉద్వాసన పలుకుతున్నట్లు సమాచారం.సూర్య ఎంటర్‌ప్రైజెస్ ద్వారా నియమించిన వారందరూ కూడా ఈ నెలాఖరుకు ఫైబర్‌నెట్ నుంచి ఔట్ అవనున్నారు.ఇకముందు ఎటువంటి పొడిగింపు

ఉండబోదని సంస్థ యాజమాన్యం స ్పష్టం చేసింది.ఈఉద్యోగులంతా కూడా ఫైబర్ నెట్ కార్యాలయానికి రాకుండా జీతాలు తీసుకున్న పరిస్థితి.దీనిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం దాదాపు 500మందిని ఫైబర్‌నెట్ నుంచి తొలగించింది.

# జులైనెల ఆర్జితసేవా టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదల

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామికి రోజువారీగా,వారాంతపుసేవలుగా నిర్వహించే సేవాటిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం 19వతేదీ శనివారం ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. రానున్న జులైనెలకు సంబంధించి ఈ సేవా టిక్కెట్లు ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో,కొన్నిసేవలు ముందువచ్చిన భక్తులకు ముందు అనే ప్రాతిపదికన భక్తులు నేరుగా బుక్‌చేసుకునే సదుపాయం కల్పించారు. సామాన్యభక్తులు దేవదేవుని దర్శనార్థం సేవా టిక్కెట్లు బుక్‌చేసుకునేందుకు వీలుగా ఈనెల 19వతేదీ శనివారం ఉదయం 10గంటలకు ఎలక్ట్రానిక్ డిప్‌ద్వారా అందుబాటులో ఉంటాయి. తిరుమల ఆలయంలో శ్రీవారికి జరిగే సుప్రభాతం,తోమాల,అర్చన,అష్టదళపాదపద్మారాధన, నిజపాదదర్శనం టిక్కెట్లను ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తారు. ఈ సేవలను బుక్‌చేసుకునేందుకు 19వతేదీ ఉదయం 10గంటల నుంచి 21వతేదీ ఉదయం 10గంటలవరకు గృహస్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో గృహస్థులకు టిక్కెట్ల కేటాయింపు జరుగుతుంది. టిక్కెట్లు పొందినవారి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

23వతేదీ మధ్యాహ్నం లోపు నగదు చెల్లించాలి. అలాగే గృహస్థులకు ఎస్ఎంఎస్,ఈ మెయిల్ ద్వారా తెలియజేస్తారు. టిక్కెట్లు పొందిన భక్తులు రెండు రోజుల్లో నగదు చెల్లించాల్సి వుంటుంది. ఇక కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకరణసేవ టిక్కెట్లను ముందు వచ్చిన వారికి ముందు అనే ప్రాతిపదికన భక్తులు నేరుగా బుక్‌చేసుకోవచ్చు.

22వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు 22న మధ్యాహ్నం 3గంటలకు విడుదలవుతాయి.

అంగప్రదక్షణ టోకెన్లు బుకింగ్‌కు 23వతేదీ ఉదయం 10గంటల నుండి అందుబాటులో ఉంటాయి. సినీయర్‌సిటిజన్లు, దివ్యాంగులు టిక్కెట్లు బుకింగ్‌కు 23వతేదీ మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు 24న మధ్యాహ్నం 3గంటలకు అందుబాటులో ఉంటాయి.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడి అమరావతి పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడి మే 2వ తేదీన అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభించేందుకు రానున్నారని అందుకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.ఈమేరకు ప్రధాని పర్యటన ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్,కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్,నాదెండ్ల మనోహర్,పి.నారాయణలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఇప్పటికే నియమించిందని ఈకమిటీ సోమవారం ఉ.11.గంలకు అమరావతి సచివాలయంలో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై నిర్వహించనుందని పేర్కొన్నారు.రాష్ట్ర సచివాలయం వెనుకవైపున ఇటీవల పి4 కార్యక్రమం ప్రారంభించిన ప్రాంతంలోనే ప్రధాని కార్యక్రమ సభా వేదికను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధాని పర్యటన మే 2వ తేదీకి నిర్ధారణఅయిందన్నారు.అయితే ఆ కార్యక్రమం ఉదయం నిర్వహించాలా లేక సాయంత్రం నిర్వహించాలా అనేది ఖరారు కావాల్సి ఉందని అన్నారు.ప్రధాని పర్యటనకు సంబంధించి విస్తృతమైన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందని అందుకు సంబంధించి ఆయా శాఖల అధికారులకు గురువారం తగిన ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఇటీవల కాలంలో విశాఖలో జరిగిన ప్రధాని పర్యటన కార్యక్రమంలో విధులు నిర్వహించిన అధికారులకు ఈసారి కూడా తగిన విధులు కేటాయించడం జరుగుతుందని ఆ అధికారుల జాబితాను సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు.ప్రస్తుత వేసవి దృష్ట్యా ప్రధాని పర్యటనకు వచ్చే ప్రజా ప్రతినిధులు,ప్రజలు తదితరు లెవరికీ ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో కనీస సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తగిన ఏర్పాట్లు చేయాల్సి న అవసరం ఉందని సిఎస్ విజయానంద్ అధికారులకు స్పష్టం చేశారు.ముఖ్యంగా వివిధ గ్రామాల మీదగా ప్రముఖులు,సాధారణ ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉందని ఆయా రోడ్లన్నీ గ్రామీణ రహదారులై ఉన్నందున ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలత్తకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని చెప్పారు.మొత్తం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు వైద్య ఆరోగ్య కుంటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్ ను నోడలు అధికారిగా నియమించడం జరిగిందని కావున అధికారులు అందరూ ఆయనతో సమన్వయం చేసుకుని తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన



శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో పాల్గొనే విఐపిలు,ఇతర ప్రముఖుల వివరాలను పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఆయా శాఖల అధికారులు చేయాల్సి న ఏర్పాట్లు ఇతర అంశాలకు సంబంధించి తగిన మార్గదర్శకాలను జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడలు అధికారిగా నియమించబడిన వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ సచివాలయం వెనుక వైపున పి4 కార్యక్రమం జరిగిన ప్రాంతంలో ప్రధాని సభావేదిక ఏర్పాటు చేయడం జరుగుతుందని అక్కడి నుండే ప్రధాని మోడి పలు పనులకు ప్రారంభోత్స వాలు,శంఖుస్థాపనలు చేయను న్నారని వివరించారు.

# డిక్లరేషన్‌పై నాస్తికుడు విమర్శించడమా..

## కరుణాకర్‌రెడ్డిపై ఎమ్మెల్యే సుధీర్ ఆగ్రహం

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త** పవిత్రమైన హిందూ దేవాలయ ఛైర్మన్‌గా రెండుసార్లు పనిచేసిన మాజీ టిటిడి ఛైర్మన్, తిరుపతి మాజీ ఎంఎల్ఏ కరుణాకర్‌రెడ్డి డిక్లరేషన్‌పై సంతకం చేయమంటే నిరాకరించారు. ఆయన హయాంలోని తప్పులను తప్పిదాలను కప్పిపుచ్చుకునుటకు కూటమి ప్రభుత్వంపై బురద చల్లడానికి ప్రయత్నించడం శోచనీయమని శాసనసభ్యుడు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి నిప్పులు చెరిగారు. బుధవారం ఇక్కడి పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అపవిత్రం చేయడానికి ప్రయత్నించడం బాధాకరం అన్నారు.నాడు గోశాలపై ఉన్న దయ నేడు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను అడ్డదారి పట్టించేందుకే కరుణాకర్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కాలం చెల్లిన మందులను గోవులకు పెట్టడం వల్లే అవి మృతిచెందాయని పేర్కొన్నారు. మాజీ టిటిడి బోర్డు ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి, మాజీ సిఎం జగన్‌లు నాస్తికులని ఏనాడు వారు కుటుంబసభ్యులతో తిరుమలకు రాలేదని పేర్కొన్నారు. లడ్డు వ్యవహారంలో కల్తీనెయ్యి వివాదంలో తలెత్తినపుడు చెప్పని మాటలు నేడు ఎందుకు మాట్లాడుతున్నారో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నారన్నారు. రాజకీయ లబ్దికోసమే గోవుల వ్యవహారం తెరపైకి తెచ్చారన్నారు. జగన్ హయాంలో ఏనాడు గోశాలను విజిలెన్స్, వెటర్నటీ వారు ఎన్నిసార్లు తనిఖీచేశారో వారికే తెలియాలన్నారు. కడపలో గోశాలను ఏర్పాటు చేస్తున్నామని కేంద్రంకు చెప్పి రూ.780కోట్లు స్వాహాచేసింది నిజం కాదా? ఇక్కడి గోశాల ఏర్పాటులో ఎంతమంది ఉద్యోగులు పనిచేశారో కూడా తెలియజేయాలన్నారు. గోశాలలో గడ్డిస్కాం, పాలు,వెటర్నటీ స్కాంలతో పాటు చివరికి తలనీలాల్లో కూడా స్కాం జరిగినట్లు తెలిసిందని దీనిపై సమగ్ర విచారణ చేయాలని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22నుంచి 23 వరకు టిటిడి గోశాలలో 27గోవులు మృతిచెందాయని పలమనేరులో టిటిడి గోశాలలో 26 మృతిచెందాయన్నారు. మంచితనాన్ని తమ చేతకాని తనం అనుకుంటే పొరపాటని తమ అధినాయకుని సూచనలతో మౌనంగా ఉన్నామన్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసేవారిని శిక్షించేందుకు కొత్తచట్టాలను తీసుకువస్తున్నామన్నారు. తిరుమల కొండపై జరిగే పాపాలు ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకుంటామని తమ 14మంది ఎంఎల్ఏలను తీసుకుని తిరుమలకు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

వస్తాం..వచ్చి నిజాలు చెప్పారా కరుణాకర్‌రెడ్డి గారూ..అంటూ సవాల్ విసిరారు. మార్ఫింగ్ చేసిన ఫోటోలను సోషల్‌మీడియా, పత్రికల్లో ప్రచురించుకుని రాజకీయాలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులు చూసి వారు విస్తుపోతున్నారని ప్రజలందరు సంతోషిస్తున్నారన్నారు. అవినీతికి మారుపేరు తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అని ఎంఎల్ఏ తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రార్‌పై తనకు 35పైగా పిర్యాదులు వచ్చాయని అయితే మార్టిగేజ్‌ను విడిపించుకు నేందుకు ఓరైతు గత 16రోజులుగా తిరుగుతుంటే తిప్పించుకుంటు న్నారని తనకు తెలియగానే వెంటనే రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని సబ్‌రిజిస్ట్రార్‌ను నిలదీశారు.

# ఏపిలో రాజ్యసభ ఉప ఎన్నికకు ఇసి షెడ్యూల్ ఖరారు

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానంలో ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వైకాంగ్రెస్‌పార్టీ రాజ్యసభ సభ్యుడు(ఎంపీ)గా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామాతో ఈ స్థానం ఖాళీ అయింది. వైకాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి సార్వత్రిక ఎన్నికల అనంతర పరిణామాలల్లో ఆ పార్టీకి రాజీనామా చేసారు.అంతేకాకుండా ఎంపీ పదవికి రాజీనామా చేసారు.ఈ క్రమంలో ఆ స్దానానికి ఎన్నికల కమీషన్ షెడ్యూల్ విడుదల చేసింది.ఈ నెల 29 వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. 30న నామినేషన్ల పరిశీలన చేపడతారు. మే 2 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. మే 9న ఎన్నిక నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు.

# రాష్ట్రం నుంచి హజ్ కు 1630 మంది యాత్రికులు

## న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

### - 29 నుండి ప్రయాణాలు ప్రారంభం

### - ప్రభుత్వం తరపున ప్రత్యేక వసతి ఏర్పాట్లు

**విజయవాడ.ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** హజ్ 2025 యాత్ర కు ఆంధ్రప్రదేశ్ నుండి యాత్రికుల ప్రయాణాలు ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో హజ్ యాత్ర ప్రయాణాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుండి మొత్తం 1630 మంది ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో 1170 మంది యాత్రికులు హైదరాబాద్ ఎంబార్కేషన్ నుండి బయలుదేరుతున్నారని తెలిపారు. వివిధ దశల్లో హజ్ యాత్ర ప్రయాణ ప్రణాళిక ఖరారు అయిందని తెలిపారు. ఇందులో భాగంగామొదటి విడతలోమొత్తం 236 మంది ఈనెల 29వ తేదీ నుండి మే 11 తేదీ వరకు హైదరాబాద్ నుండి మదీనా మునవ్వరా కు బయలుదేరుతారని పేర్కొన్నారు.రెండవ విడతలో 934 మంది మే 19 వ తేదీ నుండి 27 తేదీ వరకు హైదరాబాద్ నుండి జెద్దా కు యాత్రికులు బయలుదేరనున్నట్లు వెల్లడించారు.అలాగే బెంగళూరు ఎంబార్కేషన్ నుండి 452 మంది హజ్ యాత్రికులు ఈ నెల 30 తేదీ నుండి మే 15 వ తేదీ వరకు బెంగళూరు నుండి మదీనా మునవ్వరాకు బయలుదేరుతారని తెలిపారు.హైదరాబాద్ ఎంబార్కేషన్, బెంగళూరు ఎంబార్కేషన్ ల నుండి హజ్ యాత్ర కు బయలుదేరుతున్న ఆంధ్రప్రదేశ్ హజ్ యత్రికులకు వసతీ సౌకర్యాలు కల్పించే విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే అవసరమైన చర్యలు చేపట్టడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు.తమ ఆరోగ్యరీత్యా హజ్ నిబంధనల మేరకు ప్రభుత్వం తరపున యాత్రికులు తప్పనిసరిగా టీకాలు వేయించు కోవాలని సూచించారు.హజ్ యాత్రకు బయలుదేరుతున్న వారందరికీ మైనారిటీ శాఖా మంత్రి ఫరూక్ శుభాకాంక్షలు తెలిపారు.

# జగన్ టూర్ లో దెబ్బతిన్న హెలికాప్టర్ పైలెట్, కో పైలెట్ ను విచారించిన సికేపల్లి పోలీసులు

**అనంతపురం, ఏప్రిల్ 16, (ప్రభాతవార్త బ్యూరో)** వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి టూర్లో హెలికాప్టర్ దెబ్బతిన్న సంఘటన సంబంధించి పోలీసు బృందాలు విచారణకు రంగంలో దిగాయి. ఆ హెలికాప్టర్ కి సంబంధించిన పైలెట్, కో పైలట్ లను శ్రీ సత్యసాయి జిల్లా రాప్తా నియోజకవర్గం సికేపల్లి మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్లో బుధవారం పోలీసులు నాలుగు గంటల పాటు విచారించారు. మీడియా ప్రతినిధులను పోలీస్ స్టేషన్ ప్రాంతానికి అనుమతించకుండా జగన్ టూర్ లో దెబ్బతిన్న హెలికాప్టర్ కు సంబంధించి, ఎలిపాడ్ లో జరిగిన సంఘటన సంబంధించి ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, సికేపల్లి పోలీస్ స్టేషన్ సిఐ శ్రీధర్ నేతృత్వంలో సికేపల్లిపోలీసులు ప్రత్యేకంగా పైలట్, కో పైలట్ లను దాదాపు 28 ప్రశ్నలు వేసి వివరాలు తెలుసుకున్నట్లు తెలియ వచ్చింది. హెలికాప్టర్లో ఏ ఏ విభాగాలు దెబ్బ తిన్నాయి? హెలికాప్టర్లో వైఎస్ జగన్ ఎందుకు వెళ్ళలేదు? హెలికాప్టర్ దెబ్బతిన్నప్పుడు మీరు ఎలా వెళ్లారు? డెస్టినేషన్ పాయింట్ కు వెళ్లారా లేదా? కుంటిమద్ది ఎలిపాడ్ లో నాయ కులు, కార్యకర్తలు హెలికాప్టర్ పై దాడి చేశారా ? ఇలాంటి పలు ప్రశ్నలను పోలీసులు వేసినట్లు తెలిసింది..


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on X@SCRailwayindia మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

**No.GNT/C.EAUCTION CATALOGUE/2024-25 తేది: 16.04.2025**
'ఇ' వేలం లీజింగ్ ద్వారా నాన్ ఫేర్ రెవెన్యూ కాంట్రాక్ట్‌ల అవార్డింగ్ కొరకు గుంటూరు డివిజన్ యొక్క కంబైన్డ్ నెలవారీ కేటలాగ్

PUB/0401

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు ireps వెబ్ పోర్టల్ యొక్క ఇ-వేలం లీజింగ్ మోడ్యూల్ ద్వారా ఇ-బిడ్స్ ఆహ్వానిస్తున్నారు. ప్రచురించబడిన క్యాటలాగ్‌ల యొక్క వివరాలు ఈ క్రింది విధంగా:-

**కమర్షియల్ పబ్లిసిటీ:-**

| క్ర. సం. | కాంట్రాక్ట్ యొక్క రకం | స్టేషన్/స్థానం/ రేక్ లింక్ | కాంట్రాక్ట్ కాల పరిమితి | బయానా రూ. | వేలం ప్రారంభించు తేదీ మరియు సమయం |
|---|---|---|---|---|---|
| 1 | గుంటూరు డివిజన్‌లో రైల్వే స్టేషన్‌ల వద్ద ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రాల ఆపరేషన్ | గుంటూరు | 3 సంవత్సరాలు | 50,000 | 09.05.2025 యొక్క 12.00 గం. |
| 2 | | నంద్యాల | | | |
| 3 | | నల్గొండ | | | |

ఇ-టెండర్‌లలో పాల్గొనటానికి టెండరుదారుడు డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందటం మరియు ireps 'ఇ' వేలంలో లీజింగ్‌లో వారంతటగా రిజిస్టర్ చేసుకోవటం వారి బాధ్యత అయివున్నది. www.ireps.gov.in పోర్టల్ యొక్క మాన్యుయల్ మరియు మార్గదర్శకాల క్రింద ireps పోర్టల్ ద్వారా 'ఇ' వేలం లీజింగ్‌లో పాల్గొనటానికి మరియు నమోదితం కొరకు ముందు ఆవశ్యకాలు అందుబాటులో ఉన్నాయి. టెండర్‌దారుడు అవశ్యకమైన డాక్యుమెంట్‌లను క్రింది సంతకందారుని కార్యాలయానికి వాటిని అడిగినప్పుడు దాఖలు చేయవలెను. టెండర్‌కు సంబంధితమైన అవసరమైన డాక్యుమెంట్‌ల యొక్క అప్‌లోడింగ్ లేదా చెల్లింపు సమయంలో IREPS పోర్టల్‌లో సంభవించే ఏవైనా అవరోధానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్‌కు ఎటువంటి బాధ్యత లేదు. టెండర్ ఫారంలోని నిర్దేశిత అన్ని నిబంధనలను నిర్వర్తించకుండా స్వీకరించబడిన టెండర్లు మొత్తానికి తిరస్కరించబడతాయి. పై టెండర్ యొక్క పూర్తి వివరాలు www.ireps.gov.in పోర్టల్ యొక్క ఇ-వేలం లీజింగ్ మోడ్యూల్‌లో అందుబాటులో ఉన్నాయి.

A0506 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు.

వార్త

జాతీయ ప్రగతి అంటే వ్యక్తుల శ్రమ, శక్తి, నిజాయితీ. జాతీయ పతనం అంటే వ్యక్తుల సోమరితనం, స్వార్థం, దుర్గుణం.

-మార్షల్

# ముందే తెలిసింది


ఈ మధ్య తరచూ ఎండాకాలం ముందే వచ్చిందని తెగ విసవిసలుపోయిన జనానికి భారత వాతావరణ శాఖ అధిక ఎండలే కాదు, ఈ ఏడాది అధిక వర్షపాతం కూడా చూస్తామని ముందే హెచ్చరించింది. ఇది రైతాంగానికి తీపి కబురే. వ్యవసాయానికి పండగే ! ఎండా వానా కుక్కల నక్కల పెళ్లి అంటూ చిన్నతనంలో ఎండ కాసినప్పుడు ఉన్నట్టుండి వాన చినుకులు పడితే ఎగిరి గంతేసే వాళ్ళు. అది చిన్నప్పటి ముచ్చట. కాగా ఇప్పుడు కూడా అలాంటి ఆనందోత్సాహాలు వెల్లివిరిసినా రైతుకు ఎలా ఫీల్ అవ్వాలో ఓ నవ్వు నవ్వుకుని తేలికపడాల్సి వస్తోంది. దక్షిణాదిన ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో అధిక వర్షాలు కురియడం శుభసూచికం. కళ్ళెదుట అకాల వర్షాలను చూస్తూ పంటల నష్టాలను ముందుంచుకొని రైతు వాపోతున్న సందర్భాలు చూస్తున్నాం. ఎప్పుడు వర్షాలు పడతాయో, ఎప్పుడు వడగాల్పులు వీస్తాయో, ఊహించలేని పరిస్థితి. అందువల్లనే అశేష ప్రజానీకం ఆకాశం కేసి చూసి మరీ తమ దైనందిన కార్యక్రమాలను నిర్ణయించుకుంటున్నారు. ప్రకృతి బీభత్సాలను తిట్టుకుంటూ కూర్చోవడం రైతు వంతయ్యింది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల రైతాంగం ఈ అకాల వర్షాలకు, పిడుగు పాటులకు, మేఘాల అలజడికి బిక్కుబిక్కుమని కూర్చుంటున్నారు. తాజాగా ఐఎండీ వ్యవసాయదారులకు ఆశాజనక పరిస్థితులున్నాయన్న చల్లని కబురు చెప్పింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశారు. ఈ సీజన్లో ఎల్‌నినో పరిస్థితులు ఎక్కువగా ఉండకపోవచ్చునని చెప్పింది. ఈ నాలుగు నెలల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. దీర్ఘకాలిక సగటులో వర్షపాతం 105 శాతం నమోదవుతుందని ఐఎండిచీఫ్ మృత్యుంజయ మహాపాత్ర వెల్లడించారు. న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 1971-2020 మధ్యకాలంలో దీర్ఘకాల సగటు 87 సెంటీమీటర్లు మాత్రమే ఉండేదని పేర్కొన్నారు. భారత ఉపఖండంలో సాధారణం కన్నా అతి తక్కువ వర్షపాతం ఏర్పడే ఎల్‌నినో పరిస్థితులు ఈసారి దాదాపు తక్కువే. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రెండు రాష్ట్రాలలో అధిక వర్షాలు వస్తాయని అంచనా. మహారాష్ట్ర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ కర్ణాటకలో ఇలాంటి పరిస్థితులే ఉంటాయని దక్షిణాది రైతుకి మంచి రోజులు వచ్చాయని, ఐఎండి రైతులకు ఎంతో ఉపశమనం కలిగించే వాతావరణ వివరాలు అందించింది. దేశ జనాభాలో దాదాపు 42.3 శాతం మందికి ఈనాటి వ్యవసాయం జీవనోపాధి కల్పిస్తోంది. ఇదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ ఆధారిత స్థూల జాతీయోత్పత్తి 18.2 శాతం మేరకు అభివృద్ధికి దోహదపడే కాలంగా పరిగణిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో సమృద్ధిగా వర్షాలు పడటంఖాయం. విశేషంగా చెప్పుకోదగినది ఏమంటే వడగాడ్పులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విపత్తుగా పరిగణిస్తూ నిర్ణయించి, ఎవరైనా వడదెబ్బకు గురై మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.4 లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించింది. ఇంత క్రితం వడదెబ్బ బాధితులకు ఆపద్బంధు పథకంకింద రూ. 50వేలు మాత్రమే ఉండేది. ఇక రైతుకు భీమా సౌకర్యం విషయానికొస్తే ఇన్సూరెన్స్ ప్రీమియం సొమ్మును కట్టించుకున్నా, మండలం ఒక యూనిట్‌గా భీమా విధానం ఉండడం వలన ఆ మండలం అంతా దెబ్బతింటే తప్ప దెబ్బ తిన్న రైతుకు వ్యక్తిగతంగా ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదు. ఏదిఏమైనా వడగాల్పులు, అకాల వర్షాలు రైతుకు ఆందోళన కారణమే. దేశంలోనే రుతుపవన వేగాన్ని ప్రభావితం చేసే ఎల్‌నినో తాకిడి లేకపోవడం సర్వశుభకరం. ఇదిలా ఉంటే సాధారణ జనానికి ప్రస్తుతం పెరుగుతున్న ఎండలు చీకాకు తెప్పిస్తున్నాయి. దానికి తోడు ఎన్నో అవస్థలు ఇబ్బంది పెడుతున్నాయి. మొక్కలు నాటాలన్న స్పృహ లేనిప్రజల నిర్లక్ష్యపు చేష్టలతో పర్యావరణ విధ్వంసంపై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడగాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉత్తర భారతం క్రమంగా నిప్పుల కొలిమిలా తయారవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడాది చలికాలంవణికిస్తే.. ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు కారణం పర్యావరణ విధ్వంసమే. పాలకులతో పాటు, ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగి పొడి వాతావరణంతో వేడిమి వలన రేడియేషన్ పెరిగి భూమి బాగావేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణ శాఖ నిపుణుల విశ్లేషణ. ఏయేటి కాయేడు దేశంలో ఎండలు మండిపోతున్నాయి. ఇకపోతే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగాచెప్పుకోవాలి. భూగర్భజలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు ఇందుకు కారణమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రమైంది. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణానికి, పచ్చదనానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. తెలుగురాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలమవుతున్నాయి. ఉష్ణోగతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.మండే ఎండలకు తోడు రెండు రాష్ట్రాల్లోను తాగు నీటికి కటకట ప్రారంభమైంది.వాతావరణ మార్పులు రైతు జీవితాల ను గందరగోళ పరుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతును ఆదుకోవడంలో ప్రభుత్వాల బాధ్యత చెప్పుకోదగినది.

ఒక మనిషి అభివృద్ధికి, దిగజారడానికి స్వయంకృతమే కారణం అవుతుంది.



అబ్రహాంలింకన్

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చేయాలనే కోరిక ఉన్నవాడు ఎక్కువ చేయగలుగుతాడు.



జె.ముర్రే

# సంక్షోభంలో రొయ్యల సాగు!

**ఏ పంటఅయినా దేశ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి జరిగినప్పుడే ఆపంట సాగుచేసే రైతుల సేద్యం ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది. అందుకు భిన్నంగా ఉన్నపంటలన్నీనేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. నేటి ఆక్వాసంక్షోభం అందులో భాగమే. దేశప్రజల కోసం కాకుండా, వ్యాపార లాభాల కోసం విదేశాలకు ఎగుమతే లక్ష్యంగా నేడు దేశంలో విచ్చలవిడిగా ఆక్వాసాగు జరుగుతున్నది. ఫలితంగా కొన్ని పంటల దిగుబడులు గణనీయంగా తగ్గి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అంతేకాకుండా ఆక్వాసాగువల్ల అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. దేశప్రజలకు ఆహారాన్ని అందించే విధంగా దేశంలో ఆక్వాసాగు పరిమితం కావాలి. దాణాఖర్చులు తగ్గేవిధంగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదా సబ్సిడీ ఇవ్వటం చేయాలి. యూనిట్‌కు రెండున్నర రూపాయలకే అందించాలి. దేశీయంగానే ఎక్కువగా రొయ్యల విక్రయం జరగాలి. అప్పుడే ఆక్వాసాగు సంక్షోభం నుండి బయటపడుతుంది.**

బొల్లిముంత సాంబశివరావు

రొయ్యల సాగులో భారతదేశం ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. చేపల ఉత్పత్తిలో మూడవ స్థానంలో ఉంది.2021-22లో చేపల ఉత్పత్తి 16.24 మిలియన్ టన్నులు. ఇందులో ఆక్వాకల్చర్ నుండి 12.12 మిలియన్ టన్నులు. ప్రపంచ మత్స్యఉత్పత్తిలో భారతదేశం 10శాతం పైగా ఉంది. ఆక్వారంగం ప్రాథమిక స్థాయిలో 2.8 కోట్లకు పైగా మత్స్యకారులు ఉపాధిని పొందుతున్నారు. కోట్లాది రూపాయల విదేశీమారక ద్రవ్యం భారత ప్రభుత్వానికి లభిస్తున్నది. ఆంధ్రప్రదేశ్లో 3.9 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతున్నది. ఇందులో 1.8 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మరో రెండు లక్షల ఎకరాల్లో చేపల సేద్యం జరుగుతున్నది. ఈసేద్యం కోసం 63,334 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం లక్షా 35 వేలమంది ఆక్వా కల్చర్ సాగు చేస్తున్నట్లు ఈక్రాపింగ్ ద్వారా తెలుస్తున్నది. వీరిలో 2.5 ఎకరాలలోపు సాగుచేస్తున్న రైతులు 95,277 మందికాగా, 2.5 నుంచి 5ఎకరాలలోపు సాగు చేస్తున్న వారు 22,358 మంది ఉన్నారు. 5 నుంచి 10 ఎకరాలు సాగు చేస్తున్నవారు 11,809 మంది ఉంటే, 10 ఎకరాల కన్నా ఎక్కువ సాగు చేస్తున్నవారు 6,398 మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రతిసంవత్సరం రాష్ట్రానికి 18లక్షల టన్నుల ఆక్వాఉత్పత్తుల ద్వారా 66వేల కోట్ల ఆదాయం వస్తుంది. భారతదేశం నుంచి జరిగే ఆక్వా ఎగుమతుల్లో 40శాతం ఏపి నుంచే జరుగుతున్నది. రాష్ట్రం నుంచి ఎక్కువగా చైనా, అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రొయ్యల చెరువుల ఫలితంగా తీరప్రాంత గ్రామాల భూములు ఉప్పునీటి భూములుగా మారటంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తాగునీటి సమస్యతో పాటు రొయ్యల చెరువులు తీరప్రాంత ప్రజల జీవితాలను అల్లకల్లోలంగా మార్చింది. నష్టాలపాలైన చాలామంది చిన్న, సన్నకారు రైతులు ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చింది. మరొకవైపున కొద్దిమంది ఆక్వాసాగులో గుత్తాధిపత్యం వహించారు. సాంకేతిక పరికరాలతో అధిక రొయ్యల ఉత్పత్తి సాధించారు. ఆక్వా సాగు ఖర్చులు వేగంగా పెరిగాయి. అందుకు దాణా ధరల పెరుగుదల, కరెంట్ ఛార్జీలే కారణం. ఈ పెరుగుదల చిన్న సాగుదార్లకు భారంగా మారినా రొయ్యల ధర అనుకూలంగా ఉండటం వలన సాగును కొనసాగించారు. రొయ్యల సాగు ఎగుమతులపై ఆధారపడి ఉంది. మొత్తం సాగులో 90 శాతం ఎగుమతి జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్లో 27 ప్రాసెసింగ్ యూనిట్లు రొయ్యలను ఎగుమతి చేస్తున్నాయి. దేశీయ సాగుదార్లకు నాణ్యమైన వనామీ రొయ్యపిల్లలు లభ్యం కావటంలేదు. ఈ విషయంలో ఈక్వెడార్, ఇండోనేషియా, భారత్ కన్నా చాలాముందు ఉన్నాయి. అందువల్ల భారతదేశం కన్నా దిగుబడి ఎక్కువ ఉంది. ఫలితంగా భారత్ కన్నా ఆక్వా ఉత్పత్తులను తక్కువ ధరలకు ఎగుమతి చేస్తున్నాయి. ఈ దేశాల నుంచి మనదేశ సాగుదార్లు పోటీ ఎదుర్కొంటున్నారు. 2023-24లో రొయ్యల ఎగుమతి ద్వారా భారతదేశానికి 5.2 బిలియన్ల అమెరికా డాలర్ల ఆదాయం పొందింది. రాష్ట్ర జిడిపిలో ఆక్వారంగం కీలకపాత్ర ఉంది. 2023-24 ఆర్థికసంవత్సరంలో దేశంలో కోటి 84వేల టన్నుల మత్స్యఉత్పత్తులు జరగగా, 51.58 లక్షల టన్నుల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానంలో ఉంది. రొయ్యల ఉత్పత్తిలో 76శాతం, చేపల ఉత్పత్తిలో 28శాతం,ఏపీలోనే జరుగుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే భారతదేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అందులో 92శాతం రొయ్యలే.వ్యవసాయ



అనుబంధ రంగాల స్థూల ఆదాయ నిష్పత్తిలో 9.15శాతం ఆక్వారంగం నుంచే వస్తున్నది. రొయ్యల దాణా రేట్లు నిరంతరం పెరుగుతూ ఉంటే, గత మూడు సంవత్సరాలుగా రొయ్యల ధర తగ్గుతూ ఉంది. 2022లో 30కౌంట్రొయ్య ధర 600 నుండి 400లకు పడిపోయింది. 60 కౌంటధర 400 నుంచి 250రూపాయలకు, 80 కౌంట్ 310నుంచి 220 రూపాయలకు ధరతగ్గింది. ఫలితంగా రొయ్యసాగుదార్లు తీవ్రంగా నష్టపోయారు. ధరలు తగ్గి నష్టపోతున్న తమను ఆదుకోవాలని రొయ్యసాగు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వం రొయ్యలకు మద్దతుధర ప్రకటించి రైతులకు మేలుచేసినట్లు చెప్పుకుంది. వంద కౌంట్ కిలోరొయ్యల సాగుకి 270 సాగు ఖర్చుగా ఉంటే, వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర 210 రూపాయలు మాత్రమే. ఈ మద్దతు ధర రైతులకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేదు. వైసీపీ ప్రభుత్వం రొయ్యలసాగు రైతులకు విద్యుత్ యూనిట్‌కు 1.50 రూపాయలకే ఇస్తున్నట్లు ప్రకటించి దాన్ని ఆక్వాసాగు రైతులందరికీ సరఫరా చేసింది. ఏడాది గడిచిన తర్వాత చిన్నరైతులకే దాన్ని పరిమితం చేసి మిగతా రైతుల నుంచి యూనిట్‌కు 3.50 రూపాయలు వసూలు చేసింది. ఒక ఎకరాచెరువుకు నెలకు 7,700 యూనిట్లు అవసరం. యూనిట్‌కి 3.50 రూపాయల వలన ఆ నెలకు 26 వేలు చెల్లించాలి. ఇది ఆక్వారైతులకు చాలా భారంగా మారింది. అసలే సంక్షోభంలో ఉన్న ఆక్వా సాగుదారులను ట్రంప్ విధించిన సుంకాలు మరింత సంక్షోభంలోకి నెట్టింది. భారతదేశం నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలపై 27శాతం సుంకాన్ని విధించాడు.ఇదికాక భారతదేశ రొయ్యలపై అమెరికా యాంటిడంపింగ్ డ్యూటీతోపాటు 5.7శాతం కౌంటర్వైలింగ్ సుంకం వసూలు చేస్తున్నది. ఈసుంకాలన్నీ కలిపి 35శాతంపైగా ఉన్నాయి. మొత్తం సుంకాలను కలుపుకుంటే లక్షరూపాయల విలువ చేసే రొయ్యలపై 35 వేల దాకా సుంకం కట్టాలి. దీనికి ప్యాకింగ్ ఖర్చులు అదనం. భారతదేశ నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలపై 27 శాతం సుంకం విధించిన అమెరికా ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై 10శాతం సుంకం మాత్రమే విధించింది. వియత్నాం, థాయిలాండ్, జపాన్ దేశాలు, భారతదేశం నుంచి షీపుడొస్ కొనుగోలు చేసివాటిని ప్రాసెస్చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి.ఇప్పుడు అమెరికా విధించిన సుంకంవల్ల ఆదేశాలు భారత్ నుంచి ఆర్డర్లు రద్దు చేసుకున్నాయి. మరొక వైపున రైతుల నుంచి సేకరణను ఎగుమతి దారులు రద్దు చేసుకున్నారు. యూరోపియన్ యూనియన్లో భారత ఎగుమతిదారులు 50శాతం తనిఖీ రేట్లు, 4నుండి 7శాతం దిగుమతి సుంకంతో సహా నానా టారిఫ్ అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ దేశాలతో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ కింద జీరో డ్యూటీని పొందాయి.దీనివల్ల వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్‌ను ఆక్రమించాయి.అమెరికా సుంకం పేరుతో భారత వ్యాపారులందరూ సిండికేట్‌గా ఏర్పడి రొయ్యల కొనుగోలు ధరలు తగ్గించారు. ఫలితంగా రొయ్యసాగుదార్లు తీవ్రనష్టాలను ఎదుర్కొంటున్నారు. నష్టాలతో ఆక్వాసాగుచేయలేమని పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా సాగుకి పంటవిరామం ప్రకటించారు. ఆక్వా సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కమిటీవేసి, కేంద్రానికిలేఖ రాసి చేతులు దులుపుకున్నారు. ఏ పంటఅయినా దేశ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి జరిగినప్పుడే,ఆపంట సాగు చేసే రైతుల సేద్యం ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది. అందుకు భిన్నంగా ఉన్నపంటలన్నీ నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. నేటి ఆక్వా సంక్షోభం అందులో భాగమే. దేశప్రజల కోసం కాకుండా, వ్యాపార లాభాల కోసం విదేశాలకు ఎగుమతే లక్ష్యంగా నేడు దేశంలో విచ్చలవిడి ఆక్వాసాగు జరుగుతున్నది. ఫలితంగా కొన్ని పంటల దిగుబడులు గణనీయంగా తగ్గి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. అంతేకాకుండా ఆక్వా సాగువల్ల అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. దేశ ప్రజలకు ఆహారాన్ని అందించే విధంగా దేశంలో ఆక్వాసాగు పరిమితం కావాలి. దాణా ఖర్చులు తగ్గేవిధంగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదా సబ్సిడీ ఇవ్వటం చేయాలి. యూనిట్‌కు రెండున్నర రూపాయలకే అందించాలి. దేశీయంగానే ఎక్కువగా రొయ్యల విక్రయం జరగాలి. అప్పుడే ఆక్వాసాగు సంక్షోభం నుండి బయటపడుతుంది. •

# ఆత్మవిశ్వాసంతో విజయపథంలోకి!

మామిండ్ల శ్రీనివాస్

పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక భాగం. అవి మనం నేర్చుకున్నవి ఎంత వరకు అర్థమైందో అంచనా వేయడానికి ఉపయోగపడతాయి. కానీ, పరీక్షలే జీవితం అన్న భావన పూర్తిగా తప్పు. జీవితం అనేక అవకాశాలు, అనేక అనుభవాలతో కూడి ఉంటుంది. ఒక పరీక్షలో విఫలమయితే జీవితం మొత్తం అంధకారంగా మారిపోదు. ప్రతి పరీక్ష ఓ అంచనా మాత్రమే, కానీ అది విజయం లేదా వైఫల్యాన్ని నిర్దేశించే చివరి అంకం కాదు. ఈ రోజుల్లో విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురవుతున్నారు. మంచి ర్యాంకులు, అత్యుత్తమ మార్కుల కోసం శ్రమిస్తూ మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారు. కొందరు విద్యార్థులు పరీక్షలలో విఫలమైతే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. మరికొందరు తీవ్ర మానసిక సంఘర్షణకు గురై కుంగిపోతున్నారు. ఇది వారి భవిష్యత్తును ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. వాస్తవానికి, ఒక పరీక్షలో వచ్చిన మార్కులు వారి జీవితాన్ని నిర్ణయించలేవు. ప్రతివ్యక్తికీ ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయి. కొంతమందికి గణితం బలంగా ఉండవచ్చు, మరికొందరికి భాషలు, సైన్స్, కళలు, క్రీడలు బలంగా ఉండవచ్చు. మార్కులు మాత్రమే కాదు, మన నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా విధానం కూడా మన విజయంలో కీలక పాత్ర వహిస్తాయి. విజయానికి మార్గాలు అనేకం పరీక్షలలో విఫలమైన వారు జీవితంలో గొప్ప విజయాలు సాధించిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. అల్బర్ట్ ఐన్‌స్టీన్ చిన్నప్పుడు మంచి విద్యార్థి కాలేదు, కానీ ఆయన ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త అయ్యారు. థామస్ అల్వా ఎడిసన్ అనేకసార్లు విఫలమయ్యారు, కానీ ప్రపంచాన్ని మార్చిన పరిశోధనలు చేశారు. ఇవే కాకుండా,జీవితంలో విజయం అనేక మార్గాల్లో సాధించవచ్చు. ఒక రంగంలో విఫలమైనప్పుడే, ఇంకో రంగంలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. మనకు ఆసక్తి ఉన్న విషయాలను అర్థంచేసుకుని, వాటిని అభివృద్ధి చేసుకుంటే, మరింత మంచి భవిష్యత్తును సృష్టించుకోవచ్చు. పరీక్షలు అనేవి ఒకఅంచనా మాత్రమే పరీక్షలు అవసరమే, కానీ అవి మన వ్యక్తిత్వాన్ని నిర్ణయించలేవు. విద్య అనేది మార్కులకే పరిమితంకాదు. మంచి వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, పరిశీలనా శక్తి, క్రమశిక్షణ కూడా విజయానికి కీలకం. విద్యార్థులు పరీక్షలపై భయపడకుండా, వాటిని ఒక అవకాశంగా భావించాలి. ఒక పరీక్షలో సరిగ్గా రాయకపోయినా, తదుపరి అవకాశాలను వినియోగించుకోవచ్చు. ప్రతిసారి కొత్తగా నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. విఫలమైనా మనలో ఉన్నశక్తిని గుర్తించి, ముందుకుసాగాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భూమిక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ఎక్కువ ఒత్తిడి తేవకూడదు. పరీక్షలు ముఖ్యమైనవే, కానీ అవి జీవితాన్ని నిర్ణయించే అంశాలు కావు. పిల్లలకు ప్రోత్సాహం ఇవ్వాలి, వారి ఆసక్తులను గుర్తించాలి. వాళ్లను మార్కుల కోసం ఒత్తిడికి గురిచేయకుండా, వారి నైపుణ్యాలను మెరుగుపరిచేలా ప్రేరేపించాలి. పరీక్షలు కేవలం ఒక అంచనా వేసే పద్ధతి మాత్రమే. అవి జీవితాన్ని నిర్ణయించలేవు. ఒకసారి మార్కులు తక్కువ వచ్చినా, అది జీవితాంతం ప్రభావం చూపదు. కష్టపడి పని చేస్తే, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే, విజయం తప్పక వస్తుంది. కాబట్టి, విద్యార్థులు పరీక్షలకు భయపడాల్సిన అవసరం లేదు. పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే, గమ్యం కాదు. విజయానికి అనేక మార్గాలు ఉన్నాయి. పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే, నిజమైన విజయం సాధించవచ్చు. •

# ప్రజావాక్కు



### టిఐఎస్‌లో తప్పులు సరిచేయాలి

టిచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో చాలాపొరపాట్లు ఉన్నాయి. వాటిని సరిచేయడానికి ఉపాధ్యాయులకు డిడిఓ స్థాయిలో అవకాశం కల్పించాలి.తప్పులను సరిచేసేపని డిడిఓలకు అప్పగించాలి.డిసెంబర్ నెలనుంచి అప్డేట్ కోసం అవకాశం ఇస్తున్నామని ప్రస్తుతం సరిచేసుకోవడం సరికాదని అందువల్ల ఇప్పుడుజిల్లా విద్యాశాఖాధికారి వద్ద మాత్రమే అవకాశం ఇస్తున్నామని విద్యా శాఖ తెలుపుతోంది. టిచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ నందు అప్లోడ్ చేసినప్పుడు ఉన్న సమాచారం,దాన్ని డిస్ప్లే అవుతున్న సమాచారానికి తేడా ఉంటున్నదని ఉపాధ్యాయ వర్గాలు తెలుపుతున్నాయి. టిచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ నందు సాంకేతిక సమస్య వల్ల తప్పులు వస్తున్నాయి అనేది ఉపాధ్యాయులు చెబుతున్న సమాచారం.వీటిని సరిచేసుకునే అవకాశము ఉపాధ్యాయులకుఇవ్వకుండానే ఫెసియల్అటెండెన్స్ యాప్ నందు వివరాలు సరిగా ఉన్నాయని కన్ఫర్మేషన్ చేయమని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదు.

-వాసిలి సురేష్,నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

### టెట్ నిబంధనలు మార్చాలి

టెట్ నిర్వహణలో ఉమ్మడిరాష్ట్రంలో ఉన్ననిబంధనలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. వాటిలో కొన్ని లోపాలు ఉన్నాయి. జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మండలి రూల్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు టెట్‌పరీక్ష నిర్వహణ చేస్తున్నాము అని చెప్పున్నప్పటికి కొన్ని రకాల వ్యత్యాసాలు ఉన్నాయి. డిగ్రీ, డి.ఎడ్ చేసిన వారికి టెట్‌పేపర్ 2లోపరిధిలో జరిగే కేంద్ర టెట్‌లో అనుమతిఇస్తున్నారు.ఉమ్మడిఆంధ్రప్రదేశ్‌లో కూడా నాలుగుసార్లు అనుమతి ఇచ్చి తెలంగాణలో తొలగించారు. రిజర్వేషన్ అంశాలుకూడా కేంద్ర రాష్ట్ర టెట్‌లో వేర్వేరు ఉన్నాయి.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

### భూభారతికి వందనం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన సంస్కరణలో భాగంగా భూభారతి అనే కొత్తపథకం తీసుకురావడం సంతోషకరం. ఈ పథకం ద్వారా వ్యవసాయ భూములు ఇండ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలు కూడా పరిష్కారం కావాలి. భూ కబ్జాలు కొంతవరకు నివారణ అవుతాయి. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన భూములు ఈ చట్టంలో ప్రత్యేకంగా పొందుపరచాలి.భూసమస్యలు, భూ వివాదాలుపరిష్కరించాలి.

-పి. నర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

### వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలి

భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్‌పార్టీ మీద అసహ్యంతో జాతిపిత మహాత్మా గాంధీ గారి గురించి నవభారత నిర్మాత పండిట్ నెహ్రు గారి గురించి వక్ర చరిత్ర చెబుతూ, వీలైనప్పుడల్లా వాళ్ళను తక్కువ చేస్తూ పనికిమాలిన పటేల్ను పొగిడేస్తూ ముచ్చటగా మూడోసారి మోడీజీని ప్రధానిగా ఎన్నుకున్నందుకు మనకు తగిన శాస్తిజరిగింది. పేదవారికి, పెద్దవారితో చెలిమిఎప్పుడూ ప్రమాదమే.ఆనాటిరోజుల్లో నెహ్రూ కమ్యూనిస్టులతోనూ, రష్యాతో సరదాకి చెలిమి చేయలేదు. కమ్యూనిస్టులకి సమానత్వ భావం ఉంటుంది. పెట్టుబడిదారులు పేదవారిని ఉపయోగించుకుంటారు వారిని పొగుడుతూ ఉంటారు కేవలం పనిచేయించుకోవడానికే. ఊడిగం చేయించుకోవడానికే. మోడీగారు అమెరికాతో స్నేహానికి అర్రులు చాచుతూ ఉన్నారు. ట్రంప్ కంపు మన సరదా మనకు తీర్చేసింది. వ్యవసాయానికి పెద్దపీట వేయాలి. వ్యవసాయం చేయడానికి ప్రజలకు సాయం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాధి నేతలు చేయాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### చట్టాన్ని నిర్వీర్యం చేయడమే

కేంద్రం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ఉపాధి హామీ లక్ష్యంనెరవేరడం కష్టంగా మారింది. భూమిని అభివృద్ధి చేసి సాగు యోగ్యంగా మార్చడం అనే పనిని చేయగలిగే పనుల నుండి కేంద్రం తీసివేయడం ఒక అనాలోచిత చర్య. అయితే దీనివల్ల నిరూపయోగం అయిన భూమిని చదును చేసి సాగు యోగ్యంగా మార్చడం మూలంగా ఎక్కువ మందికి ఒకే ప్లేస్ లో ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది. అంత మాత్రమే కాదు ఎక్కువ మొత్తంలో సగటు కూలి లభిస్తుంది. ఇలా బహు విధాలుగా వ్యవసాయ కూలీలు బాగుపడే అవకాశం ఉంటుంది. ఇలాంటి పనిని తీసివేయడం దుర్మార్గమైన చర్య.

-భారత అవినాష్, జనగామ

### సర్వే ఫలితాలు నిరాశాజనకం

ఇటీవల రాష్ట్రంలో వివిధ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్ష చేసే సర్వేజరిగింది.ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. విద్యార్థులు ఏకాగ్రత, ఉత్సాహంగా పాఠాన్ని, ఇంటి చదువునీ పట్టించక వృథా నష్టంకలిగించే వాటిలో నిమగ్నమవుతున్నారు. 15 ఏళ్ల వరకు ఉన్న వారిని పుస్తక పఠనం పై మంచి ఆసక్తి కలుగుతుంది. ఈ ప్రక్రియ సాధ్యమైన చోట్ల విద్యాభిమానులు, యువత, సంఘాల ప్రతినిధులతో చేస్తే చాలా మంచిది.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రాయల్ డిసీజ్ పై అవగాహనే ప్రధానం

డి. జె మోహన రావు

ప్రపంచ రక్తస్రావ రుగ్మతల సంఘం (వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫీలియా డబ్ల్యుఎఫ్హెచ్) స్థాపకులు ఫ్రాంక్ ష్నాబెల్ పుట్టినరోజును పురస్కరించుకుని విశ్వవ్యాప్తంగా ప్రపంచ హిమోఫిలియా దినోత్సవాన్ని 1989 నుండి ప్రతీ ఏడాది ఏప్రిల్17న హిమోఫిలియాతో పాటుగా ఇతర జన్యు రక్తస్రావ రుగ్మత వ్యక్తుల జీవితాలను మెరుగుపరిచేందుకు అంకితమైన లాభాపేక్షలేని అంతర్జాతీయసంస్థ ప్రపంచ రక్తస్రావ రుగ్మతల సంఘం ఆధ్వర్యంలో జరుపుతారు. ఈ సంస్థని 1963లో ఫ్రాంక్ ష్నాబెల్ స్థాపించారు. ఈయన తీవ్రమైన హిమోఫిలియాతో జన్మించారు. ఈసంస్థ ప్రధాన కార్యాలయం కెనడాలోని మాంట్రియల్‌లో ఉంది. ఇది 147 దేశాలలో సభ్య సంస్థలను కలిగిఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థనుండి అధికారిక గుర్తింపు పొందింది. ఈ రోజున రక్తస్రావం రుగ్మతలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యచికిత్స కోసం అవగాహన కలిగిస్తారు. ఈ సంవత్సరం థీమ్ అందరికీ అందుబాటులోఉంది. రక్తస్రావ రుగ్మతలు ఉంటూ నిర్ధారణ చేయబడిన మహిళలు, బాలికలు ఇప్పటికీ ఉన్నారని, ఒక వేళ వ్యాధి మూలాలు ఉన్నవారికి తక్కువ సేవలు అందుతున్నాయని, వీటిని మార్చవలసిన బాధ్యత సమాజానికి ఉందని ఈ ఇతివృత్త సారాంశం. ఇతివృత్తం కేవలం అవగాహన గురించి మాత్రమే కాదు. లింగంతో సంబంధం లేకుండా అందరూ వారికి అవసరమైన రోగ నిర్ధారణ, చికిత్స, సంరక్షణను పొందేలా చూసుకోవాలని, ఈ సంవత్సరం ఇతివృత్తం ఆరోగ్య సంరక్షణలో సమానత్వ ప్రాముఖ్యతను, రక్తస్రావం రుగ్మతలు ఉన్న మహిళలు, బాలికల అవసరాలకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కలుపుకొని ప్రతిస్పందించేలా ఉండవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం 2025 అనేది రక్తస్రావం రుగ్మతలు వివక్ష చూపవని, మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కూడా వివక్ష చూపకూడదని గుర్తుచేస్తుంది. హిమోఫిలియా, ఇతర రక్తస్రావం రుగ్మతల గురించి అవగాహన పెంచడం. ఈ పరిస్థితుల వల్ల బాధపడే వ్యక్తులకు మద్దతును అందించడం. రోగ నిర్ధారణ చికిత్సకు మెరుగైన ప్రాప్యత కలిగించడం ప్రధాన లక్ష్యాలు. హిమోఫిలియా వ్యాధి మొదటిగా పురాతన ఈజిప్టులో కనిపించింది.అయితే 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌కు చెందిన విక్టోరియా రాణి ద్వారా ఈ వ్యాధి ఆమె వారసులకు వ్యాపించింది. అలాగే 19, 20వ శతాబ్దాలలో ఇంగ్లండ్, జర్మనీ, రష్యా, స్పెయిన్ రాజకుటుంబాలను ప్రభావితం చేసినందున ఈ వ్యాధిని కొన్నిసార్లు రాయల్ డిసీజ్ లేదా రాజరిక వ్యాధి అని పిలుస్తారు. హిమోఫిలియా అరుదైన జన్యుపరమైన వంశపారంపర్య రక్తస్రావ రుగ్మత. దీనిలో రక్తం సాధారణంగా గడ్డ కట్టదు. రక్త ప్రసరణ వ్యవస్థలో రక్తం గడ్డకట్టడానికి కొన్ని రసాయనాలు ఉంటాయి. వాటిని గడ్డకట్టే కారకాలని అంటారు. ఇవి రక్తం గడ్డకట్టడానికి సహాయపడతాయి. ఒక




వ్యక్తి రక్తంలో ఈ కారకాలు సాధారణ మొత్తంలో లేనప్పుడు లేదా రక్తం గడ్డకట్టడానికి అవసరమైన గడ్డకట్టే కారకం ప్రోటీన్‌లను తయారుచేయడానికి సూచనలను అందించే జన్యువులలో పరివర్తన (మ్యుటేషన్) లేదా మార్పువల్ల హిమోఫిలియా సంభవిస్తుంది. ఈవ్యాధిఉన్న వారికి చిన్నగాయాల నుండికూడా దీర్ఘకాలిక రక్తస్రావం జరుగుతుంది. ఈ వ్యక్తులు గాయపడినప్పుడు, శస్త్రచికిత్స చేయించుకున్నప్పుడు ఎక్కువసేపు రక్తస్రావం అవుతుంది. కొన్ని సందర్భాల్లో కీళ్లలో, మెదడులో కూడా అంతర్గత రక్తస్రావం సంభవించవచ్చు.ఫ్యాక్టర్ 8ప్రోటీన్ లోపం హిమోఫిలియా-ఎ, ఫ్యాక్టర్ 9 ప్రోటీన్ లోపం హిమోఫిలియా -బి, ఫ్యాక్టర్ 9 ప్రోటీన్ లోపం హిమోఫిలియా -సి వ్యాధులను కలుగజేస్తాయి.దీనికి కారణమయ్యే జన్యువు 'ఎక్స్' క్రోమోజోములో ఉంటుంది. అందువలన పురుషులు ఎక్కువగా ప్రభావి తమవుతారు. ఈ జన్యువును కలిగిన తల్లి ఒక వేల మగ బిడ్డను ప్రసవిస్తే ఆ అబ్బాయి కూడా ఈ వ్యాధి బారినపడే అవకాశం యాభై శాతం, అదే ఆడ పిల్లకు జన్మనిస్తే ఆ పాప క్యారియర్‌గా ఉండే ప్రమాదం యాభై శాతం ఉంది. అందువల్ల హిమోఫిలియా పురుషులలో ఎక్కువగా కనిపిస్తుంది. అయినప్పటికీ ఇది స్త్రీలను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల అమ్మాయిలలో ఋతుస్రావం, ప్రసవానికి ఇబ్బందులు ఏర్పడతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధిగలవారు సుమారు నాలుగు లక్షల మంది ఉన్నారు. వాస్తవంగా ప్రపంచవ్యాప్తంగా హీమోఫిలియాతో నివసిస్తున్న వారిలో 75శాతం కంటే ఎక్కువ మందిని ఇంకా గుర్తించలేదు. అన్ని దేశాల జాతుల మధ్య సమానంగా పంపిణీచేయబడింది. ఇది పదివేలసజీవ జననాలలో ఒకరికి ఈ వ్యాధిసోకే అవకాశం ఉంది.మొత్తం హిమోఫిలియా జనాభాలో 80శాతం నుండి85శాతం వరకు హిమోఫిలియా 'ఎ' రకం వారు ఉన్నారు. భారతదేశంలో సుమారు 1,36,000 మంది బాధితులు ఉన్నారు. ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చు. ఎందుకంటే ఈ వ్యాధి నిర్ధారణ కానివారు చాలామంది ఉండవచ్చు. ప్రపంచంలో మనదేశం రెండవ స్థానంలో ఉంది. వ్యాధి ఉన్న వారి మోకాలు, మోచేతులు, చీలమండలు, కణజాలం, కండరాలలో కూడా భారీ అంతర్గత రక్తస్రావం ఏర్పడుతుంది. ప్రభావిత ప్రాంతాల్లో వాపు, నొప్పివంటి పరిణామాలకు దారితీస్తుంది. ప్రభావితమైన శరీర భాగాలకు శాశ్వత నష్టం కలుగుతుంది. ముఖ్యంగా మెదడులో రక్తస్రావం జరిగినప్పుడు అది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. తేలికపాటి లేదా మితమైన హిమోఫిలియా బాల్యం లేదా కౌమారదశలో కనిపిస్తుంది. వీరిలో ఆకస్మిక రక్తస్రావం అసాధారణం. తీవ్రమైన హిమోఫిలియా సాధారణంగా జీవితంలోనిమొదటి కొన్ని నెలల్లో కనబడుతుంది. వీళ్ళల్లో తరచుగా అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. ఇది బహుళ అవయవాలపై ప్రభావం చూపుతుంది. కీళ్ళల్లో రక్తస్రావం తరచుగా పునరావృతమైతే కీళ్ళ హిమోఫిలియాకు దారితీస్తుంది. హిమోఫిలియా అనేది వంశపారంపర్యంగా వచ్చేవ్యాధి కావున దీనిని నివారించలేం. వీరు శస్త్రచికిత్సలు, దంత చికిత్సలకు ముందు వైద్యులకు తెలియజేయాలి. సమతుల్య ఆహారం, సరైన పోషకాహారం హిమోఫిలియా ఉన్నవారుసాధారణ జీవితాన్ని గడపడానికి సహాయపడతాయి.సరైనచికిత్స,జాగ్రత్తలతో హిమోఫిలియా ఉన్నవారు సాధారణ జీవితం గడపగలరు. •

# గుంటూరు వార్త

## ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమావేశం,పరిశీలిన

**గుంటూరు,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** భారత దేశ ప్రధాని నరేంద్రమోడీ మే 2వ తేది అమరావతి పరిధిలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటున్న దృష్ట్యా అందుకు తగ్గ ఏర్పాట్లను అధికారులు శ్రద్ధపెట్టి విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్,తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ,జిఎంసీ కమీషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి లతో





కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా స్థాయి అధికారులతో విధుల నిర్వహణపై సూచనలుజారీ చేసినప్పుడు వారి సూచనలు అధికారులు తప్పక పాటించాలని సూచించారు.ప్రధానమంత్రి జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటున్నందున ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.కార్యక్రమం జరిగేప్రాంతమంతా శానిటేషన్ చక్కగా ఉండాలని ఇందుకు డిపిఓ,ఎంటిఎంసీ కమీషనర్ సమన్వయంతో అవసరమైన సిబ్బందిని కేటాయించుకొని శానిటేషన్ చక్కగా చేపట్టాల న్నారు.అలాగే హెలీప్యాడ్ రోడ్‌షో ప్రాంతాల్లో చక్కటి శానిటేషన్ ఉండాలన్నారు.ప్రధాని పాల్గొనే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్నందున అందుకు తగ్గ క్రౌడ్ మేనేజ్‌మెంట్ పాటించి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితంగా తిరిగి వారి గమ్య స్థానానికి చేరుకునే విధంగా సంబంధిత అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీసు ప్రజా,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జెడ్పీసీఈవో జ్యోతిబసు,డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి,పిడి డ్వామా శంకర్,ఎస్ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, డిఈవో రేణుక,జిల్లా ఉపాధి అధికారి దుర్గాభాయి ,డిడి హార్టికల్చర్ రవీంద్ర,డిడి గ్రౌండ్‌వాటర్ వందనం,జెడి అగ్రికల్చర్ వెంకటేశ్వర్లు,పిడి హౌసింగ్ ప్రసాద్,జిల్లా కోఆపరేటివ్ అధికారి వీరాచారి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుళ్ళూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపం అమరావతి పరిధిలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో మే 2వ తేది భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాల్గొంటున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను బుధవారం సాయంత్రం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ వీరపాండ్యన్,జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి,ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్,సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ,ఆయుష్ కమీషన్ దినేష్‌కుమార్, సిఆర్డీఏ అదనపు కమీషనర్లు నవీన్, ప్రవీన్ చంద్ పరిశీలించారు.హెలిప్యాడ్ ఏర్పాట్లు, సభా ప్రాంగణం వద్ద చేపట్టల్సిన ఏర్పాట్లు, వివిఐపీలు ప్రయాణించే మార్గాలకు సంబంధించి ప్రాంతాలను పరిశీలించి చేపట్ట వలసిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు.ప్రధాని పర్యటనకు సంబంధించి అవసరమైన ఏరాట్లను వేగవంతంగా చేయాలన్నారు.కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు,ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీనివాసమూర్తి, సీఆర్డీఏ,రెవెన్యూ,పోలీసు శాఖాధికారులు పాల్గొన్నారు.

## గుంటూరుకు ఈఎస్ఐ ఆసుపత్రి

- సీఎం చంద్రబాబు సహకారంతో ఉచిత ప్రాతిపదికన భూ కేటాయింపు.
- పెమ్మసాని చొరవతో మంజూరైన రూ.100 కోట్లతో, వంద పడకల ఆసుపత్రి.

**గుంటూరుతూర్పు,ఏప్రిల్16,ప్రభాతవార్త :** పట్టు వదలని విక్రమార్కుడైన పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు జిల్లాకు మరో రూ. 100 కోట్ల ప్రాజెక్ట్‌ను మంజూరు చేయించారు. చేతి దాకా వచ్చిన హాస్పిటల్ ను మరో రాష్ట్రం తన్నుకు పోకుండా అడ్డుపడ్డారు. ఉచిత ప్రాతిపదికన భూ కేటాయింపు జరపాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి మరీ మంత్రి వర్గ సమావేశంలో ఆమోదింపచేసుకున్నారు. ఫలితంగా గుంటూరు జిల్లా పరిధిలోని సుమారు లక్షకు పైగా కార్మికులకు ఉపయోగపడేలా వంద పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి త్వరలో పునాదిరాయి పడనుంది. వివరాల్లోకి వెళితే.. కేంద్ర సహాయ మంత్రిగా



బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు నుంచి కేంద్ర ప్రభుత్వ పెండింగ్ ప్రాజెక్టులపై గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టి పెట్టారు. అందులో భాగంగా గుంటూరుకు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఈఎస్ఐ హాస్పిటల్ గురించి ఆయన తెలుసుకున్నారు. ఈ క్రమంలో 2024, సెప్టెంబర్ లో కార్మిక శాఖ కేంద్ర మంత్రి మన్సూఖ్ మాండవీయాతో పెమ్మసాని తొలుత లేఖ రాసి, సంప్రదించారు. గుంటూరు కార్మికుల సమస్యలు, ఇబ్బందుల గురించి మాండవియాకి సవివరంగా తెలియజేసిన పిదప కేంద్ర మంత్రి స్పందిస్తూ... ఈఎస్ఐ హాస్పిటల్ ను గుంటూరుకు మంజూరు చేశారు. అందులో భాగంగా నిర్మాణానికి అవసరమయ్యే 6.35 ఎకరాల భూమిని ఉచిత ప్రాతిపదికన కేటాయింపు జరపాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సూచించింది. అయితే అందుకు భిన్నంగా అవసరమైన భూమి నిమిత్తం ఎకరాకు రూ. 1.69 కోట్ల చొప్పున 6.35 ఎకరాలకుగానూ రూ. 10.77 కోట్ల మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. చంద్రబాబు దృష్టికిభూ కేటాయింపులకు చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోరిన వివరాలపై సమాచారం అందుకున్న పెమ్మసాని తక్షణమే స్పందిస్తూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ ఉచిత ప్రాతిపదికన భూ కేటాయింపు అంశాన్ని తీసుకువెళ్లారు. కాగా గుంటూరు జిల్లా కార్మికుల స్థితిగతులు, పెమ్మసాని ప్రయత్నం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని సహృదయంతో స్పందించి ఉచిత భూ కేటాయింపునకు ఆయన అంగీకారం తెలిపారు. ఇదే అంశాన్ని ఈనెల 15న జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా ప్రవేశపెట్టి ఆమోదింప చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందిస్తూ ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, కార్మిక శాఖ కేంద్ర మంత్రి మన్సూఖ్ మాండవీయకి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్య ప్రసాద్ కి, రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ కి, అధికారులకు తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## మాచర్లలో వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

**మాచర్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలో వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం సోదరులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్కు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారత రాజ్యాంగం కాపాడాలంటూ నినాదాలు చేశారు. పార్కు సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తహశీల్దారు కార్యాలయం వరకు ముస్లింలు నల్లబ్యాడ్జీలతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పార్టీలకతీతంగా పట్టణంలోని ముస్లింలందరూ పాల్గొన్నారు. మాచర్ల తహశీల్దారు బి.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. హిందూ ముస్లింల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.



## ప్రజాదర్బార్‌కు 94 అర్జీలు

**వినుకొండ,ఏప్రిల్16,ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. బుధవారం పట్టణంలోని చీఫ్‌విప్ కార్యాలయం నందు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని జీ.వీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు హాజరై సమస్యలతో కూడిన వినతిపత్రాలను జీ.వీకి, అధికారులకు అందజేశారు. మొత్తం 94 అర్జీలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో అధికారులు చురుగ్గా పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రూ.7.50 లక్షల విలువైన హైడ్రో గంజాయి స్వాధీనం

### -ముగ్గురు నిందితులఅరెస్టు -రెండు కార్లు, మూడు సెల్ ఫోన్లు సీజ్

**మంగళగిరి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మంగళగిరి మండల పరిధిలోని కాజా టోల్ గేట్ వద్ద పోలీసులు మెరుపుదాడి జరిపారు. హైడ్రో న్గజాయ్ విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద ఏడున్నర లక్షల



విలువైన హైడ్రో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా కు వినియోగించిన రెండు కార్లను, మూడు సెల్ ఫోన్ లను నిందితుల వద్ద నుండి సీజ్ చేశారు. గంజాయి అక్రమ రవాణా కు సంబంధించిన వివరాలను బుధవారం మధ్యాహ్నం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు.అత్యంత మత్తులో ముంచే హైడ్రోజన్ అనేది కొత్తగా తెరపైకి వచ్చిందని ఎస్పీ తెలిపారు. గతంలో గంజాయి కొకైన్ వంటి ఇంకా మత్తు పదార్థాలు ఉండగా నేడు శరీర నాడి వ్యవస్థ పై తీవ్ర దుష్ఫలితాలను చూపే హైడ్రో గంజాయిను కొందరు వ్యక్తులు తాము తాగుతూ కాలేజీలో విద్యార్థులు యువకుల లక్ష్యంగా విక్రయిస్తు న్నారని తమ దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. బెంగళూరు నుండి విశాఖపట్నం వరకు అక్రమ గంజాయి రవాణా జరుగుతున్నదన్న సమాచారం అందుకున్న జిల్లా పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి మండల పరిధిలోని కాజా టోల్గేట్ వద్ద పోలీస్ అధికారులు సిబ్బంది కాపుకాసి ఉన్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 15వ తేదీ రాత్రి ఇద్దరు వ్యక్తులు మరో వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా తమ సిబ్బంది మెరుపు దాడి చేసి ముగ్గురు నిందితులను పట్టుకున్నా రన్నారు. విచారించగా వారు పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండ్నల చెరుకువాడ గ్రామానికి చెందిన ఇందుకూరి రామకృష్ణంరాజు(35) విశాఖపట్నం సువర్ణ కాలనీకి చెందిన పురుగంటి. అనిల్ కుమార్(30) నాగరాజు శ్రీ హర్షవర్ధన్ వర్మ( 27)లు గా తెలిసిందన్నారు. విచారించగా హైడ్రో గంజాయి విక్రయ విషయం వెల్లడైందన్నారు.వారి వద్ద 7:50 లక్షల రూపాయలు విలువైన హైడ్రో గంజాయిని స్వాధీనం చేసుకున్నా మన్నారు. గంజాయి అక్రమ రవాణా ఉపయోగించిన రెండు కార్లను మూడు సెల్ఫోన్లను నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు.బెంగళూరు హైడ్రోజన్ అడ్డాగా మారిందని తమ దర్యాప్తులో వెల్లడైందని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.ఇందుకూరి రామకృష్ణంరాజు, పురుగంటి అనిల్ కుమార్లు బెంగళూరు వెళ్లి అక్కడ అమిత్ అనే వ్యక్తి వద్ద హైడ్రో గంజాయిని గ్రాము 700 రూపాయలకు తీసుకువచ్చి ముగ్గురు కలిసి గ్రామును వివిధ ప్రాంతాలలో 1500 రూపాయలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అమిత్ వద్ద వారు రూ.3 లక్షల రూపాయలు విలువైన 500 గ్రాముల గంజాయిని తీసుకువచ్చి రూ .7:50 లక్షల రూపాయలకు విక్రయించే ఉద్దేశంతో కారులో బెంగళూరు నుండి విశాఖపట్నం తరలించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాజ టోల్గేట్ వద్ద తమ స్నేహితునికి హైడ్రో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు మెరుపు దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద ఏడున్నర లక్షల రూపాయలు విలువైన హైడ్రో గంజాయిని రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై సులభంగా డబ్బు సంపాదించవచ్చని దురుద్దేశంతో బెంగళూరులో ఉంటున్న అమిత్ తో కలిసి హైడ్రోగంజాయని తీసుకువచ్చి మార్కెట్లో అధిక ధరకు విక్రయించవచ్చని అత్యాశతో నిందితులు విక్రయానికి పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. పక్కా సమాచారంతో నిఘా వేసి నిందితులను పట్టుకున్న మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ లను సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు. కాగా రాబోయే రోజుల్లో గంజాయి ముఠాపై అత్యంత నిఘా ఉంచుతామని ఆయన తెలిపారు.

## ప్రతి ఒక్కరికీ భరోసా

### -మంగళదాస్ నగర్‌లో ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే నసీర్

**గుంటూరుతూర్పు,ఏప్రిల్16,ప్రభాతవార్త :** ఎన్నో ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఒక్కొక్కటి గట్టెక్కుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో నిరాదరణకు గురైన నిర్భాగ్యులు, ఆదరణకు నోచుకోని కాలనీల వాసులు ప్రజా దర్బార్ వేదికగా ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ వద్ద సాంత్వన పొందుతున్నారు. గుంటూరులోని మంగళ్ దాస్ నగర్ లో బుధవారం ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, మురుగునీరు సమస్య, మంచినీటి వ్యవస్థ వంటి అంశాలపై అధికంగా అర్జీలు అందజేశారు. అలాగే స్థానిక మంగళ దాస్ నగర్ లో ఉన్న నిర్విఘ్నమైన కమ్యూనిటీ హాల్ ని సిఎస్ఆర్ నిదుల ద్వారా త్వరలో ప్రణాళికలు రూపొందించి పూర్తి చేస్తామని ప్రజలు అందించిన అన్ని సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజా దర్బార్ కు వచ్చిన వారిని ఎమ్మెల్యే ఆప్యాయంగా



పలకరిస్తూ... వారికి ధైర్యం నింపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల సమస్యలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పరిష్క రిస్తున్నట్లు తెలిపారు. ప్రజాధర్బార్ తోపాటు ప్రతి రోజూ కాలనీలకు వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు. అనంతరం అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రిహానా , క్లస్టర్ ఇంచార్జ్ వేల్చూరు కిరణ్, చెట్టు కనకారావు, పల్లె పోగు రమేష్, చాట్ల విజయబాబు, బెనర్జీ మాస్టర్, ఇమ్రాన్,

## 700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**వెల్దుర్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండల పరిధిలోని కొత్తపుల్లారెడ్డి గూడెం అటవీ ప్రాంతంలో మాచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి



నాటుసారా తయారీలో ఉపయోగించే 700 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. 15 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు, నరసరావుపేట జిల్లాల అధికారులు తమ సిబ్బందితో కలిసి వెల్దుర్తి మండలం అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. నాటుసారా తయారు చేసినా అక్రమ మద్యం అమ్ముతున్న వారిపై కేసులు పెట్టి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వ్యర్థాలను రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లో వేయరాదు :

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్16,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అపార్ట్మెంట్లు, కమ్యూనిటి గృహ సముదాయాల వారు తమ ఇళ్లల్లో వచ్చే వ్యర్థాలను రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లో వేయరాదని నగర కమిషనర్ పులి



శ్రీనివాసులు ఐఏఎస్ తెలిపారు. బుధవారం పట్టాభిపురం, రవీంద్ర నగర్, శ్యామలానగర్, కృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్యామల నగర్ 3వ లైన్ లోని ఓ అపార్ట్మెంట్ వాచ్ మెన్ వ్యర్థాలను పక్కన ఖాళీ స్థలంలో వేయడం గమనించి, తనని వారించి అపార్ట్మెంట్ కమిటి సభ్యులతో మాట్లాడుతూ వ్యర్థాలను పక్కన ఉండే ఖాళీ స్థలాల్లో వేయడం వలన చుట్టుపక్కల ఉండే నివాసితులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ప్రతి అపార్ట్మెంట్ లో తగిన డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, కంపోస్ట్ ఎరువు తయారీకి ముందుకు రావాలన్నారు. కంపోస్ట్ ఎరువు తయారీ కోసం నగరపాలక సంస్థ తగిన అవగాహన కల్గిస్తామని తెలిపారు. ప్రజారోగ్య కార్మికులు కూడా కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో సేకరించిన చెత్త వేయకుండా ఇన్స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. డివిజన్ల వారీగా అదనపు కార్మికులతో పాటు వాహనాలు ఇస్తున్నామని, వాటి ద్వారా చెత్త కుప్పలను డంపింగ్ యార్డ్ కి తరలించాలన్నారు. కృష్ణ నగర్ పార్క్ ని పరిశీలించి, పార్క్ లో వాకింగ్ ట్రాక్ మరమత్తుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని, మరమత్తుకు గురైన ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్ ని సదరు కాంట్రాక్టర్ తో చేయించాలని డిఈఈని ఆదేశించారు. పర్యటనలో డిఈఈ శ్రీనివాస్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బోరుగడ్డ అనీల్‌కు రిమాండ్ పొడగింపు

**నరసరావుపేట క్రైం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** వైకాపా నాయకులు బోరుగడ్డ అనీల్‌కు రిమాండ్‌ను విధిస్తూ స్థానిక 2వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎన్.గాయత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లపై అణుచిత వ్యాఖ్యలు చేశారని బోరుగడ్డ అనీల్‌పై ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనను పోలీసులు కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మార్చి 24న ఆయనకు రిమాండ్ విధించగా ఆ రిమాండ్‌ను 28 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ఆయనను రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులో హాజరుపరిచారు.

## 30 వేల మందిని అక్షరాస్యులుగా తయారు చేయాలి : పల్నాడుజిల్లా కలెక్టర్

**నరసరావుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలో ఉల్లాస్ పథకంలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరంలో 30 వేల మందిని అక్షరాస్యులుగా తయారు చేయడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యులను తయారు చేయాలన్నారు. 2024-25లో ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చదవడం, రాయడం రాని 10707 మందిని అక్షరాస్యులుగా చేశామన్నారు. ఉల్లాస్ పథకంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నవారికి కలెక్టర్ అరుణ్‌బాబు వివిధ సూచనలు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. అదే విధంగా సెర్ప్, మెప్మా లబ్దిదారులు జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది, అంగన్‌వాడీ సహాయకులు, ఉపాధిహామీ కూలీలలో నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాలలో తరగతులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలిచ్చారు. సమావేశంలో డిఈవో చంద్రకళ, డిఆర్‌డిఏ పి.డి. ఝాన్సీ రాణి, సచివాలయాల నోడల్ అధికారి వెంకటరెడ్డి, జిల్లా వయోజన విద్యాధికారి జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.



## తప్పిన పెను ప్రమాదం

**పొన్నూరు, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో బుధవారం పెట్రోలు ట్యాంకర్ బోల్తా పడింది. కొండపల్లి నుంచి పెట్రోలు నింపుకుని చీరాలలోని హెచ్‌పీ బంకుకు బయలు దేరింది. మార్గమధ్యలో నారాకోడూరు వద్ద హైస్కూల్ వద్ద ఇటీవల పెద్ద పెద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.



స్పీడ్ బ్రేకర్లకు ఎలాంటి రంగులు పూయక పోవడంతో అక్కడ వేగనిరోధకముంది అనే విషయం తెలియడం లేదు. పెట్రోలు ట్యాంకర్ డ్రైవర్ కూడా వేగనిరోధకాన్ని గమనించకపోవడంతో స్పీడ్ బ్రేకర్‌పై నుంచి ఒక్కసారిగా ఎగిరిపడి లారీకి సంబంధించి గడ్డర్ విరిగిపోయింది. దీంతో పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడింది. ట్యాంకర్‌కు చిన్నపాటి రంధ్రం పడి పెట్రోలు కిందపోతుంది. విషయం తెలుసుకొన్న స్థానికులు జిల్లా అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాసరెడ్డికిసమాచారం అందించారు. శ్రీనివాసరెడ్డి హుటా హుటిన గుంటూరు, పొన్నూరు అగ్నిమాపక శకటాలను సంఘటనా స్థలానికి రప్పించి ప్రమాదనివారణా చర్యలు చేపట్టారు. మంటలు వ్యాప్తి చెందకుండా ఫోమ్ అనే రసాయనాన్ని ట్యాంకర్ చుట్టూ పిచికారి చేశారు. అనంతరం క్రేన్లను తెప్పించి పడిపోయిన ట్యాంకర్‌ను పైకి లేపారు. డ్రైవర్ వీరాస్వామికి కాలుకి దెబ్బ తగలడంతో గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అదే ప్రమాదం జరిగినట్లయితే తమ పరిస్థితి ఎంటోనని ఊహించుకొంటూ మిన్నకుండిపోయారు.

## జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బంది, వసతుల కొరత

**నరసరావుపేట , ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సరైన వసతులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని పౌరహక్కుల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి శిఖినం చిన్న ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సంఘం నాయకులు ప్రభుత్వ వైద్యశాలను



సందర్శించి మాట్లాడారు. పేరు గొప్ప ఊరు దిబ్బలాగా హాస్పటల్ పరిస్థితి ఉందన్నారు. రోగులకు సరైన వైద్యం అందించలేని పరిస్థితి అక్కడ నెలకొందని తెలియజేశారు. హాస్పటల్‌లో రోగులకు సరిపోను 30 మంది సేవలందించాల్సిన స్దానాలలో కేవలం పది మంది కూడా లేరన్నారు. వైద్య సిబ్బందిని అడిగితే తామేమి చేయలేమని సూపరింటెండెంట్‌కు తెలపాలని అంటున్నట్లు పేర్కొన్నారు. బాత్రూమ్‌కు వెళ్ళేందుకు నీళ్ళు లేవని అడిగితే అందుకు సమాధానం లేదన్నారు. కనీసం సమస్యలు తెలిపేందుకు సూపరింటెండెంట్‌కు కలిసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. హాస్పటల్‌లో మూడు రోజుల నుండి గుర్తు తెలియని వ్యక్తిని కొందరు వైద్య చికిత్స కోసం చేర్పిస్తే కనీసం పట్టించుకున్న నాధుడు లేరన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించాలని, సమస్యలను పరిష్కరించాలని, జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు రావాలంటేనే భయపడుతున్న ప్రజలకు భరోసా కల్పించాలని నాయకులు శిఖినం చిన్న కోరారు.

## కారంపూడి నాగులేరు వంతెన నిర్వహణ వైఫల్యం

### - వాహనదారులకు, పాదచారులకు నరకం

**కారంపూడి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** చారిత్రక ప్రసిద్ధి గాంచిన మండల కేంద్రమైన కారంపూడి నరసరావుపేట, పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి, మాచర్ల, వినుకొండ పట్టణాలకు కూడలి ప్రాంతంగా ఉంది. నాగులేరుపై హైలెవల్ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ వంతెన నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వర్షం పడినప్పుడు నీరు వంతెనపై చాలాచోట్ల నిల్వ ఉంటుంది. దీనివల్ల పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు గుంతల్లో నిలిచిన నీరు పాదచారులపై పడుతున్నాయి. దెబ్బతిన్న రోడ్డుకు ఇటీవల తూతూమంత్రంగా పాచ్ వర్కులు చేశారు. లోతుగా ఉన్న గుంతపై లావు కంకర వాడి నామమాత్రంగా తారు వేశారు. దాని మీదుగా వాహనదారులు వెళ్లడానికి భయపడుతున్నారు. రాత్రిపూట నిరంతరాయంగా విద్యుద్దీపాలు వెలగకపోవడంతో పాదచారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వంతెనపై రెండువైపులా ఫుట్‌పాత్‌ల సిమెంటు పలకలు చాలా భాగం ధ్వంసమయ్యాయి. ఒకవైపున రెయిలింగ్ దెబ్బతింది. సిమెంటు ఊడిపోయి చువ్వలు దర్శనమిస్తున్నాయి. వంతెనకు పూర్తిస్థాయి మరమ్మతులు చేసి ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## నేడు ఏఎన్‌యు కళాశాలల వార్షికోత్సవం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** వర్సిటీలోని ఆర్ట్స్ సైన్స్ ఫార్మసీ కళాశాలల వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ తెలిపారు.బుధవారం వార్షికోత్సవ కన్వీనర్లతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా,సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కన్వీనర్లు ఆచార్య ఎం.త్రిమూర్తి రావు,ఆచార్య సిహెచ్ లింగరాజు,డాక్టర్ డి.రవిశంకంర్‌రెడ్డి,ఆచార్య వి.దివ్యతేజో మూర్తి మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.ఈ మేరకు పలు కమిటీలను నియమించామని కమిటీలకు కేటాయించిన బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు.ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా ఏపి డిప్యూటీ సీఎం జాయింట్ సెక్రటరీ ఎం.కృష్ణతేజ ,హైదరాబాదు లోని సిఎస్‌బి ఐఏఎస్ అకాడమి నిర్వాహకులు ఎం.బాలలత ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొననున్నారు.

# ముఖ్యమంత్రి కష్టాన్ని, ఆలోచనలను అధికారులు గుర్తించకపోతే ఎలా?

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల,ఏప్రిల్16,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కష్టాన్ని, ఆలోచనలను అధికారులు గుర్తించకపోతే ఎలా అని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రశ్నించారు. బుధవారం నాదెండ్ల యంపిడిఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుండాచేసినట్లు ప్రజలను నమ్మించి చంద్రబాబు కష్టంపై నీళ్ల చల్లకుండానే అధికారులను ఉద్ధేశించి మాట్లాడారు. కేవలం దోపిడి కోసమే గత పాలకులు ఒక్క మండలంలోనే 17వేల ఎకరాల రైతుల భూములను నిషేదిత భూములలో చేర్చారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలపై ప్రజలిచ్చే అర్జీలు పరిష్కారంపై అధికారుల తీరుపై ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పి4 సత్ఫలితాలు ఇవ్వాలంటే ప్రవాసాంధ్రులు మార్గదర్శకులుగా మారాలని ప్రత్తిపాటి కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తేనే మీకు, మాకు, ప్రభుత్వానికి ప్రజలలో మంచిపేరు వస్తుందనే వాస్తవాన్ని అధికార యంత్రాంగం గుర్తించాలని ప్రత్తిపాటి సూచించారు. నిషేదిత జాబితాలో ఉన్న 17వేల ఎకరాల పై పల్నాడు జిల్లా కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించి వాటి పరిష్కారంపై దృష్టి పెట్టి రైతులను న్యాయం చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పూర్తి సమాచారంతెలుసుకొని సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుండా చేసినట్లు నివేదికలు పంపడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలు ఇచ్చే అర్జీలను బుట్టదాఖలు చేస్తే సహించేది లేదని, అలాగే సమస్యలను సరిగ్గా పరిష్కరించకుండా పరిష్కారం చేసినట్లు ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి నివేదికలు పంపటాన్ని ఆయన తప్పుపట్టారు. అనధికార లేఔట్లను ఉపేక్షించేదిలేదని, ప్రజలను మోసగించి




తాము లబ్దిపొందుతున్నామనే వారిని ఉపేక్షించడం ఎంతమాత్రం సరైనది కాదని అధికారులకు స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని అనధికార లేఔట్లను ప్రత్యేక డ్రైవ్‌ద్వారా గుర్తించి సంబందిత భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాటి అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం లేఔట్లు వేసి, మార్గదర్శకాల ప్రకారం అన్ని వసతులతో అభివృద్ది చేస్తే ప్రజలు ఎందుకు పిర్యాదు చేస్తారని ప్రత్తిపాటి ప్రశ్నించారు. అధికారులు, ఇతర సిబ్బంది తమ పనితీరు మార్చుకోవాలని ముఖ్యంగా రెవెన్యూ,మున్సిపల్, పంచాయితీరాజ్ విభాగాలపై ప్రజలనుంచి, కూటమి నాయకులనుంచి పిర్యాదులు వస్తే వారిపై చర్యలు తీసుకుంటానని ప్రత్తిపాటి ఈ సందర్భంగా తెలిపారు. ప్రజా ప్రతినిధులైన తామైనా, అధికారులైనా ప్రజలకు సేవ చేయటానికే ఉన్నామనే వాస్తవాన్ని విస్మరించడం ఎవరికి మంచిది కాదని ప్రత్తిపాటి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ ఎవి రమణ, యంపిడిఓ స్వరూపరాణి, యంపిపి తలతోటి రాణి, రూరల్ సిఐ బి సుబ్బనాయుడు, విద్యుత్‌శాక ఎడి కొండలు, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు హరిబాబు, గంగా శ్రీనివాసరావు, మొగిలి నాగలక్ష్మీ, వలేటి హిమవంతరావు, కందుల రమణ, మండల పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డు బిల్లు సవరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

- వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ ముస్లింలకు తీరని అన్యాయం

**కారంపూడి, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు బిల్లు సవరణకు వ్యతిరేకంగా కారంపూడిలో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. బుధవారం స్థానిక చెక్‌పోస్టు నుంచి ప్రారంభమైన ర్యాలీ తహశీల్దారు కార్యాలయం వద్దకు చేరుకుని తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మైనార్టీ



నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ ముస్లింలకు తీరని అన్యాయం అని అన్నారు. ఈ చట్టం ముస్లిం ఆస్తులపై అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీకాలనీలలోని డ్రైనేజ్ సమస్యలపై పరిశీలన

**యడ్లపాడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తుర్లపాడు, ఉన్నవ గ్రామాలలోని ఎస్సీకాలనీలో డ్రైనేజ్ సమస్యల పరిష్కారముకొరకు మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, జిల్లా పంచాయితీ అధికారి విజయభాస్కర రెడ్డి, ఎంపీడీవో హేమలతాదేవి, ఇవోపిఆర్డి షేక్ జాకీర్‌హుసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎఇ సూర్యతేజ పర్యటించారు. ఆయా గ్రామాలలోని కాలనీలలో డ్రైనేజ్ సమస్యలపై పరిష్కారం చేసే దిశగా తగు సూచనలు సలహాలను అధికారులకు అందజేశారు. అనంతరం జగ్గాపురం గ్రామంలోని పిడబ్ల్యూఎస్ స్కీమ్ నిర్వహణ పరిశీలించారు. వారితోపాటు ఆయా గ్రామాల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# రాజశేఖర్ మృతికి పలువురు సంతాపం

**యడ్లపాడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** యడ్లపాడు వాసులకు ఎంతగానో సుపరిచితుడు తెలగతోటి రాజశేఖర్(63) మంగళవారం ఉదయం అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా లంగ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న ఆయన గుంటూరు లోని ఆసిరెడ్డి అంకాలజీ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. సుదీర్ఘకాలం విద్యా రంగంలో సేవలందించిన రాజశేఖర్ త ండ్రి రాజేశ్వరరావు లూథరన్ ఉనత్న పాఠశల ప్రధానోపాధ్యాయులుగా, తల్లి కనకవల్లి అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించారు. 17ఏళ్ళ కిందట తండ్రి రాజేశ్వరరావు మృతి చెందగా తల్లి కనకవల్లి ఉన్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా, వీరిలో పెద్దవవాడైన రాజశేఖర్ పలు ప్రైవేట్ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్, పీఈటీగా తమ సేవలతో విద్యార్ధులు హృదయాల్లో స్థానం సంపాదించారు. అయన మృతికి పలువురు తమ సంతాపాన్ని సానుభూతిని తెలియజేసారు. బంధువులు, కటుంబ సభ్యులు, స్నేహితులు కడసారి వీడ్కోలు పలికారు.



# కెఎల్‌యులో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

**తాడేపల్లి,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఐసిఈఈఎస్–2025అనే పేరుతో ఎమర్జింగ్ ఎలక్ట్రానిక్ సస్టైనబిలిటి అంతర్జాతీయ సదస్సును బుధవారం ఘనంగా నిర్వహించారు.వర్సిటీలోని ఐఆర్డి,ఈఎల్ఓజిఐ, ఎండిఅర్,ఈసిఈ నాలుగు విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సుకు తమిళనాడులోని చెన్నైకు చెందిన అన్నా యూనివర్సిటీ డీన్ డాక్టర్ ఆర్.జయవేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానోమెటీరియల్స్ వినియోగం ద్వారా పర్యావరణ హితం కలిగించే ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి పెట్టాలన్నారు.ఎనర్జీ స్టోరేజ్,ట్రాన్సిస్టర్లపై ఫోకస్ చేయడం వంటి అంశాలను ఆహూతులను ఎంతగానో ఆకట్టు కుంది.సదస్సుకు విద్యా,పరిశోధన,పరిశ్రమ రంగాల నుండి ప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.సదస్సుకు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు ముఖ్యవక్తగా వ్యవహరించి అధ్యక్షోపన్యాసం చేశారు.ఆన్‌లైన్ ద్వారా తమిళనాడులోని చెన్నైకు చెందిన ఎంఆంటి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ వి.రాజేంద్రన్ పర్యావరణ మార్పులకు అనుగుణంగా తట్టుకునే ఎలక్ట్రానిక్ వ్యవస్థల అవసరాన్ని వివరించగా గుజరాత్‌లోని వడోదరా కు చెందిన జిఎస్ఎఫ్‌సి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.ఆర్.సిన్హా సుస్థిర అభివృద్ధిలో నైతిక ఏఐ పాత్ర గురించి ఆన్‌లైన్ ద్వారా తెలియజేశారు.అనంతరం ఐఆర్డి విభాగాధిపతి డాక్టర్ ఎం.విశ్వనాథ్ షెనాయ్ మాట్లాడుతూ సదస్సు లక్ష్యాలను,వర్క్‌షాపులు,ప్యానల్ చర్చలు మొదలైన అంశాల గురించి వివరించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు అడ్వాన్స్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్)ఆర్థిక సహకారం అందించినట్లు ఆయన తెలిపారు.ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి 400కి పైగా పరిశోధనా పత్రాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.వాటిలో 225 ఎంపికయ్యాయని తెలిపారు.విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పోస్టర్ ప్రదర్శన సెషన్ ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు.వివిధ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పరిశోధనలను ప్రదర్శించారు.కార్యక్రమంలో వర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారధివర్మ,ప్రొ విసీలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్,ఐఆర్డి విభాగాధిపతి డాక్టర్ వి.విశ్వనాథ్ షెనాయ్,ఐఆర్డి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వివేకానందన్, ఈఎల్ఓజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.అరుణ్ మేధా,ఎన్ఐటి,ఐఐటి వంటి జాతీయ విద్యాసంస్థల నుండి ఇతర దేశాల నుంచి పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.



# అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

**బొల్లాపల్లి,ఏప్రిల్16,ప్రభాతవార్త:** మండలంలోని వెల్లటూరు, రెమిడిచర్ల, గరికపాడు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయిస్తున్న ఆరు మంది వ్యక్తులను మండల తహశీల్ధార్ కార్యాలయంలో బైండోవర్ చేయడం జరిగిందని ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ డి. వెంకటేశ్వర్లు తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలు చట్టరీత్యా నేరమని చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ : కమిషనరు

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్16,ప్రభాతవార్త :** ఈ నెల 30తో ముగియనున్నముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (202526) సంబందించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోపు ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5



శాతం రాయితీ లభిస్తుందని, ప్రజలు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఎఎస్ తెలిపారు. బుధవారం ఒమేగా హాస్పిటల్స్, ఆర్వీఆర్ జేసి ఇంజినీరింగ్ కాలేజీలు ముందస్తు పన్ను చెల్లిస్తూ కమిషనర్ కి చెక్ లను అందించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నును ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని, ఈ నెల 30లోపు ఆస్తి పన్నుని ఏక మొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందని తెలిపారు. ఒమేగా హాస్పిటల్స్ రూ.15,12,784, ఆర్వీఆర్ జేసి ఇంజినీరింగ్ కాలేజీ రూ.16 లక్షల ముందస్తు పన్ను చెల్లింపు చెక్ లను అందించారన్నారు. అలాగే ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చని తెలిపారు.నగరంలోని ఆస్తి, ఖాళీ స్థలపన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని ఈ నెలాఖరు లోపు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని కోరారు. ఆస్తి పన్నుదారులకు సౌలభ్యంగా జిఎంసి ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్ కార్యాలయంలోని 6 ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ప్రతి రోజు ఉదయం 7 నుండి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా ఏర్పాటు చేశామని తెలిపారు.కార్యక్రమంలో ఒమేగా హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ ఎం.గోపాల నాగ కిషోర్, రెవెన్యూ అధికారి సాదిక్ భాష, ఆర్ఐ ఖాజావలి పాల్గొన్నారు.

# నూలు మిల్లులో ఒరిస్సా కార్మికుడు మృతి

**యడ్లపాడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న భవనం నూలు మిల్లులో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన చోటుచేసకుంది. సంఘటనలకు సంబంధించి స్థానిక ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం జగన్నాథ్ ప్రసాద్ మండలం, దధిభమనపుర్ గ్రామం, భద్రక్ జిల్లా, ఒరిస్సా రాష్ట్రంకు చెందిన భీమ్‌సేన్ మాలిక్ గత నాలుగు సంవత్సరాలుగా మిల్లులో సైడర్‌గా విధులు నిర్వహించతున్నాడని, ఒంటరిగానే ఉంటున్నాడని, అతనికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, అయితే గత కొన్ని రోజుల నుండి మధ్యం సేవించుతూ క్వార్టర్స్‌లో ఉంటున్నాడన్నారు. అయితే 13వ తేది ఉదయం సహ ఉద్యోగి బసంత్ మాలిక్ పరిశీలించగా మృతి చెంది యుండటాన్ని గమనించి మిల్లు నిర్వాహకుల ద్వారా సమాచారం అందించటం జరిగిందన్నారు. సంఘటనకు సంబంధించి విషయాన్ని ఒరిస్సాలోని బంధువులకు తెలపగా వారు రావటానికి నిరాకరించటంతో మృతుడి భౌతిక కాయాన్ని బుధవారం పోస్టుమార్టమ్ నిర్వహించటం జరిగిందన్నారు. బసవంత్ మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు అదారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహించుతున్నామని తెలిపారు. అయితే మూడు రోజుల నుండి కార్మికుడు మృతి చెందిన విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. కేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించితేగాని పూర్వాపరాలు బయటికిరావని అంటున్నారు.



# హోటల్‌లో అగ్నిప్రమాదం - ఆరుగురికి స్వల్పగాయాలు

చిలకలూరిపేట,ఏప్రిల్16,ప్రభాతవార్త: పట్టణం లోని భావనారుషి నగర్‌లో పి జాలయ్యకు చెందిన చిన్న హోటల్‌లో బుధవారం ఉదయం



అగ్నిప్రమాదం జరిగింది. టిఫిన్ తయారు చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ హోటల్‌ను పగడాల జాలయ్య అనే వ్యక్తి నడుపుతున్నాడు. మంటలు రాగానే స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడ టిఫిన్ చేస్తున్న, హోటల్‌వారికి మొత్తం ఆరుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. ఫైర్ స్టేషన్ సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. స్వల్పగాయాలైన ఆరుగురు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని పట్టణ సిఐ పి రమేష్ సందర్శించి సమాచారం సేకరించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## -ఐసిడిఎస్ సీడిపిఓ ఎస్.వెంకటరమణ

**పొన్నూరు, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ



ఎస్.వెంకటరమణ కోరారు. పట్టణంలోని 12వ వార్డు జయభారత్‌రెడ్డి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ ద్వారా అందించే బలవర్ధకమైన ఆహారాన్ని స్వీరించాలని కోరారు. ఆకుకూరలు, పాలు, గుడ్లుతోపాటు చిరు ధాన్యాలు తీసుకోవడం ద్వారా రక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా ఇచ్చే గుడ్లు, పాలు, ఆకుకూరలు తీసుకొని ఆరోగ్యవంతంగా జీవించాలని కోరారు. గర్భిణీలు బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు గంటలోపు పట్టించాల న్నారు. దాని ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని చెప్పారు. పలువురికి శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెంచయ్య మృతి పార్టీకి తీరనిలోటు

**పొన్నూరు, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** మండల పరిధి, కసుకర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త కొండెపు చెంచయ్య మృతి టిడిపి తీరని లోటని వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు అన్నారు. చెంచయ్య మృతి వార్త విన్న టిడిపి నాయకులు కసుకర్రు వెళ్ళి చెంచయ్య మృతదేహంపై పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాదల వెంట రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, చలమశెట్టి సీతారామయ్య, బొప్పన బాపనయ్య, సుబ్బారావు, ప్రసాద్ తదితరులున్నారు.



# ఐఐటి ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలను అభినందించిన ఏయంజి డైరక్టర్

**చిలకలూరిపేట,ఏప్రిల్16,ప్రభాతవార్త:** ఐఐటి ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలను బుధవారం ఏయంజి పాఠశాలలోజరిగిన ప్రత్యేక సమావేశంలో ఏయంజి డైరక్టర్ డాక్టర్ అరుణకుమార్ కె మహంతి



అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయంజి పాఠశాలలో 6,7 మరియు 8 తరగతుల వారికి రెగ్యులర్ క్లాసులతోపాటు ఐఐటి క్లాసులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఐఐటి ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్‌లో ఆతరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొని మంచి ప్రతిభను కనపరిచారని అన్నారు. 6వతరగతి విభాగంలో డి పవిత్ర, ఎ సాయితేజ, జె కీర్తన, 7వ తరగతి బాలికల విభాగంలో కె లక్ష్మీదుర్గ, టి వెంకటలక్ష్మీ,ఆర్ లాస్య, టికీర్తన, డి పవిత్రపావని, సిహెచ్ శ్యామశరణ్యలు, 7వ తరగతి బాలుర విభాగంలో కె సామ్యూల్‌ప్రిన్స్, వి అమిత్‌డెన్ని, ఎల్ భాస్కరనాయక్‌లు, 8వ తరగతిలో జి భావన, బి సృజన, ఎ శశిధర్‌రాణా, జి వంశీకృష్ణలు విశేష ప్రతిభను కనపరిచారని తెలిపారు. వీరందరికి ఏయంజి డైరక్టర్ డాక్టర్ ఎకె మహంతి జ్ఞాపికలతో పాటు సర్టిఫికెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏయంజి పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు కె కృపాదానం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్ధిని, విద్యార్ధులను అభినందించారు.

# ప్రమాదాల నివారణే అగ్నిమాపకశాఖ ధ్యేయం

## -అగ్నిమాపకశాఖాధికారి కె.ప్రసాదరావు

**పొన్నూరు, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** ప్రమాదాలను నివారించి, ప్రజల ఆస్తులను, ప్రాణాలను కాపాడడమే ధ్యేయంగా అగ్నిమాపకశాఖ పనిచేస్తోం దని అగ్నిమాపకశాఖాధికారి కె.ప్రసాదరావు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా బుధవారం డివిసి కాలనీలో, మునిసిపల్ ఆఫీసు రోడ్డులోని ఆదిత్య ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్‌లోని ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ వేసవిలో




ఎక్కువ అజాగ్రత్తవల్ల కానీ, అతిజాగ్రత్త వల్ల కానీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రమాదాల నివారణకు ప్రజలు బాధ్యతగా వ్యవహరిస్తే ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చన్నారు. ప్రయోగాత్మకంగా అగ్ని ప్రమాదాలను ఏ విధంగా నిర్వహించవచ్చునో సూచించారు. ఈ కార్యక్రమంల సిబ్బంది పాల్గొన్నారు.

# ఈడి భాజపా జేబు సంస్థగా పనిచేయడం సిగ్గుచేటు

## -కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందే దిలీప్

పొన్నూరు, ఏప్రిల్ 16,ప్రభాతవార్త: ఈడి జాతీయ సంస్థగా కాకుండా బిజెపి జేబు సంస్థగా పనిచేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందే దిలీప్ అన్నారు. పసలేని నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై చార్జిషీట్ నమోదు చేయడం,ఆస్తులను జప్తుచేయడంపై ఆయన స్పందించారు.అసోసియేట్ జర్నల్స్ లిమిటెడ్ గా ప్రారంభమైన నేషనల్ హెరాల్డ్ దినపత్రిక దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో జాతి గొంతుకై నినదించిందన్నారు ఈ పత్రిక మహాత్మాగాంధీ ఆలోచనలతో జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంఓ వేలాది గొంతుకులకు వేదికైందన్నారు. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై కూడా ఈ పత్రిక ఎన్నో విమర్శనాత్మక వ్యాసాలను ప్రచురించిందన్నారు. ఎక్కడా రాజకీయ జోక్యానికి ఆస్కారం లేకుండా ఉన్న ఈ పత్రిక దేశంలో అన్ని పత్రికలు ఎదుర్కొంటున్నట్లుగా ఆర్ధికపరమైన ఇబ్బందులు ఎదుర్కోగా కాంగ్రెస్ పార్టీ యంగ్ ఇండియా సంస్థ ద్వారా 90కోట్ల రుణాన్ని సమకూర్చి ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వ బకాయిలు చెల్లిం చేందుకు సహక రించగా ఆ రుణాన్ని సెక్షన్–25ప్రకారం నాట్ ఫర్ ప్రాఫిట్ కింద ఈక్విటీగా మలిచారన్నారు. ఇందు



లో ఎక్కడా నేషనల్ హెరాల్డ్ ఆస్తులు కాంగ్రెస్‌కు బదలాయింపు జరగలేదన్నారు. స్వతహాగా తన ఉనికి కోసం పరితపించే మనస్తత్వం గల బిజెపి నేత సుబ్రహ్మణ్యస్వామి వేసిన ఈ కేసులో పసలేకున్నా కేవలం రాహుల్ గొంతు నొక్కే ప్రయత్నంలోనే అప్రజాస్వామికంగా ఈ కేసులో చార్జ్‌షీట్ ఫైల్ చేసి ఆస్తులు జప్తుకు తీర్పునిచ్చారాన్నరు. ఈ చర్యను దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాస్వామ్య కాముకులు వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టనున్నారని, బిజెపిని గద్దె దింపేందుకు ఈ రోజు నుంచే కౌంట్ డౌన్ మొదలైందన్నారు.

## డాక్టర్ బలరామకృష్ణ లివర్ గ్యాస్ట్రో సెంటర్‌లో

# 2 సంవత్సరాల బాలికకు అరుదైన చికిత్స

**చిలకలూరిపేట,ఏప్రిల్16,ప్రభాతవార్త:** పట్టణం లోని జానకీ నర్సింగ్‌హోంలోని డాక్టర్ బలరామకృష్ణ లివర్ అండ్ గ్యాస్ట్రో సెంటర్‌లో బుధవారం అరుదైన చికిత్స జరిగింది. పట్టణంలోని గుర్రాల చావిడికి చెందిన రెండు సంవత్సరాల వయసు కలిగిన బాలిక అకస్మాత్తుగా మరమేకును మింగింది. కాగా ఆ బాలిక తల్లిదండ్రులు వెంటనే ఆసుపత్రికి తీసుకునివచ్చారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ అయిన డాక్టర్ ముప్పాళ్ల బలరామకృష్ణ తేజస్వీ ఆ బాలికను ఎండోస్కోపి ద్వారా పరిశీలించి కడుపులో ఉన్న మరమేకును చాకచక్యంగా తొలగించారు. కాగా ఇలాంటి కేసులకు శస్త్ర చికిత్స చేయవలసి ఉంటుందని, అందుకే ఇలాంటి వైద్యం చేయటానికి వైద్యులు సంకోచిస్తారు. కానీ యువ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ అయిన బలరామకృష్ణ తేజస్వీ ఎంతో నైపుణ్యంతో ఆ బాలిక కడుపులో జీర్ణంకాని ఆహారం మధ్యలో ఉన్న మేకును గమనించి నిదానంగా ఎండ






ోస్కోపి ద్వారా తీసివేయడం జరిగింది. 20 నిమిషాల వ్యవధిలోనే బాలిక తలి ్లదండ్రులు ఆ పాపను ఆసుపత్రికి తీసుకురావడం, వెంటనే ఎండోస్కోపి ద్వారా గుర్తించి దానిని తీసివేయడంతో ఆ పాపకు ప్రాణగండం తప్పింది. ఇలాంటి రిస్క్ వైద్యం చేసిన డాక్టర్ తేజస్వీని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు అభినందించారు.

# నల్లబర్లి పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదట ధర్నా

**చిలకలూరిపేట,ఏప్రిల్16,ప్రభాతవార్త:** రైతులు పండించిన నల్లబర్లి పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సిపిఐ,సిపియం, కాంగ్రెస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసిల్దార్



కార్యాలయం ముందు బుధవారంధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమడ రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విదేశీ మార్కెట్‌లో నల్లబర్లి పొగాకుకు మంచి ధర ఉందని రాజకీయ నిపుణులు, శాస్త్రవేత్తలు చెపుతున్నప్పటికి మన రాష్ట్రరైతుల వద్దకు వ్యాపారస్తులు వచ్చి రూ3.4వేలకు క్వింటా పొగాకు ఇస్తారా అని బేరసారాలు ఆడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్నటువంటి కంపెనీ యాజమాన్యాలు రైతులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయని తెలిపారు ఈ ప్రాంత వాసిగా, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అసెంబ్లీసాక్షిగా పొగాకు రైతులు అన్యాయం జరుగుతుందని, పొగాకు ఎగుమ తులపై కేంద్రానికి గత సంవత్సరం షుమారు రూ 12వేల కోట్లు ఆదాయం వచ్చిందని, నల్లబర్లి పొగాకు విదేశాలలో గిరాకీ ఉందని చెప్పినా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోలేదని డాక్టర్ రాజమోహన్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంపై ప్రత్యేకంగా చొరవచూపి రైతులు పండించిన నల్లబర్లి పొగాకుకు గిట్టుబాటు ధరను కల్పించాలని వారి పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాలకు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేంతటివరకు ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక నుంచి తమ సంపూర్ణ మద్దతును అందిస్తామని అధ్యక్షుడు బి శ్రీనునాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ,సిపియం, కాంగ్రెస్, వికెసి పార్టీతో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

**నరసరావుపేట క్రైం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ తనిఖీలలో పాల్గొన్నారు. పల్నాడు రోడ్డులోని పలు హోటల్స్‌లో తనిఖీలు కొనసాగించారు. టీ స్టాల్స్‌లో వినియోగిస్తున్న విడి పాలు, టీ పొడి శాంపిల్స్‌ను సేకరించారు. ఫ్రిజ్‌లలో ఉన్న మజ్జిగ, పెరుగు ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్, బాదం పాలు ముగింపు తేదీలను తనిఖీ చేశారు. హోటల్స్‌లో పరిశుభ్రత పాటించాలన్నారు. ఫ్రిజ్‌లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలన్నారు. డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకొని టీ కప్పులను దానిలో వేయాలన్నారు. ప్రతి రోజూ గడువు ముగిసిన వస్తువులను తొలగించాలన్నారు. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణంలో తనిఖీలు జరుగుతున్నట్లు తెలియజేశారు.

# ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి : కమిషనరు

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రోడ్డు మార్జిన్‌లలో షాపులకు సంబంధించి అనధికార బోర్డులను, ఫుట్‌పాత్‌లపై, డ్రైయినేజీలపై ఆక్రమణలు చేసి వ్యాపారాలు చేసే వారు తక్షణమే వాటిని తొలగించాలన్నారు. వర్షాకాల సమయంలో ఆక్రమణల వలన మురుగునీరు నిలిచి రోడ్లపైకి వస్తుందన్నారు. ఇది పట్టణ ప్రజలకు అనారోగ్య సమస్యలను తెస్తుందన్నారు. ఈ నెల 21వతేదీలోపు ఖచ్చితంగా రోడ్డు మార్జిన్ ఫుట్‌పాత్‌లపై ఉంచిన ఆక్రమణలు స్వచ్ఛందంగా తీసి వేయాలన్నారు. లేకుంటే ఎటువంటి నోటీసులు లేకుండా ఆక్రమణలను తొలగిస్తామని కమిషనర్ జశ్వంత్‌రావు హెచ్చరించారు.

# తెలుగుజాతి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం

**గుంటూరు విద్య,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** తెలుగునాట సంస్కరణలకు ఆధ్యులు,తొలి వితంతు వివాహాన్ని జరిపించిన ధీరుడు,తొలి తెలుగు నాటక ప్రదర్శన చేసిన గొప్ప వ్యక్తి,తెలుగు సాహిత్యాన్ని వాడుక భాషలోనికి తెచ్చిన మహనీయుడు,సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జీవితం ప్రజలందరికి ఆదర్శనీయమని ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు పేర్కొన్నారు.నవీన సమాజానికి బాటలువేసిన గొప్ప సంఘ సంస్కర్త,రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా శాఖాగ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొని గేరా మోహనరావు మాట్లాడుతూ ఆనాటి



సమాజంలోని మూఢనమ్మకాలపై పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని తెలిపారు.కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గుగ్గిలం సాయిబాబు,అన్నలదాసు విజేందర్‌రావు,మేడూరి సుబా బ్రావు,వెంకటేశ్వర్లు,సునీల్, మంజుల, ఆనందరావు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసమే రాజకీయ జీవితం : ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ప్రజల కోసమే రాజకీయ జీవితం ప్రారంభించానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. స్థానిక 3వ వార్డులోని పనసతోటలో కార్యకర్తలు నిర్వహించిన సభకు నాయకులు వలిశెట్టి నరసింహారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవింద్‌బాబు కేక్ కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఆయనకు గజమాలను క్రేన్ సహాయంతో మెడలో వేశారు. కార్యకర్తలతో ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడుతూ వైద్యునిగా తనను



ఆదరించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతదూరమైనా వెళ్తానన్నారు. వారి కోసమే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు అందించండి!

**-గిరిజనశాఖ మంత్రిని కోరిన తెదేపా రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు దారునాయక్**

**విజయపురిసౌత్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** పల్నాడు ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని గిరిజన శాఖ మంత్రి



గుమ్మడి సంధ్యారాణిని తెదేపా రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు దారునాయక్ కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిసి పలు సమస్యలను ఆయన వివరించారు. వేసవి కాలం దృష్ట్యా పల్నాడులోని గిరిజన తండాల్లో తాగునీటి సమస్యపై చర్యలు చేపట్టాలని కోరారు. సుమారు 30 సంవత్సరాలుగా అటవీ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని మంత్రికి విన్నవించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చొరవతో పల్నాడు ప్రాంతంలో కారంపూడి, వినుకొండ, నరసరావుపేట ప్రాంతాల్లో 17 కోట్లతో నిర్మించిన ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రారంభోత్సవానికి విచ్చేయాలని మంత్రిని కోరారు.

## అగ్నిప్రమాదల నివారణ పద్దతులపై ప్రజలకు అవగాహన

**బాపట్ల,ఏప్రిల్16,ప్రభాతవార్త:** వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉన్న



నేపధ్యంలో అగ్నిప్రమాదల నివారణ పద్దతులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అగ్నిమాపక కేంద్రాధికారి వై వెంకటేశ్వరరావు అన్నారు.బుధవారం జాతీయ అగ్నిమాపక వారోత్స వాలలో భాగంగా మూడవ రోజు పట్టణంలోని విజయలక్ష్మీపురంలో గల భావన టవర్స్ అపార్ట్‌మెంట్ నందు అగ్నిమాపక నివారణ పద్ద తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండెర్ ను తీసుకున్నప్పుడు ఖచ్చితంగా సిలిండెర్ పైన క్యాప్ తీసి నాబ్‌లో రెండు నీటి చుక్కలు వేసి చూస్తే నీటి బుడగలు వస్తే గ్యాస్ లీక్ అవుతుందని తెలుస్తుంది అప్పుడు వెంటనే గ్యాస్ ఏజెన్సీ వారిని సంప్రదించి గ్యాస్ సిలెండర్ ను మార్చుకోవాలన్నారు.అదే విధంగా వంట గ్యాస్ పోయికు వాడే ట్యూబ్‌ను కూడా సంవత్సరానికి ఒక సారి మార్చుకోవటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు.ఎల్‌పిజి గ్యాస్,విద్యుత్ వలన జరిగే అగ్నిప్రమాదాలు గురించి ఆయన వివరించి అగ్నిప్రమాదాల నివారణ పద్దతులపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తోటల సాగుపై రైతులకు శిక్షణ

**బాపట్ల,ఏప్రిల్16,ప్రభాతవార్త:** ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు మరియు పూల పెంపకం చేసే విధానం ద్వారా ఆహార భద్రత కలుగుతుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. పి.ప్రసూనా రాణి అన్నారు.బుధవారం పట్టణ పరిసరాలలో తోటల సాగుపై వ్యవసాయ కళాశాలలో ఐ.సి.ఏ.ఆర్. ఎస్సీ సబ్ ప్లాన్ లో భాగంగా పట్టణ పరిసరాలలో జీవించే చిన్న మరియు సన్నకారు రైతుల కమతాలలో పెంచదగిన



కూరగాయలు మరియు వాటి సాగులో తీసుకోవలసిన మెళకువలు గురించి శిక్షణ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక మార్కెట్లలో వీటి ప్రాధాన్యత పెరుగుతుందని, సాగు భూమి విస్తీర్ణానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. నగర సౌందర్య మెరుగుదలకు తోడ్పడటమేకాక స్థానిక రైతుల ఆదాయ వనరులు పెరిగేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యాన విభాగాధిపతి డా. వి. శ్రీలత రైతులకు పూల తయారీ, వాటికి మార్కెట్ లో ఉన్న ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో డా.యన్.రత్నకుమారి, డా.కె.సుశీల, డా.ఎం.సురేష్ కుమార్, ఉద్యాన విభాగ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఏఎం కళాశాలలో మానవతా సంస్థ సమావేశం

**నరసరావుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఎంఏఎం విద్యాసంస్థల ఆవరణలో బుధవారం మానవతా సంస్థ నూతనశాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం జరిగింది. కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, డాక్టర్ సాయి పవన్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కళాశాల ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, విద్యార్థులకు నైతిక విలువల బోధన, నిరంతరం రక్తదాన



ఏర్పాటు, వైద్య శిబిరాలు, శాంతి ర్యాలీలు, నేత్ర దానం, అవయవదానం వంటివి నిర్వహించడం జరుగుతుందన్నారు. నరసరావుపేటలో ఈ కార్యక్రమం జరగడం సంతోషమన్నారు. కార్యక్రమంలో మానవతా ఛైర్మన్ పావులూరి రమేష్, డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, బత్తుల మురళీ, కనుమూరి రాజ్యలక్ష్మి, డాక్టర్ నెల్లూరి రమేష్, గోదా రమేష్, ప్రిన్సిపాల్స్ ఎస్.రామారావు, ఎం.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు అదాలత్

**పొన్నూరు, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ఈ నెల 17వ తేదీ ఉదయం 10.30గంటలకు దొప్పలపూడి అడ్డరోడ్డు వద్ద ఉన్న గోవాడ పంక్షన్ హాలులో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ జి.భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇతర విద్యుత్ అధికారులు హాజరవుతారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ అదాలత్‌లో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

## 27న రేపల్లెలో మాసం మాసం మానసోల్లాసం

**పొన్నూరు, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** మాసం మాసం మానసోల్లాసం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6.30గంటలకు రేపల్లె శ్రీ శృంగేరి శంకర మఠంలో పరమాత్మ లీలల్లో పరమార్ధం అనే అంశంపై ప్రవచనం జరుగుతుందని విశ్రాంత తెలుగు పండితులు ఎం.కృష్ణకిషోర్ తెలిపారు. ఈ ప్రవచనం కీసర పార్థసారథి శర్మచే నిర్వహించనున్నట్లు చెప్పారు. అధ్యాత్మిక వేత్తలు, సాహితీప్రియులు, తదితరులందరూ వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణకిషోర్ కోరారు.

## అగ్నిమాపకశాఖ వారోత్సవాలు

**నరసరావుపేట క్రైం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** అగ్నిమాపకశాఖ వారోత్సవాలను బుధవారం పట్టణంలో నిర్వహించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళా శిశు సంక్షేమశాఖ సిడిపిఓ కార్యాలయం నందు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు, పరిసర ప్రాంతాలలోని గృహిణులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. నివాస గృహాలలో జరిగే ఎల్‌పిజి గ్యాస్ అగ్ని ప్రమాదాలపై, ఎలక్ట్రిసిటి అగ్ని



ప్రమాదాలపై ముందస్తు జాగ్రత్త చర్యలను తెలియజేశారు. డెమో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఎం.వి.సుబ్బారావుతో పాటు జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.హెచ్.ఉమామహేశ్వరి, అధికారులు బి.కృష్ణారెడ్డి, డిసిపిఓ డి.శౌరిరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

**బాపట్ల,ఏప్రిల్16,ప్రభాతవార్త:** వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. బుధవారం, స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఇరిగేషన్,ఆర్. డబ్ల్యూ ఎస్ శాఖ ఏఈలు, డి ఇ లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మరియు, అన్ని మండల




ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వాటర్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ల వివరాలు మరియు వాటిలోని నీటిమట్టాల విషయమై కె డబ్ల్యూ డి మరియు ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో కె డబ్ల్యూ.డి కింద 75 వాటర్ ట్యాంకులు ఉన్నాయని అందులో 53 ట్యాంకులు 90 శాతం, 15 ట్యాంకులు 20 నుండి 50 శాతం, 7 ట్యాంకులు 25 శాతం లోపు నీళ్లు ఉన్నాయని, అదేవిధంగా 3 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఉన్నాయని, అందు బాపట్ల నందు 33 శాతం,రేపల్లె నందు 44 శాతం,చీరాల నందు 73 శాతం, నీటి నిలువలు ఉన్నాయని కృష్ణ పశ్చిమ డెల్టా ఎస్సీ వెంకట్ రత్నం కలెక్టర్ కు వివరించారు. ఎన్.ఎస్. పి కింద జిల్లాలో 40 ట్యాంకులు ఉన్నాయని, వాటిలో నీరు 45 రోజులు పాటు వస్తాయని ఆర్డబ్ల్యూఎస్ ఎస్సి అనంతరాజు జిల్లా కలెక్టర్ కు వివరించారు. బాపట్ల నందు గల సమ్మర్ స్టోరేజ్ లోని నీరు వారం రోజులు పాటు మాత్రమే అవసరాలకు సరిపోతాయని, రేపల్లెలోని సమ్మర్ స్టోరేజ్ లోని నీరు ఒక మాసం పాటు, చీరాల సమ్మర్ స్టోరేజ్ లోని నీరు 120 రోజులు పాటు అవసరాలకు సరిపోతాయని మున్సిపల్ కమిషనర్లు జిల్లా కలెక్టర్ వివరించారు. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నీరు అవసరం ఉన్నందున కృష్ణ పశ్చిమ డెల్టా నుండి నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆ నీటిని పశ్చిమ డెల్టాకు విడుదల చేసిన తర్వాత మూడు రోజులలు తరువాత బాపట్లకు వస్తాయని, పశ్చిమ డెల్టాకు 15 రోజులు పాటు నీరు విడుదల జరుగుతుందని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. నీరు బాపట్లకు చేరిన తర్వాత ఎప్పటికప్పుడు ట్యాంకులను నీటితో నింపాలన్నారు. అదేవిధంగా ఎన్ ఎస్ పి కెనాల్ నుండి నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాలువల ద్వారా నీటిని విడుదల చేసిన తర్వాత ఆ నీటిని కేవలం త్రాగునీటి అవసరాలకు మాత్రమే వాడాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. మార్గమధ్యంలో ఎవరూ కూడా నీటిని పొలాలకు వాడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ఇందుకోసం రెవెన్యూ అధికారి పరిధిలో ముగ్గురు సభ్యులతో కూడిన టీం లను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. టీమ్ లో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.వేసవిలో ఏ ప్రాంతంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకొని పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వీరలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి డి గంగాధర్ గౌడ్,బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి. గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఏఈ లు, డి ఇ లు, వీక్షణ ద్వారా రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారులు, అద్దంకి, రేపల్లె మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండల ఎంపీడీవోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

**కొల్లిపర,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** గ్రామ సర్పంచ్ బాణావత్ అరుణాబాయ్ అద్యక్షతన మండల పరిధిలోని తూములూరులో గ్రామసభ జరిగింది.గ్రామసభలో సమస్యలు ఉంటే తెలపాలని అధికారులు గ్రామస్తులను అడిగారు.తూములూరు నుండి కొత్తబొమ్మువానిపాలెం వెళ్ళే రోడ్డులో కొంత మంది వ్యక్తులు మద్యం సేవించి రోడ్డుపై మద్యం బాటిల్సు పగులకొట్టి రైతులను పలు ఇబ్బందులకు




గురి చేస్తున్నారని అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులకు వినతి పత్రం అందజేసారు.అనంతరం విద్యాకమిటీ చైర్మన్ బొమ్మ శ్రీలక్ష్మి ఇచ్చిన క్రీడా దుస్తులను అధికారులు..ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు విద్యార్థులకు అందజేసారు.కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి భార్గవ్,ఉప సర్పంచ్ ఆరుమళ్ళ శివారెడ్డి,గ్రామ పెద్దలు మర్రెడ్డి బ్రహ్మారెడ్డి,కొండా కిషోర్‌రెడ్డి,కట్టా శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి : ఎంఈవో సాల్మన్‌రాజు

**కొల్లిపర,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు.బుధవారం మండలంలోని అన్నవరపు లంక,బొమ్మువానిపాలెం ప్రాధమిక పాఠశాలను ఆయన తనిఖీ నిర్వహించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఏజెన్సీ నిర్వాహకులు ఆజాగ్రత్త వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించాలన్నారు.పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.



## ప్రజా దర్బార్‌లో పిర్యాదులను స్వీకరించిన ఎమ్మెల్యే

**పెదకూరపాడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పెదకూరపాడులో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి పలు ఫిర్యాదులను



అందుకున్నారు. అలాగే పలు సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్ళి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్తిమల్ల రమేష్, సర్పంచ్ రాజు, ముంతాజ్, లీలావతి, మద్దిరాల గంగాధర్, మోదుగుల చంద్రశేకర్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## నేడు హిందూ ఫార్మసీ కళాశాల సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం

**గుంటూరు విద్య,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ప్రారంభించి 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ 1999లో బి.పార్మసీతో ప్రారంభించిన కళాశాల ప్రస్తుతం డి.ఫార మ్రసీ,బి.ఫార్మసీ,ఎం.ఫార్మసీ,ఫార్మా డి,ఫార్మా డి (పి.బి) కోర్సులను,పరిశోదన కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.ఏప్రిల్ 17వ తేది రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిధిగా,రాష్ట్ర బిజేపి జనరల్ సెక్రటరీ నూకల మదుకర్ గౌరవాతిధులుగా పాల్గొంటారన్నారు.కళాశాల ఆవరణలో ప్రధానమంత్రి భారతీ జన ఔషధీ కేంద్రాన్ని నిర్వహంచడానికి భవన నిర్మాణానికి ముఖ్యఅతిధి శంకుస్థాపన చేయనున్నారు.కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు మాట్లాడుతూ తమ కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చినట్లు త్వరలో అటానమస్ ఫార్మసీ విద్యాసంస్థగా అభివృద్ధి చేయనున్నామని తెలియజేశారు.కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రత్యూష,ఫార్మా డి డైరెక్టర్ డాక్ టర్ పి.సీతారామయ్య పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను చెల్లించే వారికి ప్రభుత్వ రాయితీలు

**మాచర్లటౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మున్సిపల్ ఆస్తి పన్ను ఎలాంటి బకాయిలు లేకుండా చెల్లించే వారికి ప్రభుత్వం పలు రాయితీలు కల్పించినట్లు మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు బకాయి ఉన్న ఆస్తి పన్ను పూర్తిగా చెల్లిస్తే 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. 2025-26 సంవత్సరానికి చెందిన పన్ను మొత్తాన్ని ఏకమొత్తంగా చెల్లిస్తే 5శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం కన్నా కార్యాలయం నందు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రజల సమస్యలను




తెలుసుకున్నారు. అలాగే ప్రజల నుండి వచ్చిన వనతులను స్వీకరించి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలు ఎటువంటి సమస్యలతో ఇబ్బందిపడకూడదనే ఉద్దేశంతో ఈ మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు తమ సమస్యలను ప్రజా దర్బార్ కార్యక్రమంలో తెలియజేసి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.

## విత్తన దుకాణాలలో అధికారుల తనిఖీలు

**సత్తెనపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** విత్తన దుకాణాలలో బుధవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. అధికారులు ఆర్.శశిధర్‌రెడ్డి, సురేసన్, వారి సిబ్బంది విత్తన దుకాణాలను సందర్శించారు. హెచ్.టి. పత్తి విత్తనాల



నిల్వలు, అమ్మకాలకు రాష్ట్రంలో అనుమతి లేదన్నారు. చట్టరీత్యా ఇది నేరమన్నారు. విత్తన డీలర్ల దగ్గర ఎటువంటి పత్తి నిల్వలు ఉన్నాయో పరిశీలించారు. విత్తన కొనుగోళ్ళకు సంబంధించి రశీదులు ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలలో మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి విత్తన డీలర్లకు సూచనలు చేశారు.

## మెమెంటోస్ బహూకరణ

మాచర్లటౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వారు మాచర్ల తిరునాళ్ల సందర్భంగా చెన్నకేశవ స్వామి వారి మెమెంటోలను ఆలయ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్



హనుమంతరావు, యాజమాన్యం రామకృష్ణ, శ్రీధర్‌గుప్తా, డాక్టర్ సదాశివరాజు, హరీష్ చంద్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మాయాబజార్‌కు మంచి రోజులు

**- రూ.50 లక్షల తో సిసి రోడ్, సీసీ డ్రైన్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాప..**

**-వ్యాపారులకు ఇబ్బంది లేకుండా పనులు చేపడతామని వెల్లడి**

**గుంటూరుతూర్పు,ఏప్రిల్16,ప్రభాతవార్త :** గత 15 ఏళ్లుగా తట్టమట్టి కూడా పడని మాయాబజార్ సెంటర్ కు మంచి



రోజులు తీసుకొస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. గుంటూరు లోని మాయాబజార్ నుంచి ఓల్డ్ క్లబ్ రోడ్డు వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాయాబజార్ లోని వ్యాపారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యాపారాలకు, ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామని, దీనికి సహకరించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా మాయాబజార్ సెంటర్ ను ఇదే విధంగా చూస్తున్నామని, కానీ ఇప్పటి వరకు పట్టించుకున్న నాథుడు లేడని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మాయాబజార్ సెంటర్ రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకున్నానని తెలిపారు. ఇందులో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి మేయర్ సజీలా, కార్పొరేటర్ చిష్టి, షౌకత్, కొనకళ్ళ సత్యం, కుదుస్, పద్మావతి, విజయ్, మాయాబజార్ లోని వ్యాపారస్తులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్టు

**గుంటూరుతూర్పు,ఏప్రిల్16,ప్రభాతవార్త :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆయన కుమారుడి మార్క్ శంకర్ లపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్ చూసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్



హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిందితుడు అరెస్టుకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూఈనెల 9 వ తేదీన ప్రతిపాడు గ్రామానికి చెందిన మెరికనపల్లి సాంబశివరావు అనే వ్యక్తి తన ట్విట్టర్ ఖాతాను పరిశీలిస్తూ ఉండగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ఆయన కుమారుడు మార్క్ శంకర్ కు సంబంధించి వారిద్దరూ కలసి ఉన్న ఫోటోను ఒక వ్యక్తి తన ట్విట్టర్ ఖాతా నందు వ్యక్తిగత దూషణలకు పాల్పడే విధంగా అసభ్యకరమైన వ్యాఖ్యలను జోడించి పోస్టు చేయడం చూసి, వెంటనే ప్రతిపాడు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన ప్రతిపాడు సీఐ జి శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్ర ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.ఈ దర్యాప్తులో కర్నూలు జిల్లా గూడూరు మండలానికి చెందిన పుట్టపాశం.రఘు, అనే యువకుడు ఈ పోస్ట్ పెట్టడం జరిగిందని సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి విచారించగా, అతనిని పుష్పరాజ్ అని కూడా పిలుస్తారని, ఇతను ఇంటర్మీడియట్ వరకు చదువుకొని, మొబైల్స్ సేల్స్ సర్వీస్ షాప్ నందు సెల్ ఫోన్ టెక్నీషియన్ గా పనిచేస్తూ ఉంటాడని, అతను అల్లు అర్జున్ అభిమానిగా ఉంటూ 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అల్లు అర్జున్ తన స్నేహితుడు నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయుచున్న సందర్భంగా అతనికి మద్దతుగా నంద్యాలకు వచ్చి మద్దతు తెలిపాడు. మెగా అభిమానులు, కొంతమంది జనసేన పార్టీకి చెందిన అభిమానులు అల్లు అర్జున్ ని రకరకాలుగా సోషల్ మీడియాలో విమర్శిస్తుండగా, దానికి కారణం మెగా కుటుంబంలోని కొంతమంది వ్యక్తులనీ భావించి, నేను మెగా కుటుంబపై ద్వేషం పెంచుకొని నా మొబైల్లో వివిధ రకాల జిమెయిల్ తో లాగిన్ అయ్యి అల్లు అర్జున్ కు సపోర్ట్ గా నా యొక్క ట్విట్టర్ ద్వారా సోషల్ మీడియా నందు మా యొక్క ఆక్రోసాన్ని వెళ్లగక్కుతూ అసభ్య పద్యాలతో పోస్టులు పెడుతూ ఉంటానని గుర్తించారు. ఈ క్రమంలో ది.08.04.2025 తేదీన పవన్ కళ్యాణ్ చిన్న కొడుకు అయినా మార్క్ శంకర్ సింగపూర్ నందు స్కూల్లో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదం జరిగిందని సోషల్ మీడియాలో రావడంతో దానిని నేను అవకాశంగా తీసుకొని మెగా కుటుంబంపై నా యొక్క ద్వేషాన్ని తెలియజేస్తూ, నా యొక్క ట్విట్టర్ ఖాతాలో పవన్ కళ్యాణ్, అతని కొడుకు మార్క్ శంకరతో ఉన్న ఫోటోని డౌన్లోడ్ చేసుకొని ఆ ఫోటోని అసభ్యకరమైన వ్యాఖ్యను క్యాప్షన్ గా పెట్టి నా యొక్క ట్విట్టర్ ఖాతా నందు పోస్ట్ చేయడం జరిగినదని విచారణలో తెలపడం జరిగినది. మంగళవారం? (15.04.2025) కర్నూలు జిల్లా గూడూరు గ్రామంలో అరెస్ట్ చేశారు.సామాజిక మాధ్యమాలను ఉపయోగించేవారు స్వీయ నియంతృత్వం కలిగి ఉండాలని, సామాజిక మాధ్యమాలను మంచి పనుల కోసం ఉపయోగించాలే తప్ప ఇతరులను నిందించడానికి, దూషించడానికి, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టడానికి ఉపయోగించరాదని, ఆ విధంగా చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరచిన ప్రతిపాడు రూరల్ సర్కిల్ సీఐ శ్రీనివాస్ రావు, ఎస్ఐ నాగేంద్, సిబ్బందిని, కేసు దర్యాప్తును పరిశీలిస్తూ వారికి దిశా నిర్దేశం చేసిన సౌత్ డిఎస్పి భానోదయ ని ఎస్పీ అభినందించారు.

## మాత శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి : బాపట్ల జిల్లా కలెక్టరు

**బాపట్ల,ఏప్రిల్16,ప్రభాతవార్త:** మాత శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి దర్శకులు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గత సంవత్సరం ఆగస్టు మాసంలో సంభవించిన



2 ప్రసవ మరణాలపై జిల్లా కలెక్టర్ మాత శిశు మరణాల కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. తొలుత నిజాంపట్నం గ్రామానికి చెందిన మానికల లక్ష్మీ, చీరాల ఏరియా ఆసుపత్రిలో ప్రసవించబడి, అత్యవసర పరిస్థితుల్లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని డాక్టర్లు జిల్లా కలెక్టర్ కు వివరించారు. 2024ఆగస్టు31న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినందున కేసుకు సంబంధించి జిల్లా కలెక్టర్ సంబంధిత వైద్యం అందించిన దాక్టర్లను ఆరా తీశారు. ఆమెకు సంబంధించిన మాతా శిశు సంరక్షణ కార్డు ను ఆయన తనిఖీ చేశారు. లక్ష్మీకి అందించిన వైద్యము, ఇంజక్షన్లు, వ్యాక్సిన్ ల పై ఆయన ఆరా తీశారు. అంగన్వాడీల ద్వారా అందించిన ఆహారముపై ఆయన ఆరా తీశారు. లక్ష్మీ కి సంబంధించిన మాతా శిశు సంరక్షణ కార్డులో ఆమెది తొమ్మిదవ ప్రసవం అని, ఆ కేసు ఎక్కువ రిస్క్ తో కూడుకున్నదని నమోదు చేయడాన్ని, సంబంధిత వివరాలను దాక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీకి వైద్యం అందించుటలో తీసుకున్న చర్యలపై ఆయన అసహనం వ్యక్తపరిచారు. ఈ మరణానికి సంబంధించి వైద్యం అందించిన దాక్టర్ మరియు ఇతర సిబ్బంది పై తగు చర్యలను తీసుకోవాలని అందుకు సంబంధించి నివేదిక తయారు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కారుమూరి ఆషా అనే మహిళ మరణం పై జిల్లా కలెక్టర్ దాక్టర్ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆషా రేపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో 2024ఆగస్టు11న ఆసుపత్రి నందు డెలివరీ అయి డిశ్చార్జి అయినదని, తదుపరి ఆగస్టు19వ తేదీనన దయేరియా వ్యాధితో ఆసుపత్రిలో చేరి 20వతేదీన మరణించారని ఇది ప్రెగ్నెన్సీ మరణం కాదని రేపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్ దాక్టర్లు జిల్లా కలెక్టర్ కి వివరించారు. మహిళలు ప్రెగ్నెన్సీ వచ్చిన తర్వాత డెలివరీ అయ్యే వరకు దాక్టర్లు వాళ్ళని పర్యవేక్షిస్తూ, సకాలంలో వైద్యం అందిస్తూ మాతా శిశు మరణాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, దాక్టర్ రామకృష్ణ, వైద్యం అందించిన దాక్టర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు, పబ్లిక్ హెల్త్ నర్సులు, హెల్త్ ప్రోగ్రామర్, ఏఎన్ఎంలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యలంక సముద్ర తీరం వద్ద భద్రత ఏర్పాట్లను ఆకస్మిక తనిఖీ చేసిన బాపట్లజిల్లా ఎస్పీ

**బాపట్ల,ఏప్రిల్16,ప్రభాతవార్త:** వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని యాత్రికుల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని



సముద్ర తీరంలో నిఘా కోసం, యాత్రికుల భద్రత నిమిత్తం డ్రోన్ లను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు. బుధవారం సూర్యలంక సముద్ర తీరంలోని భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రోన్ ఎగురవేసి సూర్యలంక సముద్ర తీర పరిసరాలను పరిశీలించారు. విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి, గజ ఈతగాళ్లకు విధి నిర్వహణలో పాటించవలసిన మెళకువలను తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో నిర్దిష్ట లోతు దాటి లోపలికి వెళ్లకుండా యాత్రికులను అప్రమత్తం చేస్తూ జెండాలు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. యాత్రికులు బీచ్ పరిసరాల్లో వ్యవహరించవలసిన తీరును గురించి వివరిస్తూ సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావున ఎక్కువ సంఖ్యలో యాత్రికులు సూర్యలంక సముద్రతీరానికి విహారయాత్రలకు వస్తుంటారన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని సముద్రంలో లోతుకు వెళ్తున్న యాత్రికులను అడ్రెస్సింగ్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉండాలన్నారు. గజఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్ లను ధరించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా యాత్రికులు అనుకోకుండా ప్రమాదానికి గురైతే వేగంగా స్పందించి సముద్రంలోకి వెళ్లి వారిని రక్షించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో యాత్రికులను మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సూర్యలంక బీచ్ పరిసరాలలోని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకుండా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్ గస్తీ ముమ్మరం చేయాలన్నారు. మహిళా యాత్రికులు దుస్తులు మార్చుకొనుటకు తాత్కాలిక గదులను ఏర్పాటు చేయించాలన్నారు. వాటి వద్ద మహిళ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. సముద్ర తీరానికి విహారానికి వచ్చే యాత్రికులు పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి ఎవరు సముద్రంలో మునగరాదన్నారు. తోటి యాత్రికులకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరించినా, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీస్ శాఖ తీసుకునే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పోలీస్ శాఖ సూచించే సూచనలు హెచ్చరికలు యాత్రికుల యొక్క శ్రేయస్సును ఉద్దేశించి చేసేవేనని తెలిపారు. వాటిని పాటిస్తూ విహారయాత్రను ఆహ్లాదకరంగా ముగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## రైతులను చైతన్యపరచి నీటి తీరువా చెల్లింపులు వసూలు చేయాలి

**బాపట్ల,ఏప్రిల్16,ప్రభాతవార్త:** నీటి తీరువా చెల్లింపులతో కలిగే బహుళ ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. రెవెన్యూ అంశాలపై ఆర్ డి ఒ లు, తాహసిల్దార్లతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను చైతన్యపరచి నీటి తీరువా వసూలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో 3.30 లక్షల మంది రైతులు నీటి తీరువా పరిధిలోకి వస్తున్నారని చెప్పారు. వీరి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, గత బకాయిలతో కలిపి నీటి తీరువా రూ.15.46 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రూ.2.26 కోట్లు మాత్రమే వసూలు చేయడమేమిటని అధికారులను ప్రశ్నించారు. ఆర్ డి ఒ లు, తహసిల్దార్ ల పర్యవేక్షణ లోపంతోనే వసూలు జరగడం లేదన్నారు. నీటి తీరువాపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతిరోజు తహసిల్దార్లతో ఆర్డీవోలు సమీక్షించాలన్నారు. రైతుల నుంచి రెవెన్యూ అధికారులు వసూలు చేసే నీటి తీరువాను కడా కు పంపాల్సి ఉందన్నారు. అలా పంపిన సొమ్మునే తిరిగి పంట కాల్వల అభివృద్ధి, మరమ్మతులు, పూడిక తీత పనులకే ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. రైతుల సంక్షేమం కొరకే ఆ నిధులను వినియోగిస్తారనే విషయంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రైతులను చైతన్యపరచి నీటి తీరువా వసూలు చేయాలన్నారు. 180 గ్రామాల రైతుల వివరాలు వీఆర్వో లాగిన్ నుంచి ఆన్ లైన్ లో నిక్షిప్తం చేయకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఉపతహసిల్దార్ లాగిన్ నుంచి మరో 68 గ్రామాల రైతుల వివరాలు ఆన్ లైన్ లో నిక్షిప్తం చేయాలన్నారు. బాపట్ల, వేమూరు, అమృతలూరు, భట్టిప్రోలు, రేపల్లె, నగరం, చీరాల, పర్చూరు, కారంచేడు, చిన్నగంజాం మండలాలలో తీరువాక వసూలు చాలా తక్కువగా ఉందన్నారు. నివాస భూమి లేని పేదలందరికీ ఇంటి స్థలం పంపిణీకి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కలెక్టర్ చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని ఆయన ఆదేశించారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమం కింద గుర్తించిన దరఖాస్తులను పునఃపరిశీలన చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మీ, తహసిల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.



## వైకాపా పాలనలో రాష్ట్ర వృద్ధిరేటు పాతాళానికి చేరింది: యాగంటి


మాచర్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: వైకాపా పాలనలో రాష్ట్ర వృద్ధిరేటు దారుణంగా పాతాళానికి తొక్కిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని తెదేపా సీనియర్ నాయకులు, మాచర్ల మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు



అన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో యాగంటి మాట్లాడుతూ 2014–19 మధ్య ఆశాజనకంగా వృద్ధిరేటును తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని దేశంలోనే ఉన్నతస్థానంలో నిలబెట్టారు. 2019లో పగ్గాలు చేపట్టిన జగన్ వృద్ధిరేటును దారుణంగా దెబ్బతీశారు. 2014–19 మధ్య రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధిరేటు 13.5 శాతం ఉంటే జగన్‌రెడ్డి అసమర్థ, అరాచక పాలన వల్ల వృద్ధిరేటు 10.32 శాతానికి పడిపోయిందన్నారు. అమరావతిని భ్రష్టు పట్టించి, పోలవరాన్ని మూలనపడేలా చేశారన్నారు. దేశంలోనే అప్పులభారం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో నిలబెట్టిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా కుదేలైందన్నారు. గత ప్రభుత్వంలో దేశంలోనే అట్టడుగు స్థాయిలో ఉన్న వృద్ధిరేటు ప్రస్తుతం ఆశాజనకంగా రెండో స్థానానికి చేరడం చంద్రబాబు పనితీరుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి పనులు చేస్తూనే మరోవైపు ఆదాయ వనరులు పెంపువైపు అడుగులు వేస్తోంది. సంపద సృష్టించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. దేశంలోనే ఆదర్శవంతమైన రాజధాని రూపకల్పనకు చంద్రబాబు లక్ష కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు. వచ్చే నెలలో ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రాజధానిలో అత్యాధునిక హంగులతో రైల్వేస్టేషన్, విమానాశ్రయం అందుబాటులోకి రానున్నాయి. ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు 2047 లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. 15శాతం వృద్ధిరేటుతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి ఏపీ కూటమి ప్రభుత్వ ఎంపీలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో తమవైన పాత్ర పోషిస్తున్నారు. 75 సంవత్సరాల విజయవంతంగా నిరంతరంగా చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రాజధాని పనులు తిరిగి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో సరికొత్త అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశంలో తిక్కా కొండలు, దుర్భాకుల ప్రసాద్, బ్రహ్మం, గాజుల అంజి, మస్తాన్, బొట్టు కోటేశ్వరరావు, శివ పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 లు విరాళం

**నరసరావుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నూతన నిర్మాణానికి భక్తులు భారీ విరాళం అందజేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి నలబోతు మాధవిదేవి బుధవారం తెలియజేశారు. చిలకలూరిపేటకు చెందిన తోట ముసలినాయుడు జ్ఞాపకార్థం వారి కుమారుడు రవికుమార్ – సునీత దంపతులు ఆలయ నిర్మాణానికి రూ.1,01,116లను విరాళంగా అందించారని తెలిపారు. అమ్మవారి ఆలయానికి అందించే



విరాళాలకు సంబంధించి ఆదాయపుపన్ను మినహాయింపు ఉంటుందని ఈ సందర్భంగా ఈవో మాధవిదేవి తెలియజేశారు. కార్యక్రమంలో దాతలకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## భాజపా ప్రజావ్యతిరేకం : కాంగ్రెస్ నాయకులు

**సత్తెనపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** బిజెపి పాలన, పార్టీ ప్రజా వ్యతిరేకమని కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్త చుక్కా చంద్రపాల్ అన్నారు. మోడీ ప్రభుత్వం అధికారారాన్ని అడ్డం పెట్టుకొని నేషనల్ హెరాల్డ్ కేసులో పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై అక్రమంగా ఛార్జిషీట్ దాఖలు చేశారన్నారు. ఇదంతా రాజకీయ కుట్ర అన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ పత్రికా నిర్వహణ భారమై మూసివేసే సందర్భంలో తమ నాయకులు తీసుకోవడం జరిగిందన్నారు. మెజార్టీ షేర్ హోల్డర్స్ అంగీకారంతోనే యంగ్ ఇండియా కు షేర్స్ బదిలీ జరిగిందన్నారు.



కాంగ్రెస్‌పార్టీని రాజకీయంగా అణచివేసేందుకు బిజెపి కుట్రలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్యాన్‌రాజ్‌పాల్, చుక్కా చంద్రపాల్, శంకర్, ఆనంద్, శేఖర్, మోహన్‌రావు పాల్గొన్నారు.

## ఏకో ఓవర్సీస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏకో ఓవర్సీస్‌ను బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలో ఇటువంటి కార్యాలయం అందుబాటులోకి రావడం సంతోషమన్నారు. యుఎస్ఏ, యుకే, ఆస్ట్రేలియా, కెనడా, హైర్లాండ్ వంటి దేశాలలో ఉన్నత చదువులను అభ్యసించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించే కార్యాలయం నిర్వాహకులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు. నియోజకవర్గంలోని యువతీ యువకులు ఉన్నత చదువుల కోసం వీరి సేవలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మండలంలోని వెన్నాదేవి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జెట్టి వారి వివాహ వేడుకలలో పాల్గొన్నారు. ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు గ్రామ పార్టీ నాయకులు ఈ సందర్భంగా స్వాగతం పలికారు. గ్రామంలో పార్టీ నాయకులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. ఎమ్మెల్యే కన్నా వెంట వివిధ హోదాలలో ఉన్న జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రవీణ్

**పెదకూరపాడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** కాటూరి హాస్పటల్ ఆధ్వర్యంలో పెదకూరపాడులో



బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించేందుకు నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులను అందించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కొరకు ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు జరుగుతున్నాయని, వినియోగించుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలియజేశారు.

## హత్య కేసులో నిందితుని అరెస్టు

అమరావతి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : హత్య కేసులో నిందితుడైన గోళ్ళ జాలయ్యను అమరావతి పోలీసులు అరెస్ట్ చేశారు. జిడుగు



గ్రామానికి చెందిన జాలయ్య మృతుడు కొనసాని కోటేశ్వరావును హత్య చేయడం జరిగిందన్నారు. ఈ నెల 12వ తేదీన కూల్‌డ్రింక్ షాపు వద్ద నిందితునికి, మృతునికి అప్పు విషయమై మాటా మాటా పెరిగి ఐరన్ కుర్చీ, ఇటుక రాయితో తలపై కొట్టి చంపడం జరిగిందన్నారు. మృతుని తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశామని సి.ఐ. అచ్చయ్య తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఎస్.ఐ. రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ గణేష్ పాల్గొన్నారు.

## మాచర్ల శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి సేవలో భట్రాజులు

**మాచర్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** పల్నాటి ప్రజల ఆరాధ్యదైవం, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి సేవలో తరతరాలుగా భట్రాజులు స్వామివారిని కీర్తిస్తూ ప్రతి సంవత్సరం తిరునాళ్ల సమయంలో వాహన సేవలో పాల్గొంటారు. వీరు ఉపయోగించే వాటిని



దుడ్డు అంటారు. దుడ్లు అనగా స్వామివారి శంఖు చక్రాలకు ప్రతీతి. ఈ ఆచారాన్ని నాటి తరం నుంచి నేటి వరకు వరకు భట్రాజుల వంశీయులు ఈ సేవను చేస్తున్నారు. స్వామివారి గ్రామోత్సవ సమయంలో తప్పనిసరిగా సేవలో పాల్గొంటారు.

## కట్టుపల్లి విల్సన్ బాబుకు గిన్నిస్ బుక్‌లో పేరు నమోదు

**కర్లపాలెం,ఏప్రిల్16,ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం లోని దుండివారిపాలెం పంచాయతీ లోని బిడారుదిబ్బ గ్రామానికి చెందిన కట్టుపల్లి విల్సన్ బాబు, ప్రత్యూష దంపతుల పెద్ద కుమారుడు కట్టుపల్లి జోయెల్ విల్సన్ సంగీతంలో వరల్డ్ రికార్డుతో పాటు గిన్నిస్ బుక్ పేరు నమోదు చేసుకున్నాడు. గత 6 నెలల వ్యవధి కాలంలో అగస్టీన్ దండంగి




సారథ్యంలో సంగీతం కీ బోర్డ్ లో మెలకువలు నేర్చుకున్నాడు. ఒకే సారి ప్రపంచంలో 18 దేశాల నుండి 1046 మంది సంగీత విద్వాంసులు ఒకేసారి మ్యూజిక్ ప్లే చేసి గిన్నిస్ లో పేరు లిఖిం చుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి కట్టుపల్లి జోయెల్ విల్సన్ పలువురి ప్రశంసలు పొందుతున్నాడు

## రీ సర్వేలో పాల్గొన్న అధికారులు

**సత్తెనపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మండలంలోని గుడిపూడి గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమంలో బుధవారం అధికారులు పాల్గొన్నారు. తహశీల్దార్ చక్రవర్తి భూమిపూజ చేసి ర్యాలీని ప్రారంభించారు. బ్రిటీష్ కాలంలో చేపట్టిన సర్వే ఇప్పటికీ అమల్లో ఉందన్నారు. 115 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేస్తుందన్నారు. భూ వివాదాల ప్రక్షాళనకు రీ సర్వే జరుగుతుందన్నారు. భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్, బోసుబాబు, మండల సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.




## పలు పనుల నిర్వహణకు టెండర్లు

**పొన్నూరు, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** శ్రీ సా క్షి భావనారాయణస్వామి వారి తిరునాళ్ళ సందర్భంగా జరిగే పలు పనులకు టెండర్లు పిలుస్తున్నట్లు దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయానికి, ప్రహరీ గోడలకు రంగులు, సున్నము వేసేందుకు, ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేసేందుకు, పూలు, పూలదండలు సప్లయి చేసేందుకు, పందిళ్ళు వేయుట, గ్రామోత్సవములు జరిపించు పనులు చేసేందుకు, వంట పాత్రలు, షామియానాలు బాడుగకు సప్లయి చేసేందుకు, బొంగులు, బాదులు బాడుగపై సప్లయి చేసేందుకు, మైక్, స్టీరియో సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు, పనివార్లకు బ్రాహ్మణ సమారాధను భోజనములు ఏర్పాటు చేసేందుకు, దేవస్థానము నందు ఎగ్జిబిషన్ నడుపుకొనుటకు గాను సంబంధిత పనులలో అనుభవం గల వారి నుండి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు చెప్పారు. ఆసక్తిగలిగినవారు ఈ నెల 21వ తేదీ ఉదయం 11.30గంటలకులోపు సీల్డ్ టెండర్లు దేవాలయ కార్యాలయంలో దాఖలు చేయాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం 12.30గంటలకు సీల్డు టెండర్లు తెరవబడునని చెప్పారు. పూర్తి వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి కోరారు.

## పాడుతా తీయగా అవార్డు గ్రహీతలకు గాంధి కళాపురస్కార్ అవార్డులు అందజేత

చిలకలూరిపేట,ఏప్రిల్16,ప్రభాతవార్త: పట్టణం లోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్ సెంటర్‌లో ఒక ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన ఈటివి








పాడుతా తీయగా అవార్డు గ్రహీతలైన గాన సరస్వతి సాయివేద వాగ్దేవి, రిషిల్,ధీరజ్, సహస్రలకు చిలకలూరిపేటకు చెందిన గాంధీక్లబ్ చైర్మన్ ఘంటసాల బంగారుగుప్తా గాంధి కళాపురస్కార్ అవార్డులను అందచేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నమూరి రమేష్, మల్లిఖార్జునరావు, గాయకుల తల్లిదండ్రులు, గాంధీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుపేద రోగులకు అన్నదానం


**సత్తెనపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ పథకంలో భాగంగా 37వ



సారి బుధవారం నిరుపేద రోగులకు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో మండలంలోని కొమెరపూడి గ్రామానికి చెందిన దివ్వెల శేషగిరిరావు – శేషారత్నంల నుమరాలు దివ్వెల గోపీనాథ్ – ఉమా చిన్న కుమార్తె దివ్వెల గోపి జన్మదినం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మొత్తం 120 మందికి అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సుజాత, డాక్టర్ అనూష, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్ నర్సులు, పెద్దలు పగడాల సాంబశివరావు, పులిపాటి శ్రీరామమూర్తి, సూరే రామకోటేశ్వరరావు, తడవర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఎన్ బిఎస్సీ నర్సింగ్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే

**నరసరావుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఎస్ఎస్ఎన్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి, స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ కళాశాలలో నూతనంగా అడ్మిషన్లు అందుకున్న విద్యార్థులకు ఆశీస్సులను అందించారు. స్థెతస్కోప్‌లను వారికి అందించారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకోవాలన్నారు. కళాశాలలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా అధ్యాపకులకు, తమకు తెలియజేయాలన్నారు. చదువుకునే సమయంలో చేసే శ్రమ భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. ఉజ్వల భవిష్యత్తు నర్సింగ్, ఫిజియోథెరపిలలో ఉంటుందని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాససాయి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎం.రేణుకాదేవి, బి.నీల్‌పీటర్, ధనలక్ష్మి, ఏవిఎన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ జేఏసీ డైరీ ఆవిష్కరణ

**మాచర్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మాచర్ల పట్టణ, రూరల్ కార్యాలయాల్లో ఎంప్లాయిస్ జేఏసీ డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు హౌసింగ్ ఏఈ సాతులూరి మరియదాసు, వర్క్ ఇన్‌స్పెక్టర్ టి.అలీ, కిన్నెర తేజ, ఎం.మహేంద్రకుమార్, డి.ఎలీసమ్మ తదితరులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**సత్తెనపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** వంటింట్లో గ్యాస్ సిలెండర్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై అపార్ట్‌మెంట్ వాసులకు ఫైర్ సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని విజయదుర్గ అపార్ట్‌మెంట్‌లోని మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గ్యాస్ ఫైర్



అయినప్పుడు తీసుకోవాల్సి న జాగ్రత్తలను అగ్నిమాపక కేంద్రం అధికారి ఎం.వి.సుబ్బారావు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఎస్కే గౌస్, డ్రైవర్ ఆపరేటర్ డి.విజయభాస్కర్‌రెడ్డి, ఫైర్ మాన్లు వై.మహేంద్రరెడ్డి, ఎం.రమణ నాయక్, పి.గోవిందు, బి.నాగేశ్వరరావు, ఎస్.కె.సుభాని పాల్గొన్నారు.

## అవగాహనలో చార్లీ చాప్లిన్ జయంతి

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** ఒక అర్ధ శతాబ్దానికి పైగా దేశ దేశాల వారిని వయోబేధం లేకుండా మత,వర్గబేధం లేకుండా నవి ్వంచిన చార్లీ చాప్లిన్ హాస్యాన్నిమించిన ఒక పరమార్థాన్ని,సార్వజనీనతను తన చిత్రాల ద్వారా సాధించాడన్నారు.అవగాహన సంస్థ కార్యాలయంలో హాస్యవల్లరి బృందసభ్యుల ఆధ్వర్యంలో చార్లీ చాప్లిన్ జయంతి సందర్భంగా చాప్లిన్ సినిమాలు–మానవతావాదం అన్న అంశంపై పాల్గొన్న వారు చర్చించారు. ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణుడు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ చార్లీ చాప్లీన్ ఒక మేధాయుతమైన దృశ్యమాధ్యమని,అతను విభిన్నమైన కళాకారుడని అనేక కళల్లో నిష్ణాతుడైన ఒక ప్రసిద్ధ బహురూపి అన్నారు.హ్యూమర్ క్లబ్ కన్వీనర్ ఆర్.వేంకటేశ్వర్లు మాట్లాడుతూ చార్లీ చాప్లిన్ తీసిన వివిధ చిత్రాల్లో కొన్ని వందల హాస్య సన్నివేశాలను,హాస్యహావభావాలను ముఖకవళికలను భంగిమలను సృష్టించాడన్నారు. కార్యక్రమంలో మెజీషియన్ ఆర్.ఎల్.ప్రసాద్,హాస్యప్రియులు వివిరావ్‌లు ప్రసంగించారు.

17-4Pg5.qxd:17-4Pg5.qxd 01/01/01 7:44 AM Page 1



# 4 నెలల్లో 85 వేల వీసాలు జారీచేసిన చైనా!



## భారత్‌పట్ల అంతకంతకూ పెరుగుతున్న బంధం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** అమెరికాతో వాణిజ్య యుద్ధం చేస్తున్న చైనా, ఇప్పుడు అనివార్యంగా భారతదేశానికి తన స్నేహ హస్తం చాస్తోంది. ఇప్పటికే ట్రంప్ చైనా ఉత్పత్తులపై సుంకాలను 245శాతానికి పెంచేసారు. అయినా కూడా చైనా వెనకడుగు వేయడంలేదు. సరికదా తనకు పొరుగునే ఉన్న భారత్‌తో కలిసి పనిచేసేందుకు తహతహలాడుతోంది. ఇందుకు సూచనగా భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం, ఈ ఏడాది జనవరి 1 నుంచి ఏప్రిల్ 9 మధ్య భారతీయ పౌరులకు 85,000 కంటే ఎక్కువ వీసాలను జారీ చేసింది. ఇరుదేశాల ప్రజల మధ్య ఉన్న సంబంధాలను మరింత పెంపొందించడానికి చైనా చేస్తున్న ప్రయత్నంగా దీనిని చెప్పుకోవచ్చు.గతంలో ఎన్నడూ లేని విధంగా చైనా ఇప్పుడు భారతీయులకు అధికంగా వీసాలు ఇస్తోంది. చైనా 2023 సంవత్సరం మొత్తానికి 1,80,000 ఇస్తే, ఈ ఏడాది మొదటి 4 నెలల్లోనే 85,000కు పైగా వీసాలు జారీ చేసింది. దీనికి ప్రధాన కారణం, గతేడాది చైనా వీసా దరఖాస్తు విధానాన్ని మార్చింది. అనేక సడలింపులు కూడా ఇచ్చింది.

ఈ నయా వీసా నిబంధనల ప్రకారం, భారతీయ దరఖాస్తుదారు ఇకపై చైనా వీసా కోసం దరఖాస్తు సమర్పించే ముందు ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదు. నేరుగా వీసా కేంద్రాల్లోనే ఆ పని పూర్తి చేయవచ్చు. 180 రోజుల కంటే తక్కువ కాలం చైనాలో బస చేయడానికి వీసా కావాలన్నా, స్వల్పకాలిక, సింగిల్, డబుల్ ఎంట్రీ వీసాలు కావాలన్నా గతంలో వేలిముద్రలు, బయోమెట్రిక్ డేటాను అందించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ అవసరంలేదు. అంతేకాదు చైనా రాయబార కార్యాలయం వీసా దరఖాస్తు రుసుములను కూడా తగ్గించింది. అమెరికా అధ్యక్షుడు పలు దేశాలపై ప్రతీకార సుంకాలు విధించి వాణిజ్య యుద్ధం ప్రారంభించారు. దీనితో ప్రపంచ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. దీనితో కాస్త వెనక్కు తగ్గిన ట్రంప్, చైనా మినహా మిగతా దేశాలకు 90రోజులపాటు టారిఫ్‌రిలీఫ్ ఇచ్చారు. కానీ చైనాపై సుంకాల మోతమోగించారు. ఏకంగా 245శాతానికి సుంకాలు పెంచారు. దీనితో అమెరికాపై 125 శాతం మేర సుంకాలు విధించి చైనా ప్రతీకారం తీర్చుకుంది. దీనితో ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థికశక్తుల మధ్య వాణిజ్యయుద్ధం తారస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలోనే అమెరికాతో జరుగుతున్న వాణిజ్య యుద్ధంలో,తమకు మద్దతుగానిలవాలని భారత్, సహాపలుదేశాలను చైనాకోరింది. భారత్‌లోని చైనా రాయబారకార్యాలయ ప్రతినిధి యు జింగ్ గతవారం మాట్లాడుతూ, చైనా,భారత్ ఆర్థిక, వాణిజ్య సంబంధం పరస్పర ప్రయోజనంపై ఆధారపడి ఉంటుంది. అందుకే రెండు అతిపెద్ద అభివృద్ధి చెందుతున్న దేశాలుగా ఇండియా, చైనాలు ఐక్యంగాఉండి, అమెరికా వాణిజ్య యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు.



## సిఇసి, ఇసిల నియామకంపై
# మే 14న విచారణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** సిఇసి, ఇసిల నియామక చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు తేదీని నిర్ణయించింది. అన్ని పిటిషన్లపై మే 14న విచారించనున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ఓ పిటిషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. ఈవిషయంలో త్వరగా విచారణ జరపాలని సర్వోన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వచ్చే నెలలో విచారణకు తేదీని నిర్ణయించింది. భూసేకరణతో పాటు అనేక ఇతర కీలకమైన కేసులను ఈ రోజు ధర్మాసనం విచారిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. అయితే, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ 2023లో కేంద్రం చట్టాన్ని తీసుకువచ్చింది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది. అయితే, కమిటీ నుంచి సుప్రీంకోర్టు సిజెఐని తొలగించి కేంద్ర న్యాయశాఖ మంత్రికి చోటు కల్పించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్జీవో అయిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తరపున ప్రశాంత్ భూషణ్ సుప్రీం కోర్టులో హాజరయ్యారు. ఎన్నికల కమిషనర్లను ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన స్వతంత్ర కమిటీ నియమించాలని ఆయన గతంలో కోర్టును కోరారు. అలాకాకుండా ప్రభుత్వమే నియమిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సుప్రీంకోర్టు 2023లో ఇచ్చిన తీర్పు హెచ్చరించిందని.. కానీ, ఆ కమిటీలో ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ మంత్రికి చోటిస్తూ కేంద్రం కొత్త చట్టం తెచ్చిందన్నారు. చట్టాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్‌తో పాటు పలువురు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.




## లాకమిషన్ చైర్మన్‌గా దినేశ్ మహేశ్వరి బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి 23వ లా కమీషన్ చైర్ పర్సన్‌గా నియమితులయ్యారు. లా కమీషన్ చైర్మెన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు న్యాయవాది హితేశ్ జైన్, ప్రొఫెసర్ డీపీ వర్మలు కమీషన్‌లో సభ్యులుగా నియమితులయ్యారు. ఏప్రిల్ 15,2025 నాడు వాళ్లు ఛార్జ్ తీసుకున్నారు. ఆగస్టు 31, 2027న వాళ్ల పదవీ కాలం పూర్తి అవుతుంది. కేంద్ర న్యాయ మంత్రిత్వాశాఖ దినేశ్ మహేశ్వరి నియామకంపై ట్వీట్ చేసింది.

రాజస్థాన్‌లో సుమారు రెండు దశాబ్ధాల పాటు లాయర్‌గా జస్టిస్ మహేశ్వరి ప్రాక్టీసు చేశారు. ఆ తర్వాత 2004లో ఆయన రాజస్థాన్ హైకోర్టు బెంచ్‌కు పదోన్నతి పొందారు. అలహాబాద్ హైకోర్టులో జడ్జిగా చేశారు. మేఘాలయా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా కూడా చేశారు. 2019 జనవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదోన్నతి పొందారు. 2023 మేలో రిటైర్ అయ్యే వరకు ఆయన సుప్రీంకోర్టులో జడ్జిగా చేశారు. లా కమీషన్ సభ్యుడిగా నియమితులైన హితేశ్ జైన్ పరినం లా అసోసియేట్స్‌లో మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు. ముంబై ప్రదేశ్ బిజెపిలో వైస్ ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. రెండు దశాబ్ధాల నుంచి ఆయన లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సివిల్, క్రిమినల్, కమర్షియల్, రాజ్యాంగ అంశాల్లో అనుభవం ఉన్నది. మహారాష్ట్ర తరపున ముంబై హైకోర్టులో, సుప్రీంకోర్టులో స్పెషల్ కౌన్సిల్‌గా హాజరయ్యారు. 22వ భారత లా కమీషన్‌లో ప్రొఫెసర్ వర్మ పూర్తి స్థాయి సభ్యుడిగా చేశారు. న్యాయ విద్య బోధనలో ఆయనకు నాలుగు దశాబ్ధాల అనుభవం ఉన్నది. పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, మానవ హక్కుల చట్టాల్లో ఆయన విశేష అనుభవం ఉన్నది. నేషనల్ జుడిషియల్ అకాడమీలో 2017 నుంచి 2020 వరకు అదనపు డైరెక్టర్‌గా చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో లా కమీషన్ నాన్ స్టాట్యుటరీ బాడీగా పనిచేస్తుంది. దేశ చట్టాలపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తుంది. సవరించాల్సిన చట్టాలను, రద్దు చేయాల్సిన చట్టాల గురించి లాకమీషన్ తననిర్ణయాలను వెల్లడిస్తుంటుంది. న్యాయం అందరికి అందేరీతిలో, న్యాయ విభాగంలో పరిపాలన సక్రమంగా సాగే రీతిలో లా కమీషన్ వ్యవహరిస్తుంది.

# వక్ఫ్‌చట్టంపై దాఖలయిన పిటిషన్ల విచారణ షురూ!




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** వక్ఫ్ (సవరణ)చట్టం2025 చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ప్రారంభించింది. సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ చేపట్టింది. కేంద్రం తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ ఇప్పటి వరకు సర్వోన్నత న్యాయ స్థానంలో దాదాపు పది పిటిషన్లు దాఖలయ్యాయి. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంపీలు మహమ్మద్ జావేద్, మహువా మొయిత్రా, జియా ఉర్ రెహమాన్, మనోజ్ కుమార్ ఝా, అమనాతుల్లా ఖాన్‌తో పాటు మణిపూర్ ఎమ్మెల్యే షేక్ నూరుల్ హాసన్‌తో పాటు పలు పార్టీలు, ముస్లిం సంఘాలు పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే, ఈ పిటిషన్లను విచారించే ముందు తమ వాదనలు వినాలని అసోం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరాయి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం కేవియెట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. విచారణకు ముందు సుప్రీం కోర్టు తమ ఎదుట రెండు ప్రశ్నలు ఉన్నాయని పేర్కొంది. మొదటిది కేసును విచారించాలా? లేదంటే హైకోర్టుకు అప్పగించాలా? అని.. రెండోది న్యాయవాదులు వాదించాలనుకుంటున్న అంశాలపై తెలిపింది. ఓ పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. పార్లమెంట్ చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాల్లో తలదూర్చడమేనంటూ వాదనలు ప్రారంభించారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని సుప్రీంకోర్టుకు తెలిపారు. 'చట్టం ప్రకారం' అనే పదాలు అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని, ఈ పదబంధం ఇస్లాం మతానికి సంబంధించి మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందనిపేర్కొన్నారు. వక్ఫ్‌అలల్ ఔలాద్‌ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరించరాదని..దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదన్నారు.

ఎవరైనా వక్ఫ్‌ను స్థాపించాలనుకుంటే.. అతను ఐదేళ్లు ఇస్లాంను పాటిస్తున్నాడని నిరూపించుకోవాల్సి ఉందని.. ఆస్తుల సర్వే బాధ్యత కలెక్టర్‌కు ఇచ్చారని.. ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో ముస్లింలు మాత్రమే వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో భాగమని.. సవరణ తర్వాత హిందువులు కూడా భాగంకావొచ్చని.. ఇది పార్లమెంటరీ చట్టం ప్రాథమిక హక్కులను ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనన్నారు.

ఈ సందర్భంగా హిందువు లకు సంబంధించిన వారసత్వ విషయాల్లోనూ ప్రభుత్వం చట్టం చేసిందని, ముస్లిం సమాజం కోసం సైతం పార్లమెంట్ చట్టం చేసిన విషయాన్ని గుర్తు చేసిన సీజేఐ సంజీవ్ ఖన్నా.. ఇందులో తప్పేముందని ఇందులో తప్పేముం దని ప్రశ్నించారు. ఆర్టికల్ 26 అనేది సెక్యులర్ అని.. ఇది అన్ని మతాలకు వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా జామా మసీదు అంశాన్ని సైతం ధర్మాసనం ఎదుట కపిల్ సిబల్ లేవనెత్తారు. అయితే, జామా మసీదుతో పాటు అన్ని పురా తన స్మారక చిహ్నాలను కాపాడబడుతాయని సీజేఐ పేర్కొన్నారు.

# ముందస్తు ప్రణాళికతోనే ముర్షీదాబాద్ అల్లర్లు

## బిజెపిపై మమతా బెనర్జీ ధ్వజం



**కోల్‌కత్తా, ఏప్రిల్ 16:** వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముర్షిదాబాద్‌లో అల్లర్లు ముందస్తు ప్రణాళికతోనే జరిగాయని బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. అందులో బిజెపి, బిఎస్ఎఫ్, ఇతర కేంద్ర ఏజెన్సీల హస్తం ఉందని విమర్శించారు. కోల్‌కతాలో జరిగిన ఇమామ్‌ల సమావేశంలో పాల్గొన్న బెంగాల్ సిఎం మమతా ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో కల్లోల పరిస్థితులు నెలకొన్న వేళ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం తేవటంతోపాటు అక్రమ చొరబాట్లకు అనుమతి ఇవ్వటం బెంగాల్‌లో అశాంతికి కారణమైనట్లు ఉందన్నారు. వక్ఫ్ చట్టం మూలంగా ముర్షీదాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. ఇందులో బంగ్లాదేశ్ పాత్ర ఉన్నట్లు హోం శాఖ చెబుతోంది. ఒకవేళ ఇదే నిజం అయితే, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. సరిహద్దు బాధ్యత బిఎస్ఎఫ్ చూసుకోవాలి రాష్ట్రం కాదు. బయట నుంచి వచ్చి అల్లర్లు సృష్టించడానికి బిజెపి వాళ్లు ఎందుకు అనుమతిని ఇచ్చారు. నేను అన్ని మతాల గురించి మాట్లాడుతాను. కాళీమాత ఆలయాన్ని అభివృద్ధి చేసినప్పుడు బిజెపి వాళ్లు ఎక్కడికి వెళ్లారు. మేం దుర్గా పూజ, సరస్వతి పూజ నిర్వహించేటప్పుడు ఇక్కడ చేయనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ అన్ని మతాలను గౌరవించాలి. అదే మన సంప్రదాయం. కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. కానీ గోడీ మీడియా మాత్రం అవేవీ పట్టించుకోకుండా బంగాల్‌కు వ్యతిరేకంగా, నా గురించి మాట్లాడుతున్నాయి. ఏమైనా చెప్పాలనుకుంటే నాకు ఎదురుగా వచ్చి మాట్లాడండి. ఫేక్ న్యూస్ పబ్లిష్ చేయకండి. మమతా బెనర్జీ, బంగాల్ ముఖ్యమంత్రి వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన అల్లర్ల కారణంగా మరణించిన కుటుంబాలకు రూ. 10లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు. హింస జరగటానికి బీఎస్ఎఫ్‌లోని ఓ వర్గం, కేంద్ర హోంశాఖ పరిధిలోని ఏజెన్సీల పాత్ర ఉందని దుయ్యబట్టారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయొద్దని ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. అమిత్ షా సారథ్యంలోని హోంశాఖను నియంత్రించాలని కోరారు. రాజకీయ అజెండా కోసం అమిత్ షా దేశానికి హాని చేస్తున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు.

# ఔరంగజేబు సమాధికి రక్షణ కల్పించాలి

## మొఘల్ వారసుడు యాకూబ్ హాబీబుద్దీన్ డిమాండ్

**ముంబయి, ఏప్రిల్ 16:** మహారాష్ట్రలోని శాంభాజీ నగర్ జిల్లాలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి ఉన్న విషయం తెలిసిందే. అయితే ఆ సమాధిని తొలగించాలని ఇటీవల ఆ రాష్ట్రంలో హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్నాయి. నాగపూర్‌లో భీకర స్థాయిలో విధ్వంసం జరిగింది. ఈ నేపథ్యంలో మొఘల్ సామ్రాజ్య చివరి చక్రవర్తి బహదూర్ షా జాఫర్ వారసుడు యాకూబ్ హబీబుద్దిన్ ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెర్రస్‌కు లేఖ రాశారు. వక్ఫ్ ఆస్తులకు కేర్‌టేకర్‌గాఉన్న ముతావలి ప్రిన్స్ యాకూబ్ తన లేఖలో ఔరంగబేబు సమాధికి రక్షణ కల్పించాలనికోరారు. వాస్తవానికి ఆ సమాధిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన కట్టడంగా ప్రకటించారని, ప్రస్తుతం పురావస్తుశాఖ ఆధీనంలో ఆ సమాధి ఉన్నట్లు చెప్పారు. అయితే 1958 నాటి ప్రాచీన కట్టడాలు, ఆర్కియాలజీ సైట్ల పరిక్షణ చట్టం ప్రకారం ఔరంగజేబు సమాధివద్ద ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని డిమాండ్ చేశారు. తవ్వడం, కూల్చడం, మార్పులు కూడా చేయకూడదన్నారు.

## ఇక రైళ్లలోను ఎటిఎంలు

**ముంబయి, ఏప్రిల్ 16:** ప్రయాణికుల కోసం ఎటిఎం సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సెంట్రల్ రైల్వే మొదటిసారిగా ముంబయి -మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఓఎటిఎంను ఏర్పాటు చేసింది. త్వరలోనే మిగతా రైళ్లలోనూ ఇలాంటి కదిలే ఎటిఎంలు వచ్చే అవకాశంఉంది. పంచవటి ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజూ నడుస్తుంది. అందుకే దీనిలో ప్రయాణించేవారి కోసం ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు చెందిన ఎటిఎంను ఎసిఛైర్‌కార్ కోచ్‌లో ఏర్పాటు చేశాం. ప్రస్తుతానికి దీనిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసినప్పటికీ, త్వరలోనే పూర్తి స్థాయిలో ఈ ఎటిఎం సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తాం. పంచవటి ఎక్స్‌ప్రెస్‌లోని ఎసి ఛైర్‌కార్‌లో గతంలో ప్యాంట్రీ ఉండేది. ఆ స్థలంలోనే ఇపుడు ఈ కొత్త ఎటిఎంను ఏర్పాటు చేస్తున్నామని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా తెలిపారు. రైలు కదులుతున్నప్పుడు భద్రతాపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండడానికి దీనికి ఓ షట్టర్ డోర్‌ను కూడా అమర్చాం. అలాగే కోచ్‌లో ఎటిఎం ఏర్పాటుకు అవసరమైన మార్పులను మన్మాడ్ వర్క్‌షాప్‌లో చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

# ప్రియుడికోసం భర్తను హత్యచేసిన యూట్యూబర్

**భివాండి, ఏప్రిల్ 14:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రియుడితో కలిసి భర్తను చంపిన ఘటన మరువకముందే హరియాణాలో మళ్లీ అలాంటి దారుణమే జరిగింది. రవీనా అనే మహిళ తన ప్రియుడుతో కలిసి భర్తను అతి కిరాతకంగా హత్య చేసింది. ఈ కేసులో నిందితులిద్దర్ని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భివానీకి చెందిన ప్రవీణ్, రేవాడిలోని జూడి గ్రామస్థురాలైన రవీనాకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆరేళ్ల కుమారుడు ముకుల్ ఉన్నాడు. రవీనా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండేది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 34 వేలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. అందులో వీడియోలు పోస్టు చేస్తుండేది. యూట్యూబ్‌లోనూ షార్ట్స్ అప్లోడ్ చేసేది. రవీనాకు ఇన్‌స్టా అంటే చాలా ఇష్టం. అందులో వీడియోలు చేసేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించినప్పటికీ, ఆమె తగ్గేది కాదు. ఇదే విషయంపై పలుమార్లు భర్తతో గొడవ పడేది. సోషల్ మీడియాపై ఇష్టంతో ఉన్న రవీనాకు హిసార్‌లోని ప్రేమ్ నగర్ నివాసి అయిన యూట్యూబర్ సురేశ్ ఏడాదిన్నర క్రితం పరిచయం అయ్యాడు. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి షార్ట్ వీడియోస్ చేసేవారు. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది.

రవీనా భర్తకు వీరి ప్రవర్తనపై అనుమానం కలిగింది. ఈ క్రమంలోనే మార్చి 25న సురేశ్, రవీనాను కలిసిఉండటంచూశాడు ప్రవీణ్. దీంతో రవీనాతో ప్రవీణ్ గొడవకు దిగాడు. వెంటనే తన ప్రియుడు సురేశ్‌తో కలిసి మంచం కింద ఉన్న దుప్పటితో ప్రవీణ్ గొంతును నులిమేసింది రవీనా. ప్రవీణ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులు ప్రవీణ్ గురించి అడిగినప్పుడు ఆమె ఏమీ తెలియదన్నట్లు నటించింది. ఆరోజు రాత్రి అందరూ నిద్రలోకి జారుకున్న తర్వాత అర్ధరాత్రి 2:30 గంటలకు భర్త మృతదేహాన్ని ప్రియుడితో కలిసి బైక్ పై తీసుకెళ్లి 6కి.మీ దూరంలో ఉన్న దిన్నోడ్ కాలువ వద్ద పడేసింది.

### కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

మార్చి 28న పోలీసులు దిన్నోడ్ రోడ్డులోని కాలువ వద్ద కుళ్లిన స్థితిలో ప్రవీణ్ మృతదేహాన్ని కనుగొన్నారు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. ప్రవీణ్ ఇంటి సమీపంలో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. హెల్మెట్ ధరించిన అనుమానితుడికి చెందిన బైక్ ప్రవీణ్ ఇంటి సమీపంలో కనిపించింది.

రవీనా కూడా బైక్ వెనుక కూర్చుని ముఖం మీద గుడ్డ కప్పుకుని ఉంది. ప్రవీణ్ మృతదేహం మధ్యలో ఉంది. అర్ధరాత్రి హెల్మెట్ ధరించి ఉన్న వ్యక్తి ప్రవీణ్ ఇంటికి తిరిగొచ్చాడు. అతడి బైక్‌పై ఓమహిళ మాత్రమే ఉంది. మధ్యలో ఎవరూ లేరు.

ఈ నేపథ్యంలో రవీనా, ఆమె లవర్ సురేశ్‌ను తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. తామిద్దరే ప్రవీణ్‌ను హత్య చేశామని పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు ఇద్దర్ని జైలుకు పంపారు.

## వెంటిలేటర్‌పై ఉన్న ఎయిర్‌హోస్టెస్‌పై లైంగికదాడి

**గురుగ్రామ్, ఏప్రిల్ 16:** అస్వస్థతకు గురైై వెంటిలేటర్‌పై ఉన్న ఓ ఎయిర్ హోస్టెస్‌పై హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న ఒక ఆస్పత్రి సిబ్బంది ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం పోలీసులు సిసిటివి ఫుటేజీని పరిశీలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ఎయిర్ హోస్టెస్‌గా పనిచేస్తున్న మహిళ (46) కంపెనీ తరఫున శిక్షణ కోసం గురుగ్రామ్ వచ్చి, ఓ హోటల్‌లో బస చేశారు. ఈనెల 5న హోటల్‌లో ఉన్న ఈత కొలనులో స్విమ్మింగ్ చేస్తుండగా కింద పడి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను వెంటనే సమీపంలోని ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఐసీయూలోని వెంటిలేటర్‌పై ఉంచారు. ఆ మరుసటి రోజే తనను ఆసుపత్రినుంచి డిశ్చార్జ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఏప్రిల్ 6న వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు తనపై ఆసుపత్రి సిబ్బంది ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారని తెలిపింది. ఈ విషయాన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక భర్తకు చెప్పింది.

దీంతో ఇద్దరూ కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఎయిర్ హోస్టెస్ ఫిర్యాదు మేరకు ఆస్పత్రిలోని గుర్తు తెలియని సిబ్బందిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలాన్ని కోర్టులో న్యాయమూర్తి ఎదుట నమోదు చేశారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని పోలీ సులు తెలిపారు. ఆస్పత్రిలోని సిసిటివి కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

## రాజకీయ కుట్రలతోనే సోనియా, రాహుల్ పేర్లు

### ఇడి ఛార్జిషీటుపై ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** బిజెపి సారథ్యంలోని నిరంకుశ కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే తమ పార్టీని, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మోడీ సర్కారు తన పాపాలను కప్పిపుచ్చుకోవడానికే, నేషనల్ హెరాల్డ్ కేసును తెరపైకి తెస్తోందని విమర్శించారు. వీటన్నింటికి కాంగ్రెస్ పార్టీ బెదిరే ప్రసక్తే ఉండదని తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను వెలుగులోకి తెస్తూనే ఉంటామని ఖర్గే పేర్కొన్నారు. స్పష్టమైన విజన్ లేకుండా దేశ సమస్యలకు పరిష్కారాలను చూపించలేని పరిస్థితుల్లో మోడీ సర్కారు ఉంది. బిజెపి పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ గాడి తప్పింది. అందుకే ప్రజల దృష్టిని మళ్లించే పన్నాగాలను అమలు చేస్తోంది అని ఖర్గే 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. బిజెపి సర్కారు వైఫల్యం వల్ల మన దేశ ద్రవ్యలోటు మూడేళ్ల గరిష్ఠానికి చేరింది. దిగుమతి సుంకాలు, ట్రేడ్ వార్ గురించి ఈ ప్రభుత్వంలో ఆలోచించే నాథుడే లేడు. మాటలే తప్ప చేతలు లేవు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 2024 డిసెంబరు వరకు పెట్రోలు, డీజిల్‌పై వివిధ పన్నుల ద్వారా కేంద్ర సర్కారు రూ.39 లక్షల కోట్లు వసూలు చేసింది. ఎల్‌పిజి ధరలను మరో రూ.50 పెంచారు.

కనీసం ఆర్థిక బలహీనవర్గాలకు రాయితీలు ఇవ్వడం లేదు. గ్రాడ్యుయేషన్ చేసి కూడా నిరుద్యోగులుగా మిగిలిపోతున్న వారు దేశంలో 13 శాతం మంది ఉన్నారు. నిరుద్యోగ రేటు 10.2 శాతానికి చేరుకుంది. దేశంలోని 23 ఐఐటీల్లో 22, 25 ట్రిపుల్ ఐటీల్లో 23 జాబ్ ప్లేస్‌మెంట్లలో డౌన్ అయ్యాయి. నీట్స్‌లోనూ ప్లేస్‌మెంట్స్ 11 శాతం తగ్గాయి. కాగా, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ఉదయం దిల్లీలోని అక్బర్‌రోడ్‌లో ఉన్న ఎఐసిసి కార్యాలయం వద్ద నిరసనకు దిగారు.

## సైన్‌బోర్డులకు 'ఉర్దూ' వినియోగాన్ని
# సమర్థించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ:** సైన్‌బోర్డులకు ఉర్దూ భాషను వాడడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. మహారాష్ట్రలోని ఓ మున్సిపల్ కౌన్సిల్‌కు ఉర్దూ భాషలో రాసిన సైన్ బోర్డు ఉండడాన్ని కోర్టు అంగీకరించింది. జస్టిస్ సుధాన్షు దూలియా, కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ కీలక తీర్పు ఇచ్చింది. ఉర్దూ, మరాఠీ భాషకు రాజ్యాంగం ప్రకారం ఒకే రకమైన హోదా ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది. కేవలం మరాఠీ మాత్రమే వాడాలన్న వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. వర్షతై సంజయ్ బగడే అనే వ్యక్తి దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు కొట్టివేసింది. పాటూరు పట్టణంలో ఆయన మాజీ కౌన్సిలర్.

పాటూరు మున్సిపల్ కౌన్సిల్ నేమ్‌బోర్డును ఉర్దూలో రాయడాన్ని ఆయన కోర్టులో సవాల్ చేశారు. ఉర్దూ భాష పుట్టింది ఇండియాలోనే అని, కానీ ఆ భాష ముస్లింలకు సొంతమైందని కోర్టు పేర్కొన్నది. హిందువులకు హిందీ భాషను, ముస్లింలకు ఉర్దూ భాషను బ్రిటీష్ పాలకులు అంటగట్టారని కోర్టు తెలిపింది. అయితే ఉర్దూ భాష గురించి చర్చించే సందర్భం ఇది కాదు అని, కానీ హిందీ, ఉర్దూ భాషలు మిక్స్ అయ్యాయని, హిందీ భాషఎక్కువ శాతం సంస్కృత భాషగా.. ఉర్దూ భాష పర్షియన్ భాషగా గుర్తింపు తెచ్చుకున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కానీ బ్రిటీష్ పాలకులు మతం ఆధారంగా రెండు భాషలను విభజించినట్లు అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. ఇప్పుడు హిందీ భాషను హిందువుల భాషగా, ఉర్దూ భాషను ముస్లింల భాషగా అర్థం చేసుకుంటున్నారని కోర్టు తెలిపింది. చాలా దయనీయమైన పరిస్థితి ఎదురైందని, వాస్తవానికి ఐకమత్యం నుంచి విభజన ఏర్పడిందని కోర్టు పేర్కొన్నది. ఉర్దూ భాషకు ఇండియాలో ఆనవాళ్లుఉన్నాయని, ఒక మతానికి ఆ భాషను ఆపాదించలేమని కోర్టు తెలిపింది.

ఉర్దూ భాషను ఓ ఏలియన్‌గా భారతీయులు చూస్తున్నారని, కానీ ఇది నిజం కాదు అని, మరాఠీ.. హిందీ భాషల తరహాలోనే ఉర్దూ భాష కూడా ఇండోఆర్యన్ లాంగ్వేజే అని కోర్టు తెలిపింది. ఉర్దూ భాష ఈ నేలపైనే పుట్టినట్లు కోర్టు చెప్పింది. ఆ భాష ఇక్కడే అభివృద్ధి చెంది, వర్ధిల్లినట్లు కోర్టు పేర్కొన్నది. శతాబ్దాల నుంచి ఆ భాష మరింత పదునెక్కిందని, ఎంతో మంది కవులకు చాలా ఇష్టమైన భాషగా మారినట్లు కోర్టు వెల్లడించింది.

మహారాష్ట్ర లోకల్ అథారిటీ లాంగ్వేజ్ యాక్ట్ 2022 ప్రకారం ఉర్దూ భాషను వాడరాదు అని పిటీషనర్ కోర్టులో వాదించారు. కానీ ఆ చట్టం ప్రకారం ఉర్దూను నిషేధిత భాషగా చూడలేమని సుప్రీంకోర్టు చెప్పింది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ ప్రకారం మరాఠీ, ఉర్దూ భాషలు ఒక్కటే అని కోర్టు పేర్కొన్నది.

17-4Pg6exHMNWJQE.qxd:17-4Pg6exHMNWJQE.qxd 01/01/01 9:46 AM Page 1



# బుద్ధి మాంద్యం పిల్లలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆత్మీయ పలకరింపు



### - కదిరి ఆర్డీటీ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించిన పరిటాల సునీత
### - పిల్లల విషయంలో సిబ్బంది చొరవపై ప్రశంసలు

**అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో** బుద్ధి మాంద్యం, మెదడు పక్షవాతానికి గురైన పిల్లల విషయంలో ఆర్డీటీ సంస్థ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తిరుపతి నుంచి తిరుగు ప్రయాణంలో భాగంగా ఆమె కదిరి సమీపంలోని ఆర్డీటీ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడున్న బుద్ధి మాంద్యం, మెదడు పక్షవాతాని గురైన పిల్లల సంరక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పిల్లలకు ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి. సిబ్బంది ఎంత మంది ఉన్నారు. వారికి ఎలాంటి సేవలందు తున్నాయి. వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. అలాగే అక్కడి పిల్లలతో మమేకమవుతూ చాలా సేపు ఆ కేంద్రంలో గడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. మనకు శరీరంలో ఏ అవయం లేకపోయినా జీవించవచ్చు కానీ.. మెదడు పని చేయకపోతే కచ్చితంగా మరొకరి సహాయం అవసరముంటుందన్నారు. కనీసం వారి పనులు వారు కూడా చేసుకోలేని పరిస్థితి ఉంటుందన్నారు. బుద్ధిమాంద్యం పిల్లలైతే కనీసం స్వీయ కార్యక్రమాలు చేసుకోగలుగుతారు కానీ.. మెదడు పక్షవాతానికి గురైన వారికి కచ్చితంగా ఇంకొకరి సాయం కావాలన్నారు. ఇలాంటి ఎంతో మంది పిల్లల్ని ఆర్డీటీ చేరదీసి..

వారి సంరక్షణ చూసుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆర్డీటీ సంస్థకు ఏమిచ్చినా ఈ రుణం మాత్రం తీర్చుకోలేమన్నారు. ఇక్కడి సిబ్బంది కూడా పిల్లల విషయంలో తీసుకుంటున్న శ్రద్ధ, ఓపికను అభినందించాల్సిందేనని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌తో రూ.5 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

### - బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురి అరెస్టు - ఎస్పీ మణికంఠ చందోలు

**చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన చిత్తూరు సంతపేట దొంగలబావివీధికి చెందిన రాజా(26) 5 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో చిత్తూరు సంతపేట పరిసరాల్లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు టుటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం నలుగురు యువకులను అరెస్టు చేసి వారి నుండి 48 వేల రూపాయలు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లపై టుటౌన్ పోలీసులు పట్టుబడ్డ నిందితులను విచారిస్తే ఇందులో సంతపేట దొంగలబావి వీధికి చెందిన ఆటోడ్రైవర్ రాజా క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా 5 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడని తేలింది. ఈ విషయంపై ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పట్టుబడిన రాజాను పోలీసులు విచారిస్తే ఇతను డఫబెట్ స్పోర్ట్స్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా భారీగా నష్టపోయిన ఘటన వెలుగు చూసిందన్నారు. గత కొన్ని రోజుల క్రితం రాజా డఫబెట్ స్పోర్ట్స్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో ఖాతా ప్రారంభించి చిన్న మొత్తాలను బెట్టింగ్‌కు పెట్టాడన్నాడు. కొన్ని సందర్భాల్లో రాజాకు కొద్ది లాభాలు వచ్చాయన్నారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో వచ్చిన చిన్న లాభాలకు ఆశపడిన రాజా ఎక్కువ మొత్తాలు పెట్టి ఎక్కువ లాభాలు ఆర్జించాలని ఆశపడి తన భార్య బంగారు నగలను సైతం బ్యాంకులో తాకట్టు పెట్టి క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా అతనికి తెలిసిన స్నేహితుల నుండి లక్ష రూపాయల వరకు అప్పు చేసి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయాడన్నారు. రాజా గత వారం రోజులుగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా రూ.5 నుండి రూ.6 లక్షలు నష్టపోయాడని వివరించారు. ఈ విషయంపై ఎస్పీ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లు లాభాలు చూపించే మాయాజాలం మాత్రమేనని, ప్రజల కష్టార్జిత సంపదను మోసం చేసేలా ఈ బెట్టింగ్ యాప్‌లు తయారు అయ్యాయన్నారు. ఈ యాప్‌లు చట్టవిరుద్ధమైనవని, ఇలాంటి యాప్‌ల ద్వారా ఎవ్వరు బెట్టింగ్‌కు పాల్పడకూడదని హెచ్చరించారు.

బెట్టింగ్ ద్వారా సంపాదన సాధ్యపడదని, ఇది ఒక అక్రమ కార్యకలాపం మాత్రమేనని, అత్యధిక యుడత ఎటువైపు వెళ్ళాలో తెలియకుండా బెట్టింగ్ ప్రపంచంలో అప్పులు ఊబిలో చిక్కుకొంటున్నారన్నారు. ఈ బెట్టింగ్‌ల వల్ల ఆత్మహత్యలు, కుటుంబ విబేధాలు, నేర ప్రవృత్తి పెరుగుతున్నాయన్నారు. 2024 అక్టోబర్ నెలలో జిడినెల్లూరు మండలానికి చెందిన దినేష్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిస అయ్యాడని, పెద్ద మొత్తంలో అప్పులు చేసి కుటుంబ ఆస్తిని తాకట్టు పెట్టాడన్నారు. చివరికి ఆర్థిక ఒత్తిడికి గురై తల్లి, తండ్రి, అక్కతో కలిసి అందరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారన్నారు.

# చైన్ స్నాచర్ల ముఠాల పట్టివేత




స్వాధీనం చేసుకున్న బంగారు నగలతో జిల్లా పోలీసు అధికారులు

### - నలుగురు అంతర్ జిల్లా చైన్ స్నాచర్ల ను అరెస్ట్ చేసిన అనంతపురము పోలీసులు
### - 32.40 లక్షల విలువచేసే 36 తులాల బంగారు నగలు, మూడు బైకులు స్వాధీనం

**అనంతపురం, ఏప్రిల్ 16, (ప్రభాత వార్త బ్యూరో)** అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ జగదీష్ ఆదేశాల మేరకు చైన్ స్నాచింగ్ నేరాలకు అనంతపురం పోలీసులు చెక్ పెట్టారు. 32.4 లక్షలు విలువ చేసే 36 తులాల బంగారు నగలను, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశం మేరకు పోలీస్ అధికారులు , సిబ్బంది బృందాలు బృందాలుగా ఏర్పడి చైన్ స్నాచర్స్ ముఠాలను చర్యల గుట్టు రట్టు చేశారు . బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి చైన్ స్నాచర్ల ముఠా అరెస్టు, తదితర వివరాలను జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ వెల్లడించారు.అరెస్ట్ అయిన నింధితుల వివరాలు ,, తదితర పూర్తి వివరాలను జిల్లా ఎస్పీ ఇలా వివరించారు.(1) అనంతపురంలోని రాజీవ్ కాలనీ చెందిన కె.పంపాచారి నరేశ్, ఒక కార్పెంటర్ తో పాటు డ్రైవింగ్ పని చేస్తూ జీవనం కొనసాగించేవాడు. పేకాట, క్రికెట్ బెట్టింగ్ లకు అలవాటు పడి సంపాదన అంతా ఈ వ్యసనాలకే ఖర్చు పెట్టేవాడు. కుటుంబ పోషణ, తన వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి చైన్ స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. (2) అనంతపురంలోని రాయల్ నగర్ కు చెందిన షేక్ షాకీర్,ఒక కార్పెంటర్ . ఈ వృత్తితో పాటు ప్రస్తుతం ఇతను స్థానిక రాయల్ నగర్ లో ఫర్నీచర్ షాప్ పెట్టుకొని సొంతంగా పని చేసుకుంటున్నాడు. వ్యాపారము సరిగా జరగలేదని అప్పులు ఎక్కువ అయ్యాయి. వీటిని తీర్చుకోవడానికి కె.పంపాచారితో కలిసి ఇద్దరు చైన్ స్నాచింగ్ లకు పాల్పడ్డారు. (3) శ్రీ సత్య సాయి జిల్లా నల్లమడ మండలం కేంద్రంకు చెందిన కంబం నాగార్జున చిన్న బతుకు తెరువు కోసం కుటుంబం సహా ఏడాదిన్నర కిందట అనంతపురం చేరాడు. డ్రైవరు గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు . నాలుగు నెలల కిందట కె.పంపాచారి నరేశ్ పరిచయం అయ్యాడు. ఇద్దరూ స్నేహితులుగా మారి

...ఇద్దరు కలిసి పేకాట , ఆన్లైన్ జూదము ఆడేవారు . ఈ వ్యసనాలలో డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలు అయ్యాడు . వీటిని తీర్చుకునే క్రమములో చైన్ స్నాచింగ్ ల బాట పట్టాడు..(4) అనంతపురం నగరంలోని ప్రియాంక నగర్ చెందిన షేక్ ఫజిల్ అహ్మద్ షేక్ ఫజిజ్ అహ్మద్, ఇతను ప్రైవేట్ డ్రైవర్ గా పనిచేసేవాడు. ఆన్లైన్ బెట్టింగ్లు, తదితర వ్యసనాలకు అలవాటు పడి అప్పులపాలయ్యాడు . అప్పు ఇచ్చిన వారినుండి చెల్లించమని వత్తిడి తీవ్రం కావడము ... తనకు పెళ్లి ఖరారు అయి, పెండ్లి ఖర్చులకు అవసరమైన డబ్బులు లేకపోవడము వలన ఎలాగైనా సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. చైన్ స్నాచింగ్ల బాట పట్టాడు . ప్రస్తుతం అరెస్టయిన నలుగురిలో కె.పంపాచారి నరేశ్ ముఖ్యుడు. తనకున్న అప్పులను తీర్చుకోవాలని భావించి సులువుగా డబ్బు సంపాదించాలని ఆలోచించి చైన్ స్నాచింగులు చేయాలనుకున్నాడు. తనతో పాటు అప్పులతో సతమతం అవుతున్న తన స్నేహితులైన షేక్ షాకీర్, కంబం నాగార్జున, చిన్నలను కలుపుకున్నాడు. మొత్తం మూడు ముఠాలుగా ఏర్పాటు చేసుకున్నాడు. తనొక్కడే ఒక ముఠాగా...తను, షేక్ షాకీర్ రెండవ ముఠాగా... తను, కంబం నాగార్జున, చిన్న కలిసి మూడవ ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగులకు ఒడిగట్టాడు. ఒకరికి తెలియకుండా మరొకర్ని చేర్చుకుని మిగితా ఇద్దరితో కలిసి చైన్ స్నాచింగులు చేశాడు. షేక్ ఫజిల్ అహ్మద్ షేక్ ఫజిజ్ మాత్రం ఒక్కడే స్నాచింగులు చేశాడు. ....ఒంటరిగా వెళ్లే మహిళలే టార్గెట్ చేసినా చైన్ స్నాచింగ్ ముఠాలు... ఒంటరిగా వెళ్లే మహిళల్ని టార్గెట్ చేసి కె.పంపాచారి నరేశ్ ఒక్కడే చైన్ స్నాచింగులకు పాల్పడ్డాడు. టూవీలర్ పై ఇతనొక్కడే వెళ్లి శివారు కాలనీలు/ప్రాంతాలలో ఒంటరిగా వెళ్తున్న మహిళలు మెడలో ధరించిన బంగారు నగలును లాక్కొని అదే టూవీలర్ పై పరారు కావడం అలవాటుగా చేసుకున్నాడు. ఇలా... 2023 సంవత్సరం నుండీ కురుగుంట, మన్నీల, రాప్తాడు, కళ్యాణదుర్గం రోడ్డు, గణేష్ నగర్, లలితానగర్ , ఒకటో రోడ్డు, తదితర ప్రాంతాలలో ఇతనొక్కడే 10 చైన్ స్నాచింగులు చేశాడు. రెండవ ముఠాగా షేక్ షాకీర్ తో కలిసి బైకుపై వెళ్లి కళ్యాణదుర్గం రోడ్డు, ద్వారకా విల్లాస్ లలో 02 స్నాచింగులు... కంబం నాగార్జునతో కలిసి హెచ్చెల్సీ రోడ్డు, స్టాలిన్ నగర్, బి.కె.సముద్రం చెరువు, బి.కొత్తపల్లి గ్రామాలలో 04 స్నాచింగులు చేశారు. మొత్తం 16 కేసుల్లో కె.పంపాచారి నరేశ్ నిందితుడు కాగా... ఈ 16 కేసుల్లోనే 02 కేసుల్లో షేక్ షాకీర్ , 04 కేసుల్లో కంబం నాగార్జున నిందితుడిగా ఉన్నారు. ఈ ముగ్గురు కూడా 2023 నుండీ స్నాచింగు నేరాలకు పాల్పడ్డారు.

# ఆంధ్రప్రదేశ్ ఐటిరంగంలో గేమ్ ఛేంజర్ టిసిఎస్!

### - మంత్రి నారా లోకేష్ కృషితో ఐటి హబ్‌గా విశాఖ

**గుంటూరు ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రఖ్యాత ఐటి దిగ్గజం టిసిఎస్ కు విశాఖలో 21.16 ఎకరాలను 99పైసలకు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ఎన్నికల హామీని నెరవేర్చేందుకు చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. మంత్రి లోకేష్ గతఏడాది అక్టోబర్ లో ముంబయ్ లోని టిసిఎస్ హౌస్ ను సందర్శించి తమ రాష్ట్రంలో డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిందిగా టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ కు విజ్ఞప్తిచేశారు. ఆ తర్వాత టిసిఎస్ ప్రతినిధులతో నిరంతర చర్చలు సాగించి చివరకు విజయం సాధించారు. విశాఖలో టిసిఎస్ డెవలప్ మెంట్ సెంటర్ కోసం ఆ సంస్థ రూ.1370 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీనిద్వారా యువతకు 12వేల ఐటి ఉద్యోగాలు లభించనున్నాయి. ఐటి ఇన్వెస్టిమెంట్స్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ గా దృష్టి సారించదనడానికి ఇదొక ఉదాహరణ.విశాఖ నగరాన్ని ఐటి హబ్ గా మార్చడానికి మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషిలో టిసిఎస్ గేమ్ ఛేంజర్ కాబోతోంది. ఆంధ్రప్రదేశ్ ఐటీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. విశాఖలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ప్రముఖ సంస్థలు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో ఐటి హిల్స్ నుంచి పారిపోయిన కంపెనీలన్నీ ఒక్కొక్కటిగా రాష్ట్రానికి తిరిగి వస్తున్నాయి. రాష్ట్ర ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్ గా మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాల్చుతున్నాయి.

# స్త్రీ జనోద్ధరణకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కందుకూరి

### - మాజీ సిఎం :జగన్

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత,మాజీ సీఎం జగన్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా "ఎక్స" వేదికగా ఆయన స్పందిస్తూ స్త్రీ జనోద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని జగన్ కొనియాడారు. తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అని ప్రశంసించారు. సంఘ సంస్కర్తగా సాహితీవేత్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వీరేశలింగం పంతులు ఆశయాలు ఈ తరానికి స్పూర్తిదాయకమని చెప్పారు.

# చందనోత్సవంలో సాధారణ భక్తుల దర్శనాలకే తొలి ప్రాధాన్యం

**ఏప్రిల్ 16 :** ఏప్రిల్ 30వ తేదీన జరిగే శ్రీ వరాహ లక్ష్మీ ్మ నరసింహ స్వామి చందనోత్సవ వేడుకలో సాధారణ భక్తుల దర్శనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తామని, దానికి తగ్గట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని, జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చిన్నపాటి తప్పిదం కూడా జరగకుండా సమష్టి కృషి చేసి వేడుకను విజయవంతం చేసేందుకు సన్నద్ధంగా ఉన్నామని అన్నారు. సింహాచలం పాతగోశాల వద్ద నూతనంగా నిర్మించిన దేవాదాయ కల్యాణ మండపం సముదాయంలో బుధవారం చందనోత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సహచర మంత్రులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం సంబంధిత వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు.30వ తేదీ తెల్లవారు ఝాము 3.00 గంటల నుంచే దర్శనాలుచందనోత్సవం రోజు తెల్లవారు ఝాము 3.00 గంటల నుంచే దర్శనాలు ప్రారంభమవుతాయని దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి ప్రకటించారు. 1.00 గంటకు సుప్రభాత సేవతో పూజా క్రతువులు మొదలవుతాయని, 3.00 గంటలకు ఆలయ వ్యవస్థాప ధర్మకర్త తొలి దర్శనం ప్రారంభమవుతుందన్నారు. 3.30 నుంచి 4.00 గంటల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, అనంతరం తితిదే వారు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. 4.15 నుంచి 4.30 గంటల లోపు మొదటి స్లాట్ వీఐపీ దర్శనాలు మొదలవుతాయని వివరించారు. 4.00 గంటల నుంచి రూ.1,000 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారి దర్శనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. వీఐపీ టిక్కెట్లు 2500 వరకు మాత్రమే ఇస్తున్నామని, ప్రొటోకాల్ దర్శనాల్లో భాగంగా ఒక పాస్ పై సంబంధిత కుటుంబ సభ్యులను ఆరుగురి వరకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. రూ.1500 టిక్కెట్ కొనుగోలు చేసిన భక్తులు భోగమండపం నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. అంతరాలయ దర్శనాలు ఉండబోవని స్పష్టం చేశారు. సంప్రదాయం ప్రకారం 29వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు సాధారణ దర్శనాలు నిలిపివేస్తామని, చందనోత్సవం రోజు తెల్లవారు ఝాము 1.00 గంట నుంచి ఇతర ప్రక్రియలు, దర్శనాలు మొదలవుతాయని మంత్రి వివరించారు. 30వ తేదీ ఉదయం 3.00 నుంచి రాత్రి 7.00 గంటల వరకు దర్శనాలు ఉంటాయని, 7.00 గంటల సమయం కంటే ముందుగా క్యూలైన్లలో ఉన్నవారికి ఎంత టైమ్ అయినా దర్శనాలు చేయిస్తామని తెలిపారు. దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేశామని మంత్రి వివరించారు.భక్తులకు ఉచిత అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదంచందనోత్సవం రోజు దర్శనాలకు వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి పేర్కొన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఎక్కడికక్కడ తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు ఏర్పాట్లు చేయాలని, చిన్న పిల్లలకు పాలు సమకూర్చాలని సూచించినట్లు చెప్పారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో సంతృప్తికర స్థాయిలో దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దేవాదాయ, రెవెన్యూ, హోం శాఖ అధికారులు శ్రద్ధ వహించి వేడుకలను విజయవంతం చేసేందుకు కంకణం కట్టుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చందనోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించేందుకు ప్రతిష్టాత్మకంగా భావించిందని, ఆ మేరకు చర్యలు తీసుకుందని, అందులో భాగంగానే మంత్రుల బృందాన్ని పంపించిందని గుర్తు చేశారు. అనుభవం కలిగిన అధికారులను నియమిస్తామని చెప్పారు.

# నకిలీ వైద్యుడిని కనిపెట్టిన రాష్ట్ర వైద్యమండలి

విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి: మధ్యప్రదేశ్‌కు చెందిన నకిలీ వైద్యుడి లీలలకు ఏపీ వైద్యమండలి(మెడికల్‌కౌన్సిల్) చెక్ పెట్టింది.ఎటువంటి విద్యార్హతలు లేకుండాపూ మధ్యప్రదేశ్ మెడికల్‌కౌన్సిల్‌లో కార్డియాలజిస్‌గా నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ నమోదయ్యాడు. అంతటితో ఆగకుండా సంబంధిత వైద్యానికి సంబంధించి ఏడుగురి ప్రాణాలు బలిగొనడానికి కారణమయ్యాడు.. ఏపీలో కుడా తన ప్రతాపం చూపాలనుకున్న యాదవ్‌కు కౌన్సిల్ గట్టి దెబ్బకొట్టింది.నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అనే వ్యక్తి డాక్టర్ ఎన్.జాన్ కెమ్ పేరుతో బ్రిటిష్ వైద్యుడినంటూ నకిలీ పత్రాలు సృష్టించాడు. మధ్యప్రదేశ్‌లోనూ దమోహ్ పట్టణంలో ఓ ప్రైవేట్ మిషనరీ ఆసుపత్రిలో డాక్టర్‌గా చేరాడు. ఆయన చేసిన శస్త్రచికిత్సలు విఫలమై ఏడుగురు చనిపోయారు. పోలీసులు కేసు పెట్టి, ఇటీవల నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌తోనూ అతని వ్యవహారాలు వెలుగు చూసాయి.తన రిజిస్ట్రేషన్‌ను కేరళకు మార్చుకునేందుకు ఎన్వోసీ ఇవ్వాలంటూ డాక్టర్ ఎన్.జాన్ కెమ్ పేరిట గతేడాది నవంబర్‌లో ఏపీ వైద్య మండలి కార్యాలయానికి మెయిల్ వచ్చింది. అందులో పేర్కొన్న వివరాలేవీ కార్యాలయంలో లేవు. దీంతో తగిన ఆధారాలతో నేరుగా రావాలంటూ కౌన్సిల్ అధికారులు ప్రత్యుత్తరమిచ్చారు. ఆ తర్వాత జాన్ కెమ్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదని కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఐ.రమేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో అతను నకిలీ వైద్యుడిగా బయటపడింది. తాజాగా జాతీయ వైద్య కమిషన్ కార్యదర్శి నుంచి ఏపీఎంసీకి ఓ లేఖ వచ్చింది. నిందితుడు పేర్కొన్న రిజిస్ట్రేషన్ నంబరును ప్రస్తావిస్తూ పూర్తి వివరాలు పంపాలని కోరింది.. జాన్ కెమ్ పేరిట గతేడాది ఎన్వోసీ కోసం మెయిల్ చేసిన లేఖలోని వివరాలే ఎన్ఎంసీ నుంచి వచ్చిన లేఖలోనూ ఉన్నాయి. తన పేరు నరేంద్ర జాన్ కెమ్ అని 2006 ఆగస్టులో ఎంబీబీఎస్ అర్హతతో ఏపీఎంసీలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు నిందితుడు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కింద దొంగ నంబరు సృష్టించాడు. దీన్ని బట్టి ఏపీఎంసీలో రిజిస్ట్రేషన్ చేయించుకోకున్నా, తప్పుడు సమాచారంతో మెయిల్ పెట్టినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే అతని ఆటకట్టించారు.

# ముత్యాలమ్మ జాతర సంబరాలు ఆకట్టుకున్న పోతురాజు ముగ్గు



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో జాతర సంబరాలు కన్నులపండువగా నిర్వహిస్తున్నారు.. ఆదివారం రాత్రి చాటింపులతో ప్రారంభమైన జాతర సంబరాలు బుధవారం ఉదయం నుంచి ముత్యాలమ్మగుడివీధిలో నివాశస్థులు మొక్కలు తీర్చుకొనుటకు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇళ్ళ వద్ద అంబలి ప్రసాదాల్ని పంపిని చేశారు.ఆలయాన్ని చక్కగా ముస్తాబు చేశారు.విద్యుత్ దీపాలతో కన్నులు మిరుమిట్లు గొల్లునట్లు ముస్తాబులు చేశారు. బుధవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పోతురాజుముగ్గు వేసి చక్కగా కొలుపు గంగపెట్టిపూజ, జరిపించారు. అనంతరం రేణుకాదేవి ముగ్గు, కొలుపు రాత్రి అమ్మవారికి మహాకుంభనైవేద్యం, అలంకరణ చేపట్టారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య ఉత్సవాల్ని కన్నుల పండువగా నిర్వహించటంలో ఆలయపర్యవేక్షకులు లక్ష్మయ్య, ఎఇఎ సతీస్ మాలిక్‌లు చక్కటి ఏర్పాట్లు చేపట్టారు. జాతర సందర్భంగా ముత్యాలమ్మగుడి వీధిని పెండ్లి మండపం నుంచి నిత్య కళ్యాణం పచ్చ తోరణంలా ముస్తాబు చేసారు. ఓ వైపు అరటి చెట్ల కనువిందు మరోవైపు మామిడి తోరణాలు,వీధంతా పసుపు నీళ్ళతో శుభ్రం చేయటం కనబడింది. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న ముగ్గులు, అలంకరణలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.

# గవర్నర్‌ను కలుసుకున్న రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ డా.డి.వి.జి శంకర రావు

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ డా.డి.వి.జి శంకర రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎస్టి కమిషన్ 2023-24 వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కమిషన్ షెడ్యూల్డ్ తెగల అభ్యున్నతి కొరకు నిరంతరం పాటుపడుతుందని తెలిపారు.వారి సంక్షేమం కొరకు అవసరమైన ప్రాంతాల్లో పర్యటనలు జరిపి ఆయా ప్రాంతాలలోని అధికారులకు అవసరమైన మేరకు సూచనలు ఇచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి కమిషన్ ఈ క్రింది విషయాలపై ప్రభుత్వానికి సూచనలు చేయడం జరిగిందని చెప్పారు. ముఖ్యంగా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు నంబరు (3) ను రద్దు చేయటం ద్వారా ప్రభావితమయ్యే షెడ్యూల్డ్ తెగల సామాజిక ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయటానికి ఒక సర్వే నిర్వహించాలని కోరారు. పెరుగుతున్న విద్యా సదుపాయాలు వలన షెడ్యూల్డ్ తెగలలో విద్యాధికులు అధికమవటమే కాకుండా నిరుద్యోగిత కూడా పెరుగుతోంది అందువలన బ్యాక్ లాగ్ పోస్టులు అన్నీ సత్వరమే గుర్తించి భర్తీ చేయాలని సూచించామని తెలిపారు. వీటికి అనుబంధం గా వృత్తి నైపుణ్యకేంద్రాలు ఏర్పాటు కూడా యువత అభివృద్ధికి దోహదాపుతుందని తెలుపుతూ సాంకేతిక విద్యార్హతలను పొందిన షెడ్యూల్డ్ తెగల యువత కేవలం ఉద్యోగాల పైనే ఆధార పడకుండా ఎంటర్ ప్రన్యూర్స్ గా ముందుకు రావాలని అటువంటి ఔత్సాహిక యువతకు పారిశ్రామిక రాయితీలు కలిపించి ప్రోత్సహించాలని సూచించామన్నారు. పారిశ్రామిక పార్కులను నందు కూడా నిర్ణీత కోటా ప్రకారం స్థలాలు కేటాయించాలని కోరామన్నారు.

# వ్యక్తి దారుణ హత్య

**నెల్లూరు క్రైమ్ ఏప్రిల్ 16 ప్రభాతవార్త : చిన్న** వివాదంతో క్షణికావేసానికి గురైన ఇద్దరు వ్యక్తులు మరొక వ్యక్తిని దారుణ హత్య చేసిన ఘటన బుధవారం రాత్రి నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక జాకీర్ హుస్సేన్ నగర్ కు చెందిన సుల్తాన్ (38), మద్యం తాగే సమయంలో అదే ప్రాంతానికి చెందిన కలీం, నాగరాజులతో ఘర్షణ ఏర్పడింది.

# వికసిత్ భారత్ సాధనలో గ్రామీణాంధ్రప్రదేశ్ పాత్ర కీలకం

### - ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ,ఏప్రిల్16,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామీణ ఆంధ్రప్రదేశ్ బలోపేతం దేశానికి అవసరమని ఏపీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు పవన్ కళ్యాణ్ అన్నారువికసిత్ భారత్ అనే మహా లక్ష్యంతో గ్రామీణాంధ్ర ప్రదేశ్ కీలకమన్నారు.. పంచాయతీల స్వయం ప్రతిపత్తి సాధన గమ్యంగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకు వెళ్తోంద్దని స్పష్టం చేశారు. గ్రామాల సమగ్రాభివృద్ధి ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం, వలసలు అరికట్టడం, ఆహార భద్రత వంటి లక్ష్యాల సాధన సాధ్యపడుతుందన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతంలో ఆర్థిక సంఘం సహకారం ఎంతో అవసరమని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను పర్యావరణహితంగా, ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఆర్థిక సంఘం సహాయ సహకారాలతో పని చేస్తామన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తామంతా కంకణబద్దులై ఉన్నట్టు తెలిపారు.

# రాజధాని అమరావతిలో రు.4688 కోట్లతో ఐదు టవర్ల నిర్మాణం

### టెండర్లు ఆహ్వానించిన సి ఆర్ డి ఏ

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 16 ప్రభాతవా ర్త** రాష్ట్ర రాజధాని అమరావతికి తలమానికం కానున్న ఐదు టవర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు బుధవారం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్ర సచివాలయం నిర్మాణంలో భాగంగా ఈ ఐదు టవర్లను నిర్మించేందుకు బుధవారం సి ఆర్ డి ఏ 4688.63 కోట్ల వ్యయంతో టెండర్లను పిలిచింది. హెచ్ ఓ డి ల కోసం జిఏడి టవర్ నిర్మాణానికి 1126.51 కోట్లతోటెండర్ పిలిచారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు హెచ్వోడీల కోసం మరో రెండు టవర్లను నిర్మించనున్నారు. ఈ 1,2 టవర్ల నిర్మాణానికి 1897.86 కోటతో టెండర్లు ఇక 3,4 టవర్లను 1664.45 కోటతో నిర్మించనున్నారు. ఈ ఐదు టవర్లు రాష్ట్ర సచివాలయానికి హైలెట్ గా నిలుస్తాయి. అమరావతి ప్రతిభ మించేలా ఈ 5 టవర్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక సంస్థల సాయంతో ఇప్పటికే ఆకృతులను రూపొందించి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, మెజారిటీ ప్రజల ఆకాంక్ష మెరికే ఈ 5 టవర్లను ఖరారు చేశారు. టెండర్లో పాల్గొనేందుకు మే 1 తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఇదే రోజున ఫైనాన్షియల్ ,టెక్నికల్ బిడ్ కూడా ఓపెన్ చేస్తారు. ఈ టవర్ల నిర్మాణానికి ఉపయోగించే మెటీరియల్ మొత్తం మూడేళ్ల పాటు ఏమాత్రం దెబ్బతిన్న గుత్తి దారే నిర్వహణ చేయాల్సి ఉంటుంది.

11 edt .qxd:17-04pg7exHMNWJQE.qxd 01/01/01 10:10 AM Page 1





బుధవారం తాళ్ల రాంపూర్ గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశ దృశ్యం

## గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

### 25న వేలాది మందితో చలో తాళ్లరాంపూర్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాం పూర్ గ్రామంలో గత ఆరు నెలలుగా కల్లుగీత కార్మికులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వీడీసీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గౌడ మహిళలను శ్రీరామనవమి సందర్భంగా గుడి నుండి గెంటివేసి, గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత చెట్లను కాల్చివేసిన దుర్మార్గులను తక్షణమే అరెస్టు చేయాలని, వీడీసీలను నిషేధించాలని బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి. రమణ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సామాజిక సంఘాలు డిమాండ్ చేశాయి.

ఈ సమావేశంలో కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, పి .ఆశయ్య, లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి వెంకట నరసయ్య, మల్లేశం, దశరథ్, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.వెంకన్న గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యెలికట్టె విజయకుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు జక్కే వీరస్వామి గౌడ్, జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్, జై గౌడసేన రాష్ట్ర అధ్యక్షులు మోర్ల ఏడు కొం డలు గౌడ్, సర్పంచుల ఫోరం సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, రజక వృత్తిదా రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నరేష్ , హైద రాబాద్ కార్యదర్శి మిర్యాల గోపాల్, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కొప్పు పద్మ, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## రేపటి నుంచి జిపిఓల విధివిధానాలపై సెమినార్‌లు

### తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేంద్రరావు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** గ్రామ పాలన ఆఫీసర్స్(జీపీఓ) విధులు బాధ్య తలు అనే అంశంపై (జీపీఓ లుగా రావడానికి ఆప్షన్ ఇచ్చిన వీఆర్వోలు, వీఆర్ ఏ లకు) అవగాహన కల్పించేందుకు వీలుగా ఈ నెల 19వ తేదీన ఖమ్మం వేదికగా ఖమ్మం భద్రాద్రి జిల్లాల వీఆర్వో వీఆర్ఏలకు ప్రత్యేక సెమినార్ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తరఫు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గరికె ఉపేం ద్రరావు, వి లక్ష్మీ ్మ నరసింహులు,అసోసియేట్ ప్రెసిడెంట్ కారుమూరి చంద్రయ్య, కోశాధికారి కోన బోయిన ప్రసాద్ వివరించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ సెమి నార్‌కు సంబంధించిన వివరాలను తెలిపారు. ఈనెల 18వ తేదీ నుండి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాకేంద్రాలలో గ్రామరెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈ సెమినార్లు నిర్వహించాలని పిలుపునిచ్చారు.




బుధవారం ధర్నాచౌక్ వద్ద ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య


## కాంట్రాక్టు టీచర్స్‌ని క్రమబద్ధీకరించాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్టంలోని 12 యూనివర్సిటీ లలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ ని రెగ్యులరైజేషన్ చేయాలనీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 12 యూనివర్సిటీ ల కాంట్రాక్టు టీచర్స్ మహా ధర్నా బుధవారం డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరుశురామ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్టంలో పన్నెండు వర్సిలలో దాదాపు 1200 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, వీరంతా దాదాపు 15 నుంచి 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని, వీరు చదువుచెప్పిన వారంతా రెగ్యులర్ అయ్యారని, వారంతా ప్రస్తుతం కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఉన్నారని, కాని వీరు మాత్రం రెగ్యులర్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను క్రమ బద్ధీకరించాలని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని, తీర్పును అనుసరించి సమానపనికి, సమాన వేతనం విధానాన్ని అనుసరించి రెగ్యులర్ వారికి ప్రస్తుతం రూ.1లక్ష పొందుతున్నారని, కాని కాంట్రాక్ట్ వారికి మాత్రం కేవలం రూ.30వేల లభిస్తోందని, ఇది చాలా అన్యాయమన్నారు. ఎమ్మెల్యే కూన మనేమిని సాంబశివరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ వ్యవస్థని రద్దుచేసి యూనివర్సిటీలలో ఉన్న కాంట్రాక్ట్ టీచర్లని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీధర్ బాబుతో మాట్లాడి యునివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్లని మేనిఫెస్టోలో పెట్టే విధంగా రెగ్యులరైజ్ చేయాలని కోరుతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ యూ నివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్లని రెగ్యులరైజ్ చేయడానికి యూజీసీ నిబంధనలను సడలించే విధంగా బిజెపి ప్రభుత్వాన్ని కోరుతానని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్ట్ టీచర్లను మోసం చేయడం వల్ల ప్రభుత్వం దిగిపోయిందని, ఇప్పుడున్న ప్రభుత్వం కూడా న్యాయం చేయకపోతే ప్రభుత్వము పడిపోతుం దన్నారు. శాసనమండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ గత ప్రభుత్వం జేఎల్‌డిఎల్ పాలిటెక్నిక్ కాలేజీలో పని చేస్తున్నటువంటి కాంట్రాక్ట్ టీచర్లని రెగ్యులరైజ్ చేయడం జరిగిందని, కానీ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్లని రెగ్యులరైజ్ చేయాలనుకునే సమయానికి ప్రభుత్వం దిగిపోయిందని, ఇప్పుడున్న ప్రభుత్వమైన వీళ్ళకి తక్షణమే రెగ్యులరైజేషన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ కో ఆర్డినేటర్ సభ్యులు డాక్టర్ ఎస్. విజయేందర్‌రెడ్డి డాక్టర్ ధర్మతేజ,డాక్టర్ పరుశరామ్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ తాళపల్లి వెంకటేష్, డాక్టర్ చిర్రరాజు, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సురేష్ నాయక్,డాక్టర్ దత్తహరి, డాక్టర్ నారాయణగుప్తా,డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ రేష్మా రెడ్డి, డాక్టర్ కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

## వినూత్నంగా భూతకాలం నాటకం

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** స్థానిక ఎల్‌విఆర్ ఆండ్ సన్స్ క్లబ్,రీడింగ్‌రూమ్,కొరిటేపాడు వేదికగా డాక్టర్ మురళీ మోహన్ 52 సంవత్సరాల కళారంగ ప్రస్థానం,గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి వైకే నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ సంయుక్తంగా ఏప్రిల్ 13 నుంచి 16వరకు నిర్వహిస్తున్న నాటకోత్సవాలో భాగంగా బుధవారం సాయం త్రం జరిగిన సభా కార్యక్రమంలో కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు, కన్వీనర్ గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి,కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, పిన్నమనేని మృత్యుంజరావు తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి వైకే నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల్పంచారు. అనంతరం మృత్యుంజయరావు మాటా ్లడుతూ నాటకరంగ విశేషాలను వివరించారు. అతిధులు, సంస్థల నిర్వాహకులు ప్రముఖ రంగస్థల నటులు మరియు జర్నలిస్ట్ ఫలతోటి జోసఫ్ ని తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా అభినందన సత్కారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర ్భంగా మాట్లాడుతూ డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకరంగానికిచేసిన సేవలుచిరస్మరణీయమన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాలొ ్గనటం ఆనందంగా ఉందన్నారు .కార్యక్రమాలను నిర్వహిస్తున్న కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్,లంక లక్ష్మీనారాయణ,బొప్పన నరసింహారావు లు అభినందనీయులన్నారు. అనంతరం మాఢభూషి దివాకరబాబు






రచించిన,డాక్టర్ గోవాడ వెంకట్ దర్శకత్వం వహించిన గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్‌వారి భూతకాం నాటకం డాక్టర్ రాధ సగిలి నిర్వహణలో ప్రదర్శితమైంది .కార్యక్రమంలో పాల్గొన్న జి.మల్లికార్జునరావు,డి.తిరుమలేశ్వరరావు..జానీ భాషాల నిర్వహణలో అతిధులను కళాకారులను సత్కరించారు.

# గద్దర్ అవార్డుల జ్యూరీ చైర్మన్‌గా నటి జయసుధ

### అన్ని కేటగిరీలకు 1,248 నామినేషన్లు అందాయి: ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు



**హైదరాబాద్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ చైర్మన్‌గా నటి జయసుధ నియమితులయ్యారు. అవార్డుల కోసం అందిన నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని జ్యూరీ చైర్మన్, సభ్యులను ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు కోరారు. జయసుధ అధ్యక్షతన గద్దర్ అవార్డ్స్ జ్యూరీ సమావేశం బుధవారం జరిగింది. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను ఛాలెంజ్ గా తీసుకుని ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుమాట్లాడుతూ తెలుగు చలన చిత్ర రంగానికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా వ్యవహరించాలని జ్యూరీ సభ్యులను కోరారు. జ్యూరిలో నిష్ణాతులైన వారిని ప్రభుత్వం నియమించిందన్నారు. 14ఏండ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డ్స్‌ను ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డ్స్ కు ఇంత స్పందన రాలేదన్నారు.స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా వ్యవహరించాలని జ్యూరీ సభ్యులను కోరారు. జ్యూరిలో నిష్ణాతులైన వారిని ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. 14 ఏండ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డ్స్ ను ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డ్స్ కు ఇంత స్పందన రాలేదని చెప్పారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎస్. హరీష్ మాట్లాడుతూ సినీనటి జయసుధ చైర్మన్‌గా 15 మందితో గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరిని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గద్దర్ అవార్డ్స్ కు అన్ని కేటగిరీ లకు కలిపి 1,248 నామినేషన్లు అందినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ నుండి నామినేషన్ల స్క్రీనింగ్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఈ గద్దర్ అవార్డులకు గాను వివిధ క్యాటగిరిల ఎంట్రీలుగాను వచ్చిన నామినేషన్ల స్క్రీనింగ్ ప్రక్రియ గురించి సభ్యులు చర్చించారు. ఈ పురస్కారాలకు వ్యక్తిగత క్యాటగిరిలో 1172 దరఖాస్తులు, ఫీచర్ ఫిలిం, బాలల చిత్రాలు, డెబిట్ చిత్రాలు, డాక్యుమెంటరీ/ లఘుచిత్రాలు, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర క్యాటగిరిలలో 76 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

# ఆరు గ్యారంటీల అమలులో నిర్లక్ష్యం

### బిఆర్ఎస్ విజయోత్సవ సభకు భారీగా తరలిరావాలి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** ఆరు గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ బిజెపి పార్టీలను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా బిఆర్ఎస్ కార్యకర్తలతో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బెదిరించడం ప్రజలు మోసం చేయడం తప్ప తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ వాళ్లకు బెదిరింపులు, మోసం చేయడం కొత్త కాదు. తెలంగాణ ఇస్తాని చెప్పి 2004లో మోసం చేసిన కాంగ్రెస్, ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసం చేస్తోంది అన్నారు. ఉచిత బస్సు ఇచ్చామని చెబుతున్న కాంగ్రెస్ మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నదనీ, ఉచిత బస్సు సౌకర్యాన్ని ఇచ్చి బస్సుల సంఖ్య పెంచకపోవడం



వల్ల సీట్లు దొరకని పరిస్థితి నెలకొందనీ మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సు ఇచ్చాం కానీ బంగారం మాత్రం ఇవ్వమని రేవంత్ రెడ్డి అనడం ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారు. జగిత్యాలకు నిధులు తీసుకురావడంతో ఎమ్మెల్యే సంజయ్ విఫలం అయ్యారని పేర్కొన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు చేశామని కేసీఆర్ దీక్షతో తెలంగాణ సాధించుకున్నామన్నారు, మాజీ మంత్రి రాజేశం గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణ ప్రజలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. మాజి జెడ్పి చైర్మన్ దావా వసంత సురేష్ మాట్లాడుతూ నూతన రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని కవితక్క నాయకత్వంలో జగిత్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.ఈనెల 27 నిర్వహించే బీఆర్ఎస్ రజతో త్సవ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పేర్కొన్నారు. సమావేశ అనంతరం కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డు సమీపంలో ఈనెల27 జరిగే బి ఆర్ ఎస్ రజతోత్సవ సభ వాల్ రైటింగ్ వేసిన ఎమ్మెల్సీ కవిత .ఈ సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు కొరుగంటి రమణారావు, బాబు రెడ్డి గట్టు సతీష్, వల్లెం మల్లేశం, వెంకటేశ్వరరావు, ఇతర పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టు: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్16:** కంచ గచ్చిబౌలి విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను మాజీ మంత్రి హరీష్‌రావుస్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైందని వ్యాఖ్యానించారు. బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు అని చెప్పారు. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ తన రిపోర్టుతో కళ్లు తెరిపించిందని చెప్పారు. అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైందని తెలిపారు. ఈరోజు కూడా అదే జరిగింది. విధ్వంసమే విధానంగా సాగుతున్నది రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన, నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం. నేడు బుల్‌డోజర్లతో పర్యావరణ హననంఅని పేర్కొన్నారు. మాకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉంది. అందుకే బాధ్యతగా బిఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి నివేదిక ఇచ్చాం. ఆధారాలతో సహా వాస్తవాలు వివరించామని చెప్పారు. వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లుగా తయారైన రేవంత్‌కు బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.

**మిషన్ భగీరథ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం**

మిషన్ భగీరథ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని. నల్లాల ద్వారా నీళ్ళు సరఫరా చేయడం లేదని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇన్నాళ్లు సాగు నీళ్ల కోసం రైతుల గోస.. ఇప్పుడు తాగు నీళ్ల కోసం ప్రజల ఘోష అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి, మంత్రులు అబద్దాల ప్రవాహాన్ని పారించడం మానేసి, ప్రజల ఇళ్లకు తాగు నీటిని పారించాలని సూచిస్తున్నా మన్నారు.

## రూ.40 లక్షల విలువ చేసే డ్రగ్స్, వాహనం స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 16 ,ప్రభాతవార్త :** అమెరికా ప్రాం తాల నుంచి ఇండియాకు దిగుమతి బెంగళూరు నుంచి హైదరాబాద్ రవాణా పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.40 లక్షలు. అమెరికాలోని ఫ్లోరిడా,క్యాలీఫోర్నియాలో పండించే ఓజీ కుష్ అనే డ్రగ్స్‌తోపాటు ఇతర డ్రగ్స్‌ను, విదేశీ మద్యం బాటిళ్లను ఎస్‌టిఎఫ్ బి టీమ్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు.డ్రగ్స్‌తోపాటు స్కోడా కారు గంజాయి, హషిష్ సింథాటిక్ డ్రగ్స్, చరస్ డ్రగ్స్‌ను ఎస్టిఎఫ్ బిటీమ్ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. బుధవారం ఎక్సైజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టుకున్న డ్రగ్స్‌ను,నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు.కారు, డ్రగ్స్‌విలువ రూ.40 లక్షలుగా ఉంటుందని జాయింట్ కమిషనర్ ఖురేషి వెల్లడించారు. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం 2 గంటల ప్రాంతంలో బి టీమ్ ఎస్సై సంధ్యా బృందం ఈ డ్రగ్స్‌ను పట్టుకున్నారని తెలిపారు.కాచిగూడ రైల్వే స్టేషన్ అనుమానంగా ఒక వ్యక్తి 2బెక్, స్కోడా కారులో మరో వ్యక్తి ఓ కుష్‌ను మార్పిడి చేసుకునే సమయంలో ఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు.కారులో తనిఖీలు నిర్వహించగా 500 గ్రాముల ఓజీ కుష్‌ఒక కేజీ గంజాయి, 6 గ్రాముల చరస్, 4.38 గ్రాముల హాషీష్ సింథాటిక్ డ్రగ్స్‌తోపాటు ఐదు వీదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులు ప్రతిష్ బట్, జై సూర్యలను అరెస్టు చేసినట్లు ఖురేషి తెలిపారు.ఖరేషితోపాటు ఎస్‌టిఎఫ్ బి టీమ్ లీడర్ ప్రదీప్‌రావుతోపాటు సిఐ బిక్షారెడ్డి,ఎస్ఐ బాలరాజులతో ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటి సభ్యునిగా శ్రీనివాసరావు

**పిడుగురాళ్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్తః** దక్షిణ మధ్య రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటి (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యునిగా పిడుగురాళ్లకు చెందిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, పిడుగురాళ్ల రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల



మేరకు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లోని ప్రధాన కార్యాలయం రైల్వే నిలయం నుంచి డీజీఎం(జి), జెడ్ఆర్‌యూసీసీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక నాలుగు రాష్ట్రాలలో విస్తీర్ణం కలిగిన దక్షిణ మధ్య రైల్వే జోనల్ పరిధిలోని రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పనకు, రైల్వే స్టేషన్లో ఆగని రైళ్ల నిలుపుదల కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, తన నియామకానికి కృషి చేసిన రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్, తెలుగు రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులకు, రైల్వే ఉన్నతాధికారులకు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో యేళ్లుగా రైల్వే ప్రయాణికుల సౌకర్యాల కోసం కృషి చేస్తున్న శ్రీనివాసరావు నాలుగు రాష్ట్రాల పరిధిలోని రైల్వే ప్రయాణికులకు సేవలందించే నియమితులవడం సంతోషకరమని రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు, పట్టణ ప్రముఖులు, ఉన్నతాధికారులు, రైల్వే ప్రయాణికులు అభినందనలు తెలిపారు.

## అగ్నిమాపక వారోత్సవాలు

**పిడుగురాళ్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్తః** పట్టణంలోని కళ్లం టౌన్‌షిప్‌లో గల బాలాజీ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. గ్యాస్, ఎలక్ట్రికల్ ఫైర్స్‌పై అధికారులు కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒకరినొకరు రక్షించుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి కె శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరెడ్డి, పీవీ సుబ్బారావు, ఎస్‌కె బాద్‌షా, పిచ్చయ్య, వెంకటేశ్వర్లునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీతమ్మసాగర్‌కి అడుగడుగునా ఆటంకాలే

### నాడు హైకోర్టులో ఎదురుదెబ్బ
### తొలి ఫేజ్ భూసేకరణే చెల్లదన్న న్యాయస్థానం
### 'పెసా' నిబంధనలు గాలికొదిలారని వ్యాఖ్య
### ప్రభుత్వ ప్రొసీడింగ్ కొట్టివేత
### సీతారామాలిఫ్ట్ మీదా ఈ ప్రభావం
### హైడల్‌పవర్ ఉత్పత్తి కానప్పుడు మనుగడ సాగేదెట్లా



**అశ్వారావుపేట:ప్రభాతవార్త:** సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్-సీతమ్మసాగర్ బహుళార్ధక సాధక ప్రాజెక్ట్ ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గడచిన ఏడెనిమిదేళ్ళుగా మార్మోగుతున్న ప్రతిష్ఠాత్మక సాగు నీటి ప్రాజెక్టులు. గత ప్రభుత్వం వీటికోసం చేసిన ప్రచారం అంతా ఇంతా కాదు. కదిలినా మెదిలినా సిఎం కార్యదర్శి స్మితాసబర్వాల్ హెలికాప్టర్‌కి రెక్కలు తగిలించుకుని సైట్‌లో వాలిపోయేవారు. అధికారుల హడావిడి.,సమీక్షలు.,ఇదంతా చూస్తే., నిజంగా ఈ ప్రాజెక్ట్‌లు కూడు పెట్టడం ఖాయమేనేమో అనే అనుమానం కూడా ఒక్కోసారి కలిగేది. కానీ కాలం కరిగి ఆ హంగులన్నీ గాల్లో కలిసినట్లే.,వీటిమీద సగటు పౌరుడు పెట్టుకున్న ఆశలూ ఆవిరైపోతున్నాయి. ఈ నిర్మాణాల విషయంలో ఇరిగేషన్ అనుసరించిన క్షమించరాని నిర్లక్ష్యాన్ని చూస్తున్నప్పుడు వీటి భవిష్యత్తు మీద భయం పట్టుకుంటున్నది. ఈరెంటికీ కలిపి ఏకంగా రూ.16వేల510 కోట్ల గ్రాంటు (పూర్వపు ఇందిరాసాగర్-రాజీవ్‌సాగర్‌ల మంజూరు). ప్రస్తుత శాంక్షన్లలో చాలా భాగం పేమెంట్లు కూడా చెల్లించేసినట్లు తాజా డిక్లరేషన్ చెబుతున్నది. పనులు ఆలస్యమయ్యేకొద్దీ ఇంకెన్ని కోట్లు హారతి ఇవ్వాలో దానికో లెక్కాపత్రం లేదనేది ఒక అంశం కాగా.,ఖర్చు చూపిన దాంట్లో కూడా భారీ అవినీతి జరిగిందని రాష్ట్ర నీటిపారుదల మంత్రే ఆరోపించడం చూస్తుంటే ఈ పనులు ముందుకెళతాయా అనిపిస్తుంది. అవినీతి భాగోతాల సంగతిని కాస్త పక్కన పెడదాం. ఇంతటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లకు సంబంధించిన "భూసేకరణ" విషయంలో ప్రాథమిక దశలోనే అధికారులది ఎంతటి నిర్లక్ష్యమో ఈ అంశాన్ని ఇప్పటికే గతంలో వెల్లడించడం జరిగింది. కాగా ఇప్పుడు తిరిగి ఈరెండు ప్రాజెక్ట్‌ల ప్రస్తావన "ముల్కలపల్లి ఉదంతంతో" రాష్ట్రస్థాయిలో నలుగుతున్న క్రమంలో మరొక్కసారి సింహావలోకనం చేసుకుందాం.

**హైకోర్టులో ఇరిగేషన్‌కి ఎదురు దెబ్బ:** సీతమ్మ సాగర్ బహుళార్ధ సాధక ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణాని కోసం అశ్వాపురం మండలంలోని అమ్మగారిపల్లె-అశ్వాపురం- కొమ్ముగూడెం- తదితర గ్రామాల పరిధిలో 2021 సంవత్సరంలో భూసేకరణ మొదలెట్టింది. 21 మంది రైతులనుంచి 60 ఎకరాలకు పైగా ల్యాండ్ ఎక్వయిర్ చేసేందుకు గాను "ఆర్‌సినెంబర్: సి/985/2020-2021 తేది: 20.04.2021 ద్వారా" అవార్డ్ నిమిత్తం ప్రొసీడింగ్ ఇచ్చారు. కాగా "పెసాచట్టం-1996" నిబంధనలకు విరుద్ధంగా ఈ భూసేకరణ ప్రక్రియ ఉన్నదని, రిట్ పిటిషన్ నెంబర్లు: 14653-14664/2021 ల ద్వారా తెలంగాణా హైకోర్టుని రైతులు ఆశ్రయించారు. నిజానికి 2013 జాతీయ భూసేకరణ చట్టంలోని అండర్ సబ్‌సెక్షన్ (3) సెక్షన్ 41ఆఫ్ ది ల్యాండ్ ఎక్విజేషన్ ఏక్ట్-2013 ప్రకారం., అండర్‌సెక్షన్ 11(1) లో గిరిజన ప్రాంతాల్లో ఏదేని భూసేకరణ కోసం ప్రిలిమినరీ నోటీస్ ఇచ్చేముందర "పెసాచట్టం-1996" నిబంధనలు పాటించాలని ఆ రిట్‌లో పిటిషనర్లు పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా పెసా గ్రామసభలేవీ నిర్వహించకుండానే.,ఆయా సభల తీర్మానాల తంతుని గాలికొదిలి భూసేకరణ ప్రక్రియకి పూనుకున్నారని బాధితులు న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ ప్రస్తావనే ఎక్కడా లేకుండా మొదలెట్టిన ఈ కార్యక్రమం చట్టరీత్యా చెల్లదని వాదించారు. దీనిపై ప్రతివాదులైన ప్రభుత్వ యంత్రాంగం తగిన ఆధారాలు చూపించలేకపోవడంతో.,హైకోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పుచెప్పింది. నిబంధనలను పాటించనందున ప్రభు త్వం జారీచేసిన "ఆర్‌సి నెంబర్: సి/985/2020-2021 తేది: 20.04.2021" ప్రొసీడింగ్‌ని న్యాయస్థానం 15.03.2023 తేదీన పక్కన పెట్టేసింది (సెటెసైడ్). ఇప్పుడు చెప్పండి., ఇంత గొప్పలు చెప్పుకు తిరిగిన నీటిపారుదల విభాగం ఈ చిన్న విషయంలోనే ఎంత తప్పుటడుగు వేసిందో తాజా పర్యవసానం ప్రస్ఫుటం చేస్తున్నది

**తీర్పు తర్వాత ఏం జరిగిందో?:** హైకోర్టు తీర్పు తర్వాత పర్యవసానాలేంటో ఇప్పటికీ తెలియడం లేదు. సంబంధిత యంత్రాంగం వద్ద సమాచారం లేదు. నీటిపారుదల శాఖ వారు అప్పీల్‌కి వెళ్ళారా లేక తీర్పుని యదాతథంగా అమలు చేసేందుకు పూనుకుని సమస్యని పరిష్కరించారా అనేది సందిగ్ధం. జడ్జిమెంట్ 15.09.2023 తేదీన వచ్చింది కాబట్టి దాదాపు ఏణార్థం పూర్తయిన ప్రస్తుత స్థితిలో ఆ రెండు రిట్ల ద్వారా కక్షిదారులు పొందిన ప్రయోజనాన్ని అధికారులు వెల్లడించాల్సిందే. ఒకవేళ మంచే జరిగి సీతమ్మసాగర్ బరేజ్ ప్రగతి ఆటంకాల్లేకుండా ముందుకు వెళితే అంతకన్నా కావలసింది ఏముంటుంది.

**అడుగడుగునా తడబాట్లే :**ఇవి బ్రహ్మాండం బద్దలయ్యే సాగునీటి ప్రాజెక్ట్‌లని సర్కార్ చెప్పుకోవడం ఏమాత్రం తప్పుకాదు. మరి తదనుగుణమైన సంకల్ప సిద్ధికూడా కావాలి కదా. కానీ చిత్తశుద్ధి ఎక్కడా మనకు కనిపించదు. ప్రధానమైన భూసేకరణ విషయంలోనే ఇంకాస్త ముందుకెళ్ళి చూస్తే యంత్రాంగపు పోకడలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. మచ్చుకి కొన్ని సంఘట నలను గమనిద్దాం. 17.07.2020 తేదీన నాటి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితాస బర్వాల్ ఇరిగేషన్ ముఖ్యకార్యదర్శి రజిత్‌కు మార్‌లు అశ్వాపురం వచ్చి ఉన్నతస్థాయి సమీక్ష ఏర్పాటు చేశారు. కలెక్టర్లు-సంయుక్త కలెక్టర్లు- ఆర్‌డిఓలు-తహశీల్దార్లు-అబ్బో ఉరుకులు పరుగులు పెట్టారు. హడావిడికి కొదవలేదు. ఈ మీటింగ్‌లో తేల్చింది ఏమంటే.,"పక్షంరోజుల్లో అంటే పదిహేనురోజుల్లో" భూసేకరణ సర్వే పూర్తయిపోవాలని హుకుం జారీ చేశారు. ఆ గడువు ముగిసిపోయి తదుపరి 21.05.2021 తేదీన అంటే 10 నెల్ల తర్వాత నాటి జిల్లా కలెక్టర్ ఎంవి.రెడ్డి 3500 ఎకరాల భూసేకరణ కోసం రెండవ రివ్యూ నిర్వహించారు. అశ్వాపురం మం డలంలో 339 ఎకరాలు, మణుగూరులో 610, దుమ్ముగూడెంలో 726, చర్లలో 1446 ఎకరాల భూమిని సేకరించేందుకు ఆయన పలు సూచనలు చేశారు. ఆ తర్వాత మళ్ళీ 12.01.2022 తేదీన అంటే రెండో సమీక్ష తరువాత 8నెల్లకి అప్పటి కలెక్టర్ అనుదీప్ దీనిపై సమావేశమై అటవీ భూముల రీఎంబర్స్‌మెంట్ స్పీడప్ చేయాలని ఆదేశించారు. ఇలాంటి ఉన్నతస్థాయి మీటిం గులెన్ని పెట్టినా., చివరికి ఎక్కడైతే గోదావరి నదివద్ద హెడ్‌వర్కుల కోసం ఉద్దేశింపబడిన ప్రాంతమున్నదో.,ఆ భూమిని సేకరించే ప్రక్రియలోనే అధికార యంత్రాంగం తప్పులో కాలేయడంతో ఇంతటి ఉన్నతస్థాయి సమీక్షలు సైతం ఈ చిన్న పనులను కూడా చేసుకోలేక చతికిల పడినట్లయింది.

17-4pg10.qxd:17-4pg10.qxd 01/01/01 7:46 AM Page 1



## మహిళల గ్రాండ్‌ప్రిక్స్‌లో..
# రెండో రోజూ దివ్య విజయ పరంపర



**న్యూఢిల్లీ:** పూణేలో జరిగిన ఎఫ్ఐడిఇ మహిళల గ్రాండ్ ప్రిక్స్‌లో రెండో రోజు ఐఎం దివ్య దేశ్‌ముఖ్ తన విజయ పరంపరను కొనసాగించింది. దివ్య మరియు చైనాకు చెందిన ఝు జైనర్ మాత్రమే నిర్ణయాత్మక మ్యాచ్‌లకు అర్హత సాధించారు. ఐదు ఆటల్లో మూడు డ్రాగా ముగిశాయి. గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తమ ప్రత్యర్థులతో ఆడిన మ్యాచ్‌లో డ్రాగా ముగించారు. ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలిచిన హంపి, జార్జియా గ్రాండ్ మాస్టర్ మెలియా సలోమ్‌ను ఓడించగా, హారిక ఐఎమ్ అలీనా కాష్లిన్‌స్కయాతో డ్రాగా ముగించారు. తెల్ల పావులతో ఆడుతున్న దివ్య, గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్ బాబుపై విజయం సాధించడానికి కేవలం 26 ఎత్తుగడలు మాత్రమే అవసరం అయింది. మొత్తం భారతదేశ పోటీలో, దివ్య దూకుడుగా ఆడింది. 17వ మూవ్ నుండి 22వ మూవ్ వరకు వైశాలిపై ఒత్తిడి తెచ్చింది. డబ్ల్యూజిపి సిరీస్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారు ఎఫ్ఐడిఇ ఉమెన్ క్యాండిడేట్స్ టోర్నమెంట్ 2026కి చేరుకుంటారు. ఇప్పటివరకు, రష్యాకు చెందిన అలెగ్జాండ్రా గోరియాచ్కినా 308 పాయింట్లతో గ్రాండ్ ప్రిక్స్ స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో ఉంది. పోటీలో ఉన్న భారతీయులలో, హంపి మహిళల గ్రాండ్ ప్రిక్స్ స్టాండింగ్స్‌లో రెండు ఈవెంట్ల నుండి 161 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. హారిక (12వ స్థానం), దివ్య (14వ స్థానం) మరియు వైశాలి (18వ స్థానం) కూడా తమ ర్యాంకింగ్‌ను మెరుగుపరచుకోవడానికి పాయింట్లు సేకరించాలని చూస్తున్నారు.

## ఆస్ట్రేలియా పర్యటనకు భారత్ హాకీ
# అమ్మాయిల టీమ్ ఖరారు



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాలో పర్యటించేందుకు గాను భారత్ మహిళల హాకీ జట్టు ఖరారైంది. ఈ నెల 21 నుండి జరగనున్న ఈ మ్యాచ్‌కు 26 మంది సభ్యులతో కూడిన భారత్ బృందానికి సలీమా టెటె కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ జట్టులో తొలిసారి కొత్తగా ఐదుగురు ఆటగాళ్లకు చోటు దొరికింది. వీరిలో జ్యోతి సింగ్, సుజాత కుజూర్, అజ్మీనా కుజూర్, పూజా యాదవ్, మమిమా టెటె తొలిసారి భారత్ సీనియర్ హాకీ జట్టులోకి వచ్చారు.. బన్సారి సోలంకి, అంజన దుంగేడుంగ్, లాల్ థంట్లాంగే, సాక్షి శుక్లా, ఖైదెమ్ షిలీమ్ చాను, దీపి మోనికా టొప్పో, సోనమ్‌లను స్టాండ్ బై ప్లేయర్లుగా ఎంపికయ్యారు. ఈ నెల 21 నుండి మే 4వ తేదీ వరకూ జరిగే ఈ టోర్నమెంట్‌లో భారత్ జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. ఇక భారత్ మహిళల హాకీ జట్టులో సలీమా టెటె (కెప్టెన్), సవితా పూనియా, బిచ్చూ దేవి ఖరబమ్ (గోల్ కీపర్లు), జ్యోతి సింగ్, ఇషికా చౌదరి, సుశీలా చాను, సుజాత కుజూర్, సుమన్ దేవి తోడమ్, జ్యోతి, అజ్మీరా కుజూర్, సాక్షి రాణా (డిఫెండర్లు), వైష్ణవి ఫాలేక, నేహా, షర్మిలా దేవి, మనీషా చౌహాన్ సునెలిటా టొప్పో, మహిమా టెటె, పూజా యాదవ్, లాల్‌రెమ్‌సియామి (మిడ్ ఫీల్డర్లు), నవ్‌నీత్ కౌర్, దీపికి, రుతుజా పిసాల్, ముంతాజ్ ఖాన్, బల్జీత్ కౌర్, దీపిక సొరెంగ్, బ్యూటీ డుంగ్‌డుంగ్‌లు ఉన్నారు.

## కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు
# క్రాస్టో-కపిల జోడీ
### పడిపోయిన సింధు, లక్ష్యసేన్

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ర్యాంకింగ్స్‌లో భారత్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ బెస్ట్ ర్యాంకుకు దూసుకొచ్చింది. ఫెడరేషన్ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట కెరీర్‌లో అత్యుత్తమ 17వ స్థానానికి ఎగబాకింది. గత వారం జరిగిన 2025 బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో క్రాస్టో మరియు కపిల క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న తర్వాత ఈ పరిణామం జరిగింది. దీంతో ఈ జంట తమ స్థానాన్ని ఒక స్థానం మెరుగు పరుచుకుని ఇప్పుడు 13 టోర్నమెంట్లలో 46,229 పాయింట్లతో ఉన్నారు. మరోవైపు గాయాల కారణంగా బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌కు దూరమైన భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తాజా ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం పడిపోయారు. ట్రీసా-గాయత్రి ప్రపంచంలో 10వ స్థానంలో ఉండగా, సాత్విక్-చిరాగ్ ఇప్పుడు 11వ స్థానంలో ఉన్నారు. ఇక సింగిల్స్‌లో టాప్ 10లో భారత్ ప్లేయర్లు ఎవరూ లేకపోవడంతో, ప్రపంచంలో టాప్ 10లో స్థానం సంపాదించిన ఏకైక షట్లర్లుగా ట్రీసా-గాయత్రి జోడీ రికార్డు సాధించారు. నిజానికి, మొదటిసారి భారతదేశంలో అత్యధిక ర్యాంక్ పొందిన ముగ్గురు షట్లర్లు డబుల్స్‌లోనే ఉన్నారు. కాగా దేశం నుండి అత్యధిక ర్యాంక్ పొందిన సింగిల్స్ షట్లర్లు లక్ష్య సేన్ మరియు పివి సింధు, ఇద్దరూ పురుషులు మరియు మహిళల విభాగాలలో వరుసగా 18వ స్థానంలో ఉన్నారు. 2025 బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో సేన్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించడంతో రెండు స్థానాలు పడిపోయగా, రెండవ రౌండ్‌కు చేరుకున్న తర్వాత సింధు ఒక స్థానాన్ని వదులుకుంది. హెచ్ఎస్ ప్రణయ్ కూడా ఒక స్థానం దిగజారి ఇప్పుడు పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ ర్యాంక్ 30లో ఉన్నాడు. అయితే యువ ప్రియాంషు రాజవత్ మరియు కిరణ్ జార్జ్ పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో సానుకూల పురోగతి సాధించారు. రాజావత్ రెండు స్థానాలు ఎగబాకి 36వ స్థానంలో ఉండగా, కిరణ్ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఇప్పుడు 35వ స్థానంలో ఉన్నాడు.






# మారిన ఆట
## రికార్డులు తారుమారు
### ఐపిఎల్‌లో టాపర్స్ ఛేంజింగ్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18 సీజన్ రసవత్తరంగా సాగుతోంది. ఎవరూ ఊహించని జట్లు ఈ సీజన్‌లో దూసుకుపోతున్నాయి. ఐపీఎల్‌లో ఇప్పటి వరకూ ఐదు స్లార్లు ట్రోఫీ నెగ్గిన టీమ్స్ మాత్రం ఐపీఎల్ టేబుల్‌లో చివరికి చేరాయి. ఆయితే తాజాగా జరిగిన మ్యాచ్‌తో ఐపీఎల్ టాపర్స్ లిస్ట్‌లో పెనుమార్పులు వచ్చాయి. ఐపీఎల్ 2025లో నిన్నటి వరకు జరిగిన మ్యాచ్‌ల ప్రకారం చూసుకుంటే అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో కొత్త ప్లేయర్స్ వచ్చి చేరారు. దీంతో పాటు ఎక్కువ పరుగులు, ఎక్కువ సిక్సర్స్, ఫోర్స్ కొట్టిన వారి జాబితాలో కూడా మార్పులు వచ్చాయి. అటువంటి వాటిలో ఐపీఎల్ 2025లో ఎక్కువ రన్స్ చేసిన వారి జాబితాలో ప్రస్తుతం లక్నో ప్లేయర్ నికోలస్ పురాన్ టాప్ రన్ స్కోరర్‌గా ఉన్నారు. 6 మ్యాచ్‌లలో 349 రన్స్, 215.43 స్ట్రైక్ రేట్‌లో టాప్‌లో ఉన్నాడు. అతని స్థిరమైన బ్యాటింగ్, కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 బంతుల్లో 87 చేసి నాటౌట్‌గా నిలవడం అతన్ని ఆరెంజ్ క్యాప్ రేసులో ముందంజలో ఉంచింది. ఇక 329 పరుగులతో గుజరాత్ టైటాన్స్ ప్లేయర్ సాయి సుదర్శన్ రెండో ప్లేస్‌లో ఉన్నాడు. ఇక 265 పరుగులతో లక్నో ప్లేయర్ మిచెల్‌మార్ష్ 3వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఆ తర్వాతి ర్యాంకుల్లో సన్‌రైజర్స్ ప్లేయర్ హెడ్ ఉండగా, తాజా మ్యాచ్‌లో పంజాబ్‌పై 40 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ అభిషేక్ శర్మ రన్‌స్కోరర్స్ లిస్ట్‌లో పైకి దూసుకొచ్చాడు. ఇక ఈ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన వారి జీబితా చూసుకుంటే ఐపీఎల్ పాయింట్ల పట్టికలో లాస్ట్ ప్లేస్‌లో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ నూర్ అహ్మద్ ఎక్కువ వికెట్లు తీసిన జాబితాలో మాత్రం ముందున్నాడు. ఈ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచుల్లో 12 వికెట్లు తీసిన నూర్ అహ్మద్ టాప్ ప్లేస్‌లోకి వచ్చాడు. తర్వాత 11 వికెట్లతో లక్నో ప్లేయర్ శార్దూల్ ఠాకూర్ రెండో ప్లేస్‌లో ఉండగా, 10 వికెట్లతో గుజరాత్ ప్లేయర్ ప్రదీప్ కృష్ణ 3వ స్థానంలో ఉన్నాడు. కాగా ఈ సీజన్‌లో అత్యధిక సిక్సర్ కొట్టిన జాబితాను చూసుకుంటే ఇందులోనూ టాప్ స్కోరర్ నికోలస్ పూరన్ ఏ టాప్‌లో ఉన్నాడు. ఈ సీజన్ మొత్తం పూరన్ 31 సిక్సర్లు కొట్టాడు. ఇక రెండో ప్లేస్‌లో పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ఉన్నాడు.

ఇతను ఈ సీజన్ మొత్తంలో ఇప్పటి వరకు 20 సిక్సర్స్ కొట్టాడు. ఆ తర్వాత స్థానంలో 15 సిక్సర్లతో లక్నో ప్లేయర్ మిచేల్ మార్ష్ ఉన్నాడు. ఇక ఐపీఎల్ 2025లో ఎక్కువ బౌండరీలు కొట్టిన వారి జాబితా చూసుకుంటే. ఈ కేటగిరీలో గుజరాత్ ప్లేయర్ సాయి సుదర్శన్ టాప్‌లో ఉన్నారు. ఇతను ఈ సీజన్ మొత్తంలో 31 బౌండరీలు కొట్టాడు. ఆ తర్వాత 30 బౌండరీలతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు చెందిన ట్రావిస్ హెడ్ రెండో ప్లేస్ లో ఉన్నాడు. ఇక 28 బౌండరీలతో లక్నో ప్లేయర్ మిచేల్ మార్ష్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.

## వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయింగ్‌లో..
# బంగ్లా హ్యాట్రిక్ విజయం
### 34 పరుగుల తేడాతో స్కాట్లాండ్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ జట్టు హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. లాహోర్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన పోరులో బంగ్లాదేశ్ 34 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 276 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, కెప్టెన్ నిగార్ సుల్తానా 59 బంతుల్లో 83 పరుగులు, 11 ఫోర్లుతో అజేయ అర్థ శతకం చేసి



ఆకట్టుకుంది. ఇక మిగిలిన బ్యాటర్లు ఫర్జాన 57 పరుగులు, 6 ఫోర్లు, షర్మిన్ అక్తర్ 57 పరుగులు, 7 ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీలతో పరుగుల వరద పారించారు. స్కాట్లాండ్ బౌలర్లలో క్యాథరిన్ బ్రైస్ 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం 277 పరుగుల లక్ష్య ఛేదనలో స్కాట్లాండ్ మహిళల జట్టు పట్టుదలతో పోరాట పటిమను ప్రదర్శించింది. అయినా ఓటమి తప్పలేదు. స్కాట్లాండ్ మహిళల జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 242 పరుగులకే పరిమితమై ఆటను ముగించింది. ప్రియనాజ్ 63 బంతుల్లో 61 పరుగులు, 7 ఫోర్లు, రాచెల్ 73 బంతుల్లో 61 పరుగులు, 5 ఫోర్లుతో నాటౌట్‌గా రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నహిదా 4 వికెట్లు, జన్నతుల్ 2 వికెట్లు తీశారు. కాగా.ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బంగ్లాదేశ్ 6 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇదే టోర్నమెంట్‌కు సంబంధించి జరిగిన మరో మ్యాచ్‌లో ఐర్లాండ్ 46 పరుగుల తేడాతో థాయ్‌లాండ్ జట్టుపై గెలుపొందింది.

## వాణిజ్యం

# చైనాపై 245% అమెరికా సుంకాలు!

**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** అమెరికా-చైనా మధ్య వాణిజ్యపరంగా తీవ్రస్థాయి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ తరుణంలో చైనాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై యూఎస్ సుంకాలను 245 శాతం పెంచే అవకాశాలున్నట్లు వార్తలు వస్తున్నాయి. చైనా ప్రతీకార చర్యల ఫలితంగా ఆ దేశ ఉత్పత్తులు ఆ స్థాయి వరకు సుంకాన్ని ఎదుర్కో వచ్చని వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌ను ఉటంకించాయి. అయితే ఇంత భారీగా టారిఫ్‌ల పెంపు ఉన్నప్పుడు ట్రంప్ మీడియా ఎదుట ప్రకటన చేస్తుంటారు. అయితే ఈసారి అలాంటి హడావుడి ఏదీ కనిపించలేదు. అమెరికా 145 శాతం నుంచి 245 శాతానికి నిజంగానే సుంకాలు పెంచిందా లేక టైపింగ్ తప్పిదమా..? పలువురు నెటిజన్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వస్తోన్న వార్తలపై డ్రాగన్ స్పందించింది. అసలు సుంకాలు ఎంత అనే విషయాన్ని అమెరికానే అడగాలని విదేశాంగ శాఖ కౌంటర్ ఇచ్చింది. వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరు. మా దేశం ఇలాంటి యుద్ధాలు చేయాలని కోరుకోవడం లేదు. అలాగే వాటికి భయపడటం లేదు అని తేల్చిచెప్పింది. ఇప్పటికే అమెరికా నుంచి దిగుమతి అవుతోన్న ఉత్పత్తులపై చైనా 125 శాతం సుంకం విధించిన సంగతి తెలిసిందే. ఇకనుంచి యూఎస్ వేసే టారిఫ్‌లను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసిన విషయం విదితమే. ఇదంతా ఒకనంబర్ గేమ్‌గా అభి వర్ణించిన చైనా.. ఈ తతంగమంతాఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెప్పింది.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన మన సూచీలు.. తర్వాత రాణించాయి. బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించాయి. దేశీయంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠానికి చేరడంతో ముమ్ముందు ఆర్‌బీఐ రెపో రేటును మరింత తగ్గించొచ్చన్న అంచనాలు బ్యాంక్ స్టాక్స్ రాణించడానికి కారణమయ్యాయి. మరో వైపు అమెరికా-చైనా వాణిజ్యంపై అనిశ్చితి నెలకొనడంతో ఇతర ఆసియా మార్కెట్లు మాత్రం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76,996.78 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై, తర్వాత ఫ్లాట్‌గానే కదలాడింది. ఇంట్రాడేలో 77,110.23 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి, చివరికి 309.40 పాయింట్ల లాభంతో 7,044.29 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 119.05 పాయింట్ల లాభంలో 23,447.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.67గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్



బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్ టెల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర మరింత పెరిగింది. ఔన్సు 3,300 ఔన్సు డాలర్లు దాటి 3,317 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# బోయింగ్‌పై చైనా నిర్ణయం భారత్‌కు మేలు?

**ముంబై, ఏప్రిల్ 16:** బోయింగ్ విమానాల డెలివరీలను స్వీకరించకూడదంటూ తమ దేశ సంస్థలను చైనా ఆదేశించడం భారత్‌కు కలిసొచ్చేలా ఉంది. ఇప్పటికే పంపిణీ వ్యవస్థల్లోని ఇబ్బందుల వల్ల భారత్‌లోని వైమానిక రంగ సంస్థలు విమానాల కొరతతో ఇబ్బందిపడుతున్న వేళ.. బీజింగ్ నిర్ణయం సరికొత్త ఆశలు రేపుతోంది. ప్రస్తుతం చైనా సంస్థలు 100 బోయింగ్ బీ737 మ్యాక్స్ విమానాల డెలివరీల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇదే మోడల్‌ను భారత్‌కు చెందిన ఎయిర్ ఇండియా, ఆకాశ్ ఎయిర్ సంస్థలు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చాయి. వీటితోపాటు 11 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్లను కూడా ఎయిర్ ఇండియా ఇప్పటికే ఆర్డర్ పెట్టింది. ఈ నేపథ్యంలో చైనాకు డెలివరీకి సిద్ధమైన వాటిల్లో కొన్ని విమానాలు భారత్‌లోని కస్టమర్లకు మళ్లించవచ్చని వైమానిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది కూడా బోయింగ్ విషయంలో ఇలానే జరిగింది. ఒకరికని తయారుచేసిన రెండు విమానాలను చివరికి ఎయిర్ ఇండియా, ఆకాశ్‌లకు డెలివరీ చేయాల్సి వచ్చిందన్నారు. ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ మొత్తం గతేడాది 25బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలను కొనుగోలు చేసింది. మరో 25 విమానాల కోసం షెడ్యూల్ చేసింది. తాజాగా అమెరికాచైనా ట్రేడ్ వార్ నేపథ్యంలో అదనపు డెలివరీలను భారతీయ సంస్థలు పొందే అవకాశం ఉంది. ఇక ఇప్పటికే చైనా కోసం మ్యాక్స్ విమానాలను ఉత్పత్తి చేసేందుకు సియాటెల్‌లో అసెంబ్లీ యూనిట్‌లో ఏర్పాటుచేసిన అదనపు సామర్థ్యం మొత్తం నిరుపయోగంగా మిగిలిపోనుంది. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ సంస్థలు చైనా కోసం తయారుచేసిన విమానాలను, ఈ సంస్థలు ప్రత్యేకంగా ఆర్డర్ చేసిన లోహ విహంగాలను అందు కోనున్నాయి. మరోవైపు బోయింగ్‌కు ప్రత్యర్థి అయిన ఎయిర్‌బస్ సంస్థ రెండు అసెంబ్లింగ్ లైన్లను నిర్వహిస్తోంది. వీటిల్లో ఏ320 రకాలను నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో తమకు విమానాల డెలివరీలను పెంచాలని బీజింగ్ ఈ సంస్థను కోరనుంది. ఇంతకాలం బోయింగ్ విమానాల డెలివరీల్లో జాప్యం ఆకాశ్ ఎయిర్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఆ సంస్థ ప్రస్తుతం, తమ సమీప భవిష్యత్తు అవసరాలకు మించి పైలట్లను నియమించుకొంది. దీంతో కొంత మేరకు సిబ్బందికి పని లేకుండా పోతోంది. ఇక ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ సంస్థలకు అదనపు విమానాలను కొనుగోలు చేయగల ఆర్థిక సామర్థ్యం ఉంది.




# లగ్జరీ బ్రాండ్ల మోసాన్ని బయటపెట్టిన చైనీయులు..

**చైనా, ఏప్రిల్ 16:** ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం రోజు రోజుకీ తారాస్థాయికి చేరుతోంది. ఒక దేశంపై మరో దేశం భారీగా సుంకాలు విధించుకుంటూ తగ్గేదేలే అంటున్నాయి. అయితే తయారీ రంగానికి పెద్దన్నగా ఉన్న చైనా నుంచి అమెరికన్లకు పెద్ద ఎత్తున వస్తువులు ఎగుమతి అవుతాయి. ఈ క్రమంలో సోషల్ మీడియాలో అమెరికా బ్రాండ్లపై చైనా జోరుగా ట్రోల్స్ చేస్తోంది. ప్రస్తుతం ఈ ట్రోల్స్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోన్నాయి. టారిఫ్‌లు పెంచడంతో ధరలు కూడా భారీగా పెరుగుతాయి. తక్కువ ధరకు లభించే వస్తువు కూడా రెట్టింపు ధర చెల్లించి కొనాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే చైనీయులు అమెరికన్ బ్రాండ్ల ధరల అసలు మతలబుని బయటపెడుతున్నారు. చైనాలో తక్కువ ధరకే లగ్జరీ వస్తువులు తయారవుతున్నాయని, కానీ అమెరికాలో అవే వస్తువులు ఖరీదైన ధరలకు అమ్ముడవుతున్నాయని వెల్లడిస్తున్నారు. ఉదాహరణకు వెయ్యి డాలర్ల విలువైన వస్తువు అమెరికాలో 38వేల డాలర్లకు అమ్ముడవుతోందని పేర్కొన్నారు. ఈ విషయంపై చైనీయులు పలు విడియోలు రూపొందించారు. అలాగే ట్రంప్ నినాదం 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్'ని వ్యంగ్యంగా చూపిస్తూ విడియోలు చేస్తున్నారు.



# ఎన్‌సిఎస్ పోర్టల్‌తో స్విగ్గీ జోడి..

**ముంబై, ఏప్రిల్ 16:** దేశంలోనే అతి పెద్ద ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాంలలో ఒకటైన స్విగ్గీతో కేంద్రకార్మిక, ఉపాధిమంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా ఉపాధి అవకాశాలను బలోపేతం చేసే విస్తృత చొరవలో భాగంగా ఈ అవగాహనా ఒప్పందం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 500కి పైగా నగరాల్లో స్విగ్గీ సేవలు అందిస్తుంది. పలు రంగాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధిని సృష్టించడంలో స్విగ్గీ కీలక పాత్ర పోషిస్తోంది. దాదాపు 5 కోట్ల ఉద్యోగాలు ఈ ప్లాట్‌ఫామ్ అందిస్తుంది. లేబర్ మార్కెట్‌లో డిమాండ్, సరఫరా మధ్య అంతరాన్ని తగ్గించడానికి మంత్రిత్వ శాఖ ప్రైవేట్ ఏజెన్సీలతో కుదుర్చు కుంటున్న ఒప్పందాల శ్రేణిలో భాగంగా ఈ అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనిపై కేంద్ర కార్మిక, పర్యావరణ మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ, నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ ఉద్యోగార్థులకు సింగిల్‌విండో వ్యవస్థగా అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 31 కోట్లకుపైగా వ్యక్తుల డేటా ఇందులో ఉంది. కంపెనీల యజమానులు బాహ్యంగా ఉద్యోగ ప్రకటనలు చేయాల్సిన అవసరం లేకుండా లేబర్ కోసం ఇందులో నేరుగా ఎంపికలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తుంది. ఎన్‌సిఎస్ పోర్టల్ నియామక ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు సమగ్ర వేదికగా పనిచేస్తుందని మంత్రి మాండవీయ పేర్కొన్నారు. ఆయా కంపెనీల యజమానులు ఎన్‌సిఎల్ పోర్టల్‌ను యాక్సెస్ చేయవచ్చు. తద్వారా వారికి అవసరమైన అర్హతకలిగిన అభ్యర్థులను తక్షణమే గుర్తించడానికి అవకాశంఉంటుంది. ఇది దేశంలో ఉద్యోగ ఎంపికలు, నియామకాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని ఆయన అన్నారు. రాబోయే రెండు మూడు సంవత్సరాలలో స్విగ్గీ ఒక్కటే 10నుంచి 12లక్షల కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని అంచనా వేశారు. ఇలాంటి అవగాహన ఒప్పందాలపై సంతకం చేయడానికి మరిన్ని సంస్థలు సిద్ధంగా ఉన్నాయన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎన్‌సిఎస్‌పోర్టల్ ప్రముఖ వేదికగా మారుతుందని, లక్షలాదిమంది యువతకు ఉపాధిని అందిస్తూనే యజమానులు తమ శ్రామికశక్తి అవసరాలను తీర్చడంలో ఈ పోర్టల్ సహాయపడుతుందని మంత్రి మాండవీయ తెలిపారు.




# 'ఎక్స్'కు పోటీగా ఓపెన్‌ఏఐ సోషల్ మీడియా..

**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** చాట్‌జీపీటీ మాతృ సంస్థ ఓపెన్‌ఏఐ త్వరలో సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ను తీసుకురావాలని చూస్తోంది. ఎక్స్ లాంటి సామాజిక మాధ్యమ వేదికను పరిచయం చేయాలని చూస్తోందని సమాచారం. దీనికోసం ఇప్పటికే కసరత్తులు మొదలయ్యాయి. సంబంధిత వ్యక్తులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఓపెన్‌ఏఐ కొత్త సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ఇంకా అభివృద్ధి దశలోనే ఉందని తెలుస్తోంది. కంపెనీ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఈ ప్రాజెక్ట్ కోసం బయటివ్యక్తుల నుంచి అభిప్రాయాల్ని ప్రైవేట్‌గా కోరుతున్నట్లు సమాచారం. అయితే ఈ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ను స్వతంత్రంగా తీసుకొస్తారా? లేదా చాట్‌జీపీటీలో విలీనం చేస్తారా? అనే విషయం తెలియలేదు.



శామ్ ఆల్ట్‌మన్, ఎలాన్ మస్క్‌ల మధ్య గత కొంతకాలంగా విభేదాలు ఉన్న సంగతి తెలిసిందే. లాభాపేక్ష లేని సంస్థను తీర్చిదిద్దుతామని చెప్పి మాట తప్పారంటూ శామ్ ఆల్ట్‌మన్‌పై విమర్శలు చేసిన మస్క్, ఈ వ్యవహారంలో దావా కూడా వేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌కు పోటీగా కొత్త వేదికను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14